# నడుస్తున్న తెలంగాణ

ఆర్థిక, రాజకీయ, సాహిత్య మాసపత్రిక

సంపుటి: 14 సంచిక: 8 హైదరాబాద్ ఆగష్టు 2024 వెల: 20/-



- సామాజిక న్యాయం: వితండవాదం
- సర్వాయి పాపన్న ; ఒక చారిత్రక పరిశీలన
- కటిక దరిద్రుల ఆకలి పోరాటం - తంగలాన్

UGC APPROVED JOURNAL

UGC-CARE LISTED JOURNAL

# నడుస్తున్న తెలంగాణ

ఆర్థిక, రాజకీయ, సాహిత్య మాసపత్రిక

ISSN 2349-2376

ఆగస్టు 2024
సంచిక : 8
సంపుటి : 14

UGC APPROVED JOURNAL

UGC CARE LISTED JOURNAL



గౌరవ సంపాదకులు
**ప్రొ॥ అడపా సత్యనారాయణ**

సలహామండలి
**అల్లం నారాయణ**
పూర్వ చైర్మన్-ప్రెస్ అకాడమి
**ప్రొఫెసర్ గణేష్**
ప్రిన్సిపాల్(మాజీ), ఆర్ట్స్ కళాశాల, ఓయు.

ప్రధాన సంపాదకుడు
**ప్రొఫెసర్ చింతకింది కాశీం**

సంపాదకురాలు
**స్నేహలత ఎం.**

సంపాదకవర్గం

**ప్రొఫెసర్ ఎ. సిల్మానాయక్,**
ప్రిన్సిపాల్, టి.ఎస్.పి. కళాశాల
**క్రాంతి**, జర్నలిస్టు
**డా॥ చంద్రయ్య ఎస్.** అసిస్టెంట్ ప్రొఫెసర్(PT)
**డా॥శివరాత్రి సుధాకర్**
**ఇమ్మిడి మహేందర్** అసిస్టెంట్ ప్రొఫెసర్(PT)

డిటిపి, లే ఔట్ : స్నేహ
కవర్ డిజైన్ : క్రాంతి



రచనలు పంపవల్సిన చిరునామా
**స్నేహలత ఎం.,**
ఇంటి నెం. 2-95, ఫ్లాట్ నెం. 301,
వైష్ణవి స్మార్ట్, రోడ్ నెం. 2,
కాకతీయ నగర్, హబ్సిగూడ
హైదరాబాద్-500 007.
ఇ.మెయిల్: nadusthunnatelangana@gmail.com
ఫోన్ నెం.: 9290745490


## సంపాదకుని ఉత్తరం

దినపత్రికను చూస్తే భయమేస్తుంది
పసిబిడ్డల
రక్తాన్ని పులుముకుంటుందని
సీతాకోకచిలుకల్లా
విహరించవలసినవాళ్లు
ఉక్రెయిన్ మైదానాల్లో
పాలస్తీనా తరగతి గదుల్లో
పువ్వుల్లా
రాలిపోతున్నారు
యుద్ధమా
నీ ఇంట్లో పీనుగెల్లా

30 ఆగస్టు 2024


నూరు పూలు వికసించనీ, వేయి ఆలోచనలు సంఘర్షించనీ అన్నట్లు ప్రజానుకూలమైన భిన్న ఆలోచనలకు మా పత్రికలో చోటుంటుంది. కనుక ఈ పత్రికలో ముద్రించిన అభిప్రాయాలు రచయితలవే. సంపాదక వర్గానికి ఏకీభావం ఉండనవసరం లేదు.

# తెలంగాణ తొవ్వ

**సంపాదకీయం**

సామాజిక న్యాయం; వితండవాదాలు — **ప్రొఫెసర్ చింతకింది కాశీం** — 5

**నడుస్తున్న కాలం**

ఇది గద్దర్ చరిత్ర — **ప్రొఫెసర్ చింతకింది కాశీం** — 7

**సామాజికం**

విద్యార్థులను వెంటాడుతున్న పేపర్ లీకేజీలు — **డా॥సిలువేర్ హరినాథ్** — 15

**పరిశోధన**

విశ్వర్షి వాసిలి'నేను' -శైలీశాస్త్రానువర్తనం — **డా॥బోలుగద్దె అనీల్‌కుమార్** — 17

'మా భూమి' నాటకం-భూస్వామి, రైతు సంబంధాలు — **డా॥ ఎమ్. శంకర్** — 23

**విమర్శ**

విమల కథలు; సామాజికార్థిక విశ్లేషణ — **పల్లపు స్వాతి** — 29

సర్వాయి పాపన్న; ఒక చారిత్రక పరిశీలన — **బొల్లోజు బాబ** — 39

**పుస్తక సమీక్ష**

లంబాడా జీవితాల చిత్రిక 'యాడి' కథలు — **గజవెల్లి ఈశ్వర్** — 44

**సినిమా సమీక్ష**

కటిక దరిద్రుల ఆకలి పోరాటం-తంగలాన్ — **తాడి ప్రకాశ్** — 49

**నడుస్తున్న తెలంగాణ ఆన్‌లైన్ వర్షన్ కోసం కింది పేజీలను సంప్రదించవచ్చు.**
**వెబ్ పేజీ:** https://nadustunnatelangana.com

# సామాజిక న్యాయం; వితండవాదాలు

ప్రొఫెసర్ చింతకింది కాశీం

సామాజిక సంపద, సామాజిక హక్కులు అందరికి సమానంగా పంపిణి జరగాలనేది ఉదాత్త భావన. మనిషి ఆలోచనల స్రవంతిలో ఒక భావన రూపొందటమే అపురూపం. ఒక్కోసారి భావన భావుకతగా మారుతుంది. భావుకత సౌందర్యాత్మక కవిత్వంగా రూపొందుతుంది. ఆ రూపకం సమాజాన్ని సుందర లోకాలలో విహరింపచేస్తుంది. ఇదంతా కవిత్వం సంగతి. సామాజిక న్యాయభావన గురించి మనిషి నిరంతరం సంవాదం చేయవలసి వస్తుంది. ఇదంతా కవిత్వం సంగతి. సామాజిక న్యాయభావన గురించి మనిషి నిరంతరం సంవాదం చేయవలసి వస్తుంది. అతి ప్రాచీనకాలం నుంచి న్యాయభావన మనుషుల మధ్యన రూపొందుతూ వచ్చింది. మధ్యయుగాలలో రాజ్యం సంతరించుకున్న భావాలలో సామాజిక ఒడంబడిక ఒకటి. రూసో తన సోషల్ కాంట్రాక్ట్ థియరీలో మనుషులకు, రాజ్యానికి మధ్య ఉండవలసిన పరస్పర అవగాహనను విస్తృతంగా చర్చించి, సామాజిక ఒడంబడిక సిద్ధాంతాన్ని అందించాడు. నాటి నుంచి సామాజిక న్యాయభావన గురించిన స్పృహ పౌరులకు ఏర్పడింది. అసమసమాజంలో సమాన విలువలకోసం అన్వేషణ ఆనాడే ప్రారంభమయింది. ఆధునిక కాలం వచ్చే నాటికి అదొక సిద్ధాంతంగా రూపుదాల్చింది. కానీ సమాజంలో సామాజిక న్యాయాన్ని సాధించటానికి ఎంతో రాపిడి జరిగింది, జరుగుతూ ఉంది.

విద్య, ఉద్యోగం, రాజకీయ ప్రాతినిధ్యం అనే భావన బ్రిటిష్ ఇండియాలో రూపొందింది. సమాజ అంతరాల్లో ఉండిపోయిన శ్రేణులు, ఉపశ్రేణులు ప్రధాన స్రవంతికి ఆవలి నుంచి ఎన్నో ప్రశ్నలను ఉంచుతూ వచ్చారు. ఈ ప్రశ్నలకు సమాధానాలు వెతికే క్రమంలో మానవ సమాజం ఎంతో సంఘర్షణను అనుభవించింది. ఇలాంటి వైరి సంభాషణ నుంచి కొత్త ఆలోచనలు, పరిష్కారాలు లభించాయి. మనుషులందరూ సమానమే అనే విలువను ప్రతిపాదించగానే నాటి సమాజం ఉలికిపడింది. సామాజిక సంబంధాలలో పొడసూపిన అసమ విలువను ప్రశ్నించి ధిక్కరించే భావనను కొందరైనా ప్రోదిచేసారు. సామాజిక ఉత్పత్తి మీద సమాన హక్కులనే పునాది వాదన మొదలు ఉపరితల సామాజిక సంబంధాలలో ఉండవలసిన ఏకరూపత గురించిన ఆలోచనలు మొగ్గతొడిగాయి. ఆంగ్ల విద్యద్వారా పొందిన జ్ఞానం మనిషి ఆలోచనల స్రవంతిని విశాలం చేసింది. తోటి మనిషి గురించిన చింతన ప్రోది అయింది. ఈ దేశంలో సామాజిక న్యాయభావనకు అంకురార్పణ చేసింది మహాత్మ జ్యోతిరావుపూలే. కొన్ని అవకాశాలకు కొందరు మనుషులు ఎందుకు మినహాయింపబడుతున్నారనే చర్చను సమాజంలోకి ప్రవేశపెట్టాడు. ముఖ్యంగా గుడి, బడి, ఆధికారంలోకి శూద్రుల ప్రవేశం ఎందుకు లేదనే ప్రశ్న ఉత్పన్నమయింది. కొందరు మనుషులను ఊరికి ఆవల అంటరాని జీవులుగా మార్చిన అమానవీయతపై పూలే తన అసమ్మతిని ప్రకటించాడు. కనీసం దిగువన ఉండే శ్రేణులకు అక్షరజ్ఞానం అందాలని ఆయన భావించి, ఆచరణాత్మకమయ్యారు. కనుక పూలేను మొదటి సామాజిక విప్లవకారుడిగా చరిత్ర గుర్తుచేసుకుంటుంది.

శూద్రులకు, అతిశూద్రులకు విద్య, సామాజిక అవకాశాలు సమానంగా అందాలని పూలే కోరినప్పుడు బ్రాహ్మణీయశక్తులు ప్రతిఘటించాయి. సమానత్వ భావనను నిరాకరించాయి. అక్షరం ఎల్లెడలా విస్తరించాలని భావించిన సావిత్రిబాయిని అవే బ్రాహ్మణీయ శక్తులు అవమానించాయి. దేశంలో జాతీయోద్యమం విస్తృతమయ్యేకొద్దీ సమాజ చలనంలో వేగం పెరిగింది. రష్యాలో జరిగిన సోషలిస్టు విప్లవం ప్రపంచాన్ని ప్రభావితం చేసింది. మొదటి ప్రపంచ యుద్ధం మానవ జీవితంలో విధ్వంసాన్ని సృష్టించింది. ఈ నేపథ్యంలో జాతీయోద్యమం కూడా కొత్త పరికరాలతో ప్రపంచంతో సంభాషించటం మొదలుపెట్టింది. దేశంలో విస్మరణకు గురైన శ్రేణులను, ఉపశ్రేణులను సమ్మిళితం చేస్తేనే జాతీయోద్యమం పరిపూర్ణమవుతుందనే భావన నాటి నాయకత్వంలో ఏర్పడింది. ఎగువస్థాయి నాయకత్వం అస్పృశ్యుల నివాసాలలోకి ప్రవేశించింది. దీనికితోడు ఆంగ్ల విద్య, క్రైస్తవ మిషనరీలు అంటరానివర్గాలకు అక్షరాన్ని వాగ్దానం చేసాయి.

మహారాష్ట్రలో వచ్చిన భక్తి ఉద్యమం అక్కడి సమాజాన్ని కదలబార్చింది. పీష్వాల అమానవీయ పరిపాలనకు బలైన అస్పృశ్యులు బ్రిటిష్ సైన్యంలో చేరారు. మహర్ రెజిమెంట్‌ను ఏర్పాటు చేసుకొని పీష్వాలతో పోరాటం చేసారు. బీమానది ఒడ్డున జరిగిన హెూరాహెూరి యుద్ధంలో మహర్ సైనికులు వీరమరణం పొందారు. ఈ యుద్ధం మహర్ సమాజంలో ఆత్మస్థైర్యాన్ని ఇచ్చింది. ఉపాధి లభించటం వలన తమ పిల్లలను చదివించాలనే చిన్నపాటి ఆశ వారిలో అంకురించింది. కానీ ఘనీభవించిన ఆ సమాజం మహర్‌లను విద్యలోకి ప్రవేశించకుండా అనేక పరిమితులను విధించింది. ఈ పరిమితులను దాటుకొని అంబేద్కర్ అక్షరాన్ని సొంతం చేసుకున్నాడు. ప్రాపంచిక జ్ఞానాన్ని విస్తృతంగా పొందాడు. ఈ దేశాన్ని అధ్యయనం చేసి ఇక్కడి సామాజిక నిర్మాణంలో ఉన్న అమానవీయత మీద పదునైన అక్షరాలతో తన అసమ్మతిని ప్రకటించాడు. బుద్ధుడు, కబీర్, పూలేలు నిర్మాణం చేసిన సామాజిక న్యాయభావనను నిజమైన అర్థంలో అనుసరించి, దాన్ని ఆచరణాత్మకం చేయడానికి పూనుకున్నాడు. అంబేద్కర్ సామాజిక న్యాయం గురించి మాట్లాడినప్పుడల్లా సంప్రదాయవాదులు, బ్రాహ్మణీయశక్తులు, గాంధీ కాంగ్రెస్ ఉలికిపడేది. ప్రతీపశక్తులుగా సామాజిక న్యాయానికి అడ్డుపడేవాళ్లు.

విద్యలోకి ప్రవేశం, ఉద్యోగాలలో సమానవాటా, ప్రభుత్వంలో ప్రాతినిధ్యాన్ని అంబేద్కర్ అడిగాడు. అప్పటి ఆధిపత్యశక్తులు అంబేద్కర్ వాదనను, చిన్నపాటి కోరికను కూడా అంగీకరించలేదు. అనివార్యంగా ఆయన బ్రిటిష్ ప్రభుత్వంతో సామాజిక న్యాయసాధన కోసం సంభాషణ నడిపాడు. సైమన్ కమీషన్ ముందు తన ప్రజల న్యాయమైన డిమాండ్‌ను ఉంచాడు. కానీ, ప్రభావిత వర్గాలు ఆనాడు అంబేద్కర్‌ను బ్రిటిష్ ఏజెంట్ అంటూ అవమానించారు. అయినా ఆయన వెన్నుచూపకుండా పోరాటంలో నిలబడ్డాడు. 1930, 1931లో బ్రిటిష్‌లో జరిగిన రెండు రౌండ్ టేబుల్ సమావేశాలలో పాల్గొని భారతదేశంలో సామాజిక న్యాయ సాధనకోసం

కృషిచేసాడు. ఆశ్చర్యమేమిటంటే మొదటి రౌండ్ టేబుల్ సమావేశాలను బహిష్కరించిన గాంధీ కాంగ్రెస్ అంబేద్కర్ ప్రతిపాదించిన సామాజిక న్యాయాన్ని నిలువరించడానికి రెండో రౌండ్ టేబుల్ సమావేశాలకు హాజరయ్యారు. ఈ దేశంలోని అస్పృశ్యులకు విద్యలో, ఉద్యోగాలలో రిజర్వేషన్లు, ప్రత్యేక నియోజకవర్గాలను అంబేద్కర్ అడిగాడు. గాంధీ ఈ సామాజిక న్యాయ ప్రతిపాదనను వ్యతిరేకించాడు. రిజర్వేషన్లు అనే భావనను హరిజనోద్ధరణ కోరుకున్న గాంధీ రౌంటేబుల్ సమావేశాలలో పూర్వపక్షం చేసాడు. కానీ అంబేద్కర్ ప్రతిపాదించిన ప్రకృతి న్యాయభావన సారాంశమే సామాజిక న్యాయం, కనుక బ్రిటిష్ ప్రభుత్వం అంబేద్కర్ ప్రతిపాదనను అంగీకరించి చట్టబద్ధం చేస్తే దీనిని అంగీకరించని గాంధీ ఎరవాడ జైలులో ఆమరణ దీక్షకు పూనుకున్నాడు. సామాజిక న్యాయభావనను సమాధి చేయాలని గాంధీ ప్రయత్నం చేసాడు. అంబేద్కర్ చేసిన అవిశ్రాంత పోరాట ఫలితంగా బ్రిటిష్ ప్రభుత్వం విద్యలో, ఉపాధిలో డిప్రెస్డ్ క్లాసెస్‌కు రిజర్వేషన్లు కల్పించడానికి అంగీకరించింది. గాంధీ అడ్డుపడడం వలన ప్రత్యేక నియోజకవర్గాలకు బదులు రిజర్వుడు నియోజకవర్గాలు అస్పృశ్యులకు వచ్చాయి. రాజ్యాంగ సభ లోపల, వెలుపల అంబేద్కర్ సల్పిన పోరాటం ఫలితంగా ఎస్సీ, ఎస్టీ వర్గాలకు విద్య, ఉద్యోగ, రాజకీయ రంగాలలో చట్టబద్ధ రిజర్వేషన్లు అందాయి.

రాజ్యాంగం అమలులోకి వచ్చిన ఈ డెబ్బై ఐదు ఏళ్ల కాలంలో రిజర్వేషన్ల చర్చ వచ్చినప్పుడల్లా ఆధిపత్య వర్గాలు 'ప్రతిభ సిద్ధాంతాన్ని' ముందుకు తెస్తున్నారు. ముఖ్యంగా బీసీ వర్గాలకు రిజర్వేషన్లు ఇవ్వాలని ప్రతిపాదించిన మండల్ కమీషన్ సందర్భంలో దేశవ్యాపితంగా ఎగువకులాలు రిజర్వేషన్లను, సామాజిక న్యాయాన్ని వ్యతిరేకించాయి. ఇప్పటికీ ప్రతిభ, క్రీమీలేయర్ వాదనలను ముందుకు తెస్తూనే ఉన్నారు. ఉత్పత్తి వర్గాలు పొందుతున్న రిజర్వేషన్ల వలన తమ సొంత వాటాలను కోల్పోతున్నట్లు రిజర్వేషన్ల వ్యతిరేకులు చర్చలు చేస్తున్నారు. రాజ్యాంగం అందించిన ఫలాలను జనాభా దామాషా ప్రకారం పంచుకోవడాన్ని ఆధిపత్య వర్గాలు వ్యతిరేకిస్తున్నారు. రిజర్వేషన్ల వలన ప్రజలను విభజించినట్లుగా, ప్రతిభ దెబ్బతింటున్నట్లుగా భావించి ప్రతీపశక్తులుగా వ్యక్తమవుతున్నారు.

ఎనభయో దశకం తర్వాత సమాజంలో చాలా మార్పులు వచ్చాయి. అంబేద్కర్‌వాదులు, మార్క్సువాదులు, విప్లవ శక్తులు సమాజంతో నడిపిన సంవాదం వలన సామాజిక సమూహాలన్నీ తమ లోగొంతులను విన్పించడం మొదలయింది. సామాజిక సంపదలో, రాజ్యాధికారంలో, అవకాశాలలో తమ లేమితనాన్ని చర్చకు పెట్టారు. అవన్నీ బహుజన, దళిత, ఆదివాసీ ఉద్యమాలుగా వ్యక్తమయ్యాయి. ఎప్పుడైతే శ్రేణులు తమ ఆకాంక్షలను చర్చకు పెట్టాయో, ఆ వెనువెంటనే ఉపశ్రేణులు కూడా తమ సంగతేమిటని అడగటం సహజమే కదా! తెలుగు నేలమీద దళిత ఉద్యమం ఇచ్చిన చైతన్యం వలన ప్రధాన స్రవంతికి చాలా దూరంగా ఉండే ఉపశ్రేణులు వెలుగులోకి వచ్చాయి. తమ ఆకాంక్షలను చర్చకు పెట్టి పరిష్కార మార్గాలను చూపమని బేలగా అర్థించాయి. కానీ ఆధిపత్య భావజాలం కల్గిన శ్రేణులు, ఉపశ్రేణుల ప్రశ్నను విస్మరించాయి. ఉదాసీనతను ప్రకటించాయి. ఆధిపత్య వర్గాలు శ్రేణుల పట్ల కనబర్చిన నిర్లక్ష్య, నిరాకరణ భావననే శ్రేణులు ఉపశ్రేణుల పట్ల వ్యక్తమయ్యాయి. కానీ తమ అసమ్మతిని ప్రకటించే చైతన్యం ఒక స్థాయికి అందాక అది అక్కడితో ఆగకుండా కింది వరకు వ్యాపించటం సహజ సూత్రమే కదా! కనుక ఉపశ్రేణులు బిగ్గరగా వ్యక్తంకావటం ప్రారంభించాయి. అలా వ్యక్తమైన గణనీయ ఉద్యమం మాదిగ దండోరా. 1994 నుంచి దాని ప్రయాణం మొదలై కనీస హక్కులకోసం సంవాదాన్ని నడుపుతున్నది. రాజ్యాంగం అమలైన ఈ కాలంలో ఫలాలు అందరికి సమానంగా చేరలేదని చెప్పటానికి తర్కం అక్కర్లేదు. రిజర్వేషన్ ఫలాలను మొత్తం కొందరే అనుభవించడం సామాజిక న్యాయ భావనకు భిన్నమయింది. కనుక ఆఖరి మనిషి వరకు రిజర్వేషన్ ఫలాలు అందాలనే సూత్రమే మాదిగ దండోరా ఉద్యమానికి ప్రాతిపదిక.

ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణ వలన ఎస్సీ కులాలన్నింటికి సామాజిక న్యాయం చేకూరుతుందని చెప్పటానికి సిద్ధాంతాలను రూపొందించవలసిన అవసరం లేదు. ప్రజాస్వామికంగా ఆలోచిస్తే సరిపోతుంది. కానీ వర్గీకరణకు అనుకూలంగా ప్రభుత్వాలు చట్టం చేసినా, కోర్టులు తీర్పులు ఇచ్చినా అవి అమలుకాకుండా అడ్డుకునే భావజాలం దేనికి ప్రాతినిధ్యం వహిస్తుందో ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. అంబేద్కర్ సామాజిక న్యాయం అడిగినప్పుడు ఐక్యత నెపంతో గాంధీ వ్యతిరేకించాడు, బీసీలకు రిజర్వేషన్లు కావాలంటే ఆధిపత్యవర్గాలు ప్రతిభ పేరుమీద వ్యతిరేకించాయి. వర్గీకరణ ద్వారానే సామాజిక న్యాయం జరుగుతుందని ముప్పై ఏళ్లుగా మాదిగలు అడుగుతుంటే ఐక్యత, ప్రతిభ పేరుమీద వ్యతిరేకించే సమూహానికి సామాజిక ఆమోదం ఎలా ఉంటుంది? అంబేద్కర్ డిప్రెస్డ్ క్లాసెస్‌కు ప్రత్యేక నియోజకవర్గాలు అడిగితే, భారతీయుల మధ్య ఐక్యతకు పరిమితులు విధించడానికి అంబేద్కర్ బ్రిటిష్‌వాళ్లకు అనుకూలంగా పనిచేస్తున్నాడని గాంధీ కాంగ్రెస్ ప్రచారం చేసింది. సరిగ్గా వర్తమానంలో దళితులు రాజ్యాధికారం వైపు వెళ్లకుండా మాదిగ నాయకత్వం అగ్రకులాలకు అనుకూలంగా కుట్రచేస్తుందని వర్గీకరణ వ్యతిరేకులు ప్రచారం చేస్తున్నారు. విషాదమేమిటంటే ఒకప్పటి గాంధీ కాంగ్రెస్ మాట ఇవ్వాళ ఒక వర్గం దళిత మేధావుల నోటి నుంచి రావటమే.

సత్యానికి సవాళ్లు ఎక్కువే. అబద్ధానికి రాచమార్గం ఎప్పుడూ ఉంటుంది. కనుక సామాజిక న్యాయంకోసం ఆచరణలో ఉన్న నాయకత్వం సంయమనంతో, ఓపికతో పనిచేయాలి. కాలం విధించిన పరిమితులను దాటుకొని న్యాయాన్ని అందుకోవాలి. ఆనాడు అంబేద్కర్ వెంట మొత్తం సమాజం లేదు. కానీ ఇవ్వాల్టి మాదిగలు అడుగుతున్న సామాజిక న్యాయ భావన వెంట మద్దతుగా సమాజమంతా నిలబడింది. మాదిగలు ఒంటరివాళ్లు కాదని రుజువయింది. న్యాయం ఏకాకి కాదని అనుభవంలోకి వచ్చింది. వర్గీకరణ వ్యతిరేకులు తెలిసో, తెలియకో సమాజం నిండా వ్యాపించిన ఆధిపత్య భావజాలం ప్రభావానికి గురై ఉన్నారు. నిజంగా వాళ్లు ప్రతిపాదిస్తున్న ఐక్యత, రాజ్యాధికారం రావాలంటే ఉన్న అవకాశాలను సమానంగా పంచుకోవడం వలననే సాధ్యమవుతుందని విస్తృత ప్రచారం చేయాలి. సామాజిక న్యాయభావన సాధనకోసం మొత్తం సమాజాన్ని ఒప్పించినట్లు వర్గీకరణ వ్యతిరేకులను కూడా ఒప్పించవలసిన బాధ్యతను మాదిగ నాయకత్వం చేపట్టాలి. ప్రభుత్వంమీద విస్తృతమైన ఒత్తిడి పెట్టి వర్గీకరణకు చట్టబద్ధతను పొందాలి.


T

# ఇది గద్దర్ చరిత్ర

ప్రొ॥ చింతకింది కాశీం

కొందరు చరిత్ర చేత ప్రభావితం అవుతారు. మరికొందరు చరిత్రను ప్రభావితం చేస్తారు. ఇంకొందరు చరిత్రను సృష్టిస్తారు. ఈ మూడింటి కలనేతనే గద్దర్ చరిత్ర. చరిత్ర అంటే 'గతానికి, వర్తమానానికి మధ్య జరిగే అనంతమైన సంభాషణ' అని ఇ. హెచ్. కార్ అనే పరిశోధకుడు, చరిత్రకారుడు చెప్పిన మాటనే గుర్తు చేస్తున్నాను. గద్దర్ ఈ యాభై ఏళ్ల వర్తమానంలో పాటకవిగా, నాట్యకారుడిగా, వక్తగా, నాయకుడిగా... వీటన్నింటి సమ్మేళన వాగ్గేయకారుడిగా ఈ చరిత్రతో సంభాషించాడు. గతం తాలూకు విషాదాలను గానం చేస్తూ వర్తమానాన్ని వ్యాఖ్యానించాడు. భవిష్యత్ సుందర స్వప్నాలను ఆవిష్కరించాడు. అర్ధ శతాబ్దాన్ని (1973-2023) తన కవిత్వంతో, గానమాధుర్యంతో, ఆచరణతో శాసించాడు. ఈ యుగానికి ఆయననే యుగకర్తగా రూపొందాడు. అగ్రహారం మెడలో జంధ్యమై ఊరేగుతున్న విప్లవాన్ని తన అంటరాని మునివేళ్లతో తాకి ప్రజలపరం చేసాడు.

గద్దర్‌ను సమాజం రూపొందించిందా; లేదా గద్దరే సమాజాన్ని రూపొందించాడా అనే ప్రశ్న వేసుకుంటే, ప్రతి వ్యక్తి సమాజ నిర్మితమేనని కొత్తగా చెప్పవలసిన అవసరం లేదు. సమాజం, మనిషి అవిభాజ్యాలు, పరస్పరాశ్రయాలు. గద్దర్ కూడా మన సమాజం చేత రూపుదిద్దబడ్డాడు. అతని భాష, భావం, వ్యక్తీకరణ నైపుణ్యాలు అతడి సామాజిక వర్గం నుంచి గ్రహించాడు. ఆ వర్గ సమూహమే ఆయన ఆలోచనా పద్ధతిని నిర్ణయించింది. కానీ కాలక్రమంలో పెట్టుబడిదారి సమాజాలు ఉనికిలోకి వచ్చాక వ్యక్తిని సమూహం నుంచి వేరు చేసే ప్రయత్నం జరిగింది. వ్యక్తి ప్రతిభ కూడా సరుకుగా మారింది. వ్యక్తి భావన, ఆరాధన పెరిగింది. అయితే పాశ్చాత్య సామాజిక శాస్త్ర విశ్లేషకులలో కొందరు వ్యక్తివాదం కొన్ని సందర్భాలలో సహజం అనే అభిప్రాయాన్ని వెలిబుచ్చారు. సమాజంలో తమకు అనుకూలంగా ఉండే కొన్ని భావాలను ప్రచారం చేయటం కోసం, ప్రతికూల భావాలను పూర్వపక్షం చేయటం కోసం కొన్ని



వర్గాలు ప్రయత్నం చేస్తుంటాయి. ఈ క్రమంలో సంఘర్షణలు జరుగుతుంటాయి. ఈ నేపథ్యం నుంచే కొందరు వ్యక్తులు సమూహాల నుంచి నాయకులుగా ఎదుగుతారు. గద్దర్ అలా తన చరిత్రను తానే నిర్మించుకుంటూ సాంస్కృతికోద్యమ నాయకుడుగా ఎదిగాడు. విప్లవం, విప్లవోద్యమం లేకపోతే గద్దర్ లేడనే వాదన సామాజిక నిర్మితిలో నుంచే వస్తే అర్థం చేసుకోవచ్చునేమో, కానీ ఈర్ష్య, ద్వేషంతో వచ్చిందయితే ఆ వాదనకు మరుగుజ్జుతనం ఏర్పడుతుంది. ఆయన పాటకు వస్తువు విప్లవమే. ఆయన శ్రోతలు విప్లవకర వర్గ ప్రజలే. అయితే విప్లవం, విప్లవోద్యమం గద్దర్‌తో పాటు వేలాది కళాకారులకు వేదికలను ఇచ్చింది, కానీ అందరూ గద్దర్ కాలేకపోయారు. అంటే వస్తుగత స్థితితోపాటు వ్యక్తి ప్రతిభ, కృషి కూడా విస్మరించలేనిదిగా ఉంటాయనే సత్యాన్ని కాదనలేము. గద్దర్‌లోని సృజనాత్మక కార్యకలాపం అతడి వైయక్తికమే. ఇలాంటి అనేక తాత్విక ప్రశ్నలకు సమాధానం దొరకని ఒక అరుదైన వ్యక్తిత్వం గద్దర్.

బహుళ పార్శ్వాలున్న గద్దర్ గురించి ఆయన మరణానంతరం ఒక పుస్తకాన్ని ప్రచురించటం సాహసమే. ఈ సాహసానికి సామిడి జగన్‌రెడ్డి పూనుకున్నాడు. జగన్‌రెడ్డి కూడా సాహసుడే. ప్రయోగాలు చేయడం ఆయనకు ఇష్టమైనపని. ఎత్తిరాతలు, చూసిరాతలు జగన్‌రెడ్డికి గిట్టనిపని. తనదైన సంవిధానంతో లోతైన పరిశోధన చేసి అక్షరాలకు పుటం పెట్టి సమాజంలోకి తీసుకరావటం ఆయనకు అలవాటు. రాసిన ప్రతీ అక్షరాన్ని అడ్డు నిలువు కొలతలు వేసుకొని ఒకటికి పదిసార్లు పరీక్షించి పాఠకుల ముందుకు తెచ్చే నాణ్యమైన రచయిత. సాహిత్య విద్యార్థిగా కావ్యాలంకార సంగ్రహాన్ని, కవిత్వ తత్వ విచారాన్ని సూక్ష్మంగా పఠించి వాటి సారాన్ని సులభంగా అందించే కృషి చేస్తున్నాడు. అలంకార శాస్త్రాన్ని, మార్క్సిస్టు సాహిత్య విమర్శను ఆకలింపు చేసుకొని తన రాతకు పదునుపెట్టుకున్నాడు. కేవలం సాహిత్య విద్యార్థిగా ఉంటే ఆయన రచన గురించి ప్రత్యేకంగా చెప్పుకోనవసరం లేదు, ఆయన సామాజిక, చారిత్రక, రాజకీయార్థశాస్త్రాలను అధ్యయనం చేయడం వలన సమన్వయ సంస్కారం ఏర్పడింది. జగన్‌రెడ్డి స్పష్టమైన ప్రాపంచిక దృక్పథం కలిగిన విద్యార్థి రాజకీయాల నుంచి ఎదిగివచ్చాడు. సమాజ చలనం ప్రగతిశీలంగా ఉండాలని కోరుకున్నాడు. అందుకే రాడికల్ విద్యార్థిగా తన ప్రస్థానాన్ని మొదలుపెట్టాడు. ఎనభయో దశకం తెలుగు నేలను కుదుపునకు గురిచేసింది. సాహిత్యం, రాజకీయాలు పెనవేసుకొని ప్రయాణించాయి. జగన్‌రెడ్డి ఆ ప్రభావంలోకి వెళ్లాడు. ఈ దేశ ముఖచిత్రాన్ని వందేమాతరం కవితలో ఆవిష్కరించిన చెరబండరాజు జగన్‌కు ఇష్టమైన కవి అయ్యాడంటే ఆయన పరిణామక్రమాన్ని మనం ఊహించవచ్చును.

హైదరాబాద్ నగర సాహిత్య వాతావరణంలో జగన్ పదునెక్కాడు. నేల పురివిప్పిన గాలి వీచికలో, నిండుకుండ లాంటి ఆకాశం ప్రసవించిన చినుకులో తడిచిన తర్వాత ఆ సాంద్రత ఘనీభవించేలోపు ఎవరమైన అక్కడి వాతావరణంలో మమేకం కావలసినదే. అట్లా హైదరాబాద్ సంస్కృతిలో జగన్ భాగమయ్యాడు. ఆయనకు తెలుగుతోపాటు ఉర్దూ, ఆంగ్లం వచ్చు. కనుక గజల్స్ మీద అవగాహన ఉంది. అట్లే హిందుస్తానీ సంగీతంతో పరిచయముంది. ఆ కాలంలో ఆంధ్ర సారస్వత పరిషత్తులో జరిగే సాహిత్య చర్చలు అతడిని వెంటాడుతున్న దాహాన్ని తీర్చాయి. దివాకర్ల వేంకటావధాని మహాభారత ఉపన్యాసాలు, కాళోజీ తిరుగుబాటు కవిత్వం, చెరబండరాజు విప్లవ పాటలు, వరవరరావు నిప్పులు కురిసే ఉపన్యాసాలు, త్రిపురనేని మధుసూదన్‌రావు విప్లవ విమర్శా దృష్టి, కేవీఆర్ సామాజిక పరిశోధనా పద్ధతి మొదలైన సాహిత్య ప్రభావాలన్నీ ఈ కాలంలోనే జగన్ పొందాడు. ఇదే కాలంలో అంటరానివాకిళ్లు, అక్షరాలను ఆరేసి ఎండు తునకల చమురుతో పదునుపెడుతూ పంచమవేదం విన్పించాయి. మనలో సగం ఆకాశమంత ఎత్తుకు అరిచి నీలిమేఘాల సంవాదాన్ని ప్రారంభించారు. ఇలాంటి వికసిత కాలంలో జగన్ ఆబగా సాహిత్యాన్ని గుండెలకు హత్తుకున్నాడు. ఆయన విలక్షణమైన సమన్వయ దృష్టిని సాధించడానికి పదునెక్కిన కాలం ఆలంబనగా ఉండింది. ఆంగ్ల సాహిత్య అధ్యయనం వలన ఇక్కడి ఫ్యూడల్ పరిమితులను అధిగమించాడు.

జగన్‌రెడ్డి శూద్ర సామాజిక వర్గం నుంచి రావటం వలన ఆయనకు ప్రజల సాహిత్యం మీద ప్రేమ ఉంది. ఆ సాహిత్య నిర్మాణం మీద అవగాహన ఉంది. సంగీతం పట్ల శ్రద్ధ ఉంది. ఉర్దూ గజల్స్, హిందుస్తాని సంగీతం, ప్రజల పాటలు... ఈ మూడింటి పరిచయం వలన జగన్ వాగ్గేయకారుల గురించి అడపాదడపా రాస్తున్నాడు. ఇంగ్లీష్ పాప్ సింగర్స్ ఒరవడిని కూడా పరిచయం చేసుకున్నాడు. తెలంగాణ, ఆ మాటకొస్తే తెలుగు నేలలో ప్రజాసాహిత్య మంటే పాటనే. ఇక్కడ ప్రజలంటే శ్రమజీవులు, శ్రమజీవుల పట్ల సానుభూతిగా ఉండేవాళ్లు అనే

అర్థంలో వాడుతున్నాను. ప్రజాసాహిత్యమంటే మాత్రం శ్రమజీవుల సాహిత్యమే. పోరాడే ప్రజలకు మద్దతుగా ఉండే మధ్యతరగతి ప్రజల కోసం రాసే కవిత్వం, కథ, నవల, వ్యాసం, విమర్శ ఇంకా ప్రజా సాహిత్యం స్థాయిని అందుకోలేదు. కనుక ప్రజా సాహిత్యమంటే కేవలం పాటనే. తెలంగాణలో మౌఖిక పాట, తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో వచ్చిన బండి యాదగిరి, సుద్దాల హనుమంతు రాసిన పాటలు. ఈ లెగసిని దిగంతాలకు వ్యాపింపచేసిన పాట కవి గద్దర్. బండి యాదగిరి, సుద్దాల హనుమంతు ప్రస్తావన జగన్ సంభాషణ నిండా ఉంటుంది. ఈ క్రమంలోనే గద్దర్ పాటలమీద ఆసక్తి పెరిగింది. ఇప్పటికే ఆయన మీద విశ్లేషణాత్మక వ్యాసాలు రాసాడు.

బహుశ ఈ ఐదేళ్లలో గద్దర్‌తో సాహిత్య సంబంధ విషయాలలో అతి దగ్గరగా ఉన్నది జగన్ ఒక్కరే. గద్దర్‌కు చరిత్ర నిర్మాణం మీద శ్రద్ధ ఉంది. కనుక ఆయన రాసిన ప్రతి కాగితాన్ని జాగ్రత్తపర్చాడు. కుదురుగా డాక్యుమెంట్ చేసాడు. గద్దర్‌కు విస్తృత అధ్యయనం ఉంది. చదివిన విషయాలను నోట్స్ రాసి పెట్టుకునే ఉత్తమ లక్షణం ఆయనది. తన జ్ఞాన సముపార్జనలో ఉపయోగపడిన వాటిని భద్రపర్చాడు. ఈ మొత్తం సమాచారాన్ని జగన్ ముందు పెట్టాడని ఈ పుస్తకం చదివితే మనకు అర్థమవుతుంది. గద్దర్‌ను నిరంతరం కలవటం వలన ఆయన ఆలోచనాస్రవంతిని కూడా జగన్ తెలుసుకోగలిగినాడు. సంభాషణ, అధ్యయనం వలన ఏర్పడిన అభిప్రాయాలతో ఈ బృహత్ గ్రంథాన్ని జగన్ మన ముందుకు తెచ్చాడు.

తెలుగు సాహిత్యంలో జీవిత చరిత్రలు రాసే పద్ధతి ఆంగ్ల సాహిత్య సంస్కారం వలన మనకు అబ్బింది. మనకు ప్రాచీన సాహిత్యంలో కవుల గురించి మరికొందరు కవులు రాసిన పద్య రూప రచనలు ఉన్నాయి. కానీ అవి జీవిత చరిత్రల నమూనాకు సరిపోలినవి కావు. వ్యక్తి కేంద్రంగా జీవిత చరిత్ర రాయటం ఒక ప్రధాన స్రవంతి పద్ధతిగా సాహిత్యంలో కొనసాగుతుంది. వ్యక్తి జననం, విద్యాభ్యాసం, ఉద్యోగం, కుటుంబ నేపథ్యం, సాధించిన విజయాలు, సామాజిక సందోహంలో పాల్గొంటే దానికి సంబంధించిన వివరాలు ఒక క్రమ పద్ధతిలో రాసుకుంటూ పోవడం చేస్తుంటారు. కానీ ఈ మూసపద్ధతికి భిన్నంగా తెలుగులో వ్యక్తుల చరిత్రను రికార్డు చేసే పద్ధతికి కె.వి.రమణారెడ్డి పునాది వేసాడు. వ్యక్తుల పరిణామం విడి అంశం కాదు. అది సామాజిక శక్తుల చరిత్రలో అంతర్భాగమనే విశ్లేషణ దృష్టి మార్క్సిజం నుంచి అలవడింది. ఈ నేపథ్యం నుంచి సాహిత్య చరిత్ర రాసిన కె.వి.రమణారెడ్డి సమాజ చరిత్రలో భాగంగా వ్యక్తి చరిత్రను నమోదుచేసాడు. ఒక కవి, రచయిత వారి రచనను అంచనా కట్టాలంటే సమకాలీన ప్రజా జీవితాన్ని ఆధారం చేసుకోవాలనే దృష్టి కోణం రమణారెడ్డిది. ఈ పద్ధతిలోనే ఆయన గురజాడ మీద మహోదయం, దువ్వూరి రామిరెడ్డి మీద కృషీవలుడు అనే ప్రామాణిక పరిశోధన గ్రంథాలను వెలువరించారు. ఈ రెండు గ్రంథాలలో ఆయన తులనాత్మక పరిశోధనా పద్ధతి ఎంచుకున్నాడు. దానికి తగిన పరికరాలను రూపొందించుకొని ఆ కవులను, వారి కావ్యాలను అంచనా వేసాడు. జగన్‌రెడ్డి గద్దర్ మీద రాసిన ఈ మహాగ్రంథాన్ని నేను చదివాక ఈ గ్రంథ రచనలో జగన్ రూపొందించుకున్న పరిశోధన పరికరాలను అంచనా వేయగలిగినాను. ఈ క్రమంలో ఆయన మీద కేవీఆర్ ప్రభావం ఎంతగా ఉండిందో మనకు అర్థం అవుతుంది.

ఈ గ్రంథాన్ని రాయడానికి జగన్‌రెడ్డి తనదైన పరిశోధనా పద్ధతిని ఎన్నుకున్నాడు. కొన్ని సందర్భాలలో సైద్ధాంతిక పరిశోధన పద్ధతిని, మరికొన్ని చోట్ల సమన్వయ పరిశోధన పద్ధతిని, ఇంకొన్ని చోట్ల తులనాత్మక పరిశోధన పద్ధతిని పాటించాడు. ఒక సైద్ధాంతిక భావానికి అనువుగా ఒక అంశాన్ని అన్వయించి దాని బహిర్ అంతర్ గుణాలను ఆవిష్కరించే పద్ధతి పరిశోధనలో ప్రముఖంగా ఉంటుంది. ప్రమాణీకరించబడిన సూత్రాన్ని ఒక సందర్భానికో, వ్యక్తికో అన్వయించి నిర్ధారించే 'ఇండక్టివ్ మెథడ్'ను జగన్ ఆధారం చేసుకున్నాడు. ఒక వస్తుస్థితిని సాదృశ్యమైన వాటితో పోల్చి సమాన సూత్రాన్ని ఆవిష్కరించడం తులనాత్మక పరిశోధన. ఇక్కడ గద్దర్ జీవితాన్ని, ఆయన పాట కవిత్వాన్ని, ఆయన నెలకొల్పిన ప్రదర్శన రీతులను చరిత్రతో, సమాజ నిర్మితితో, రాజకీయార్థిక పరిణామాలతో, సాహిత్య కళారంగాలతో అన్వయించి, పరిశీలించి విశ్లేషించాడు. పాశ్చాత్య పరిశోధనా పద్ధతులను ఆధారం చేసుకొని తెలుగులో రూఢీకెక్కిన సాహిత్య పరిశోధన విధానాలు కొన్ని ఉన్నాయి. వాటిలో జీవన చారిత్రక పరిశోధన ఒకటి. రచయిత జీవితం సమాజ శక్తుల నుంచి పురోగమిస్తుందని మనం అనుకున్నట్లు రచయిత జీవితం ఆధారంగా సమాజానికి అన్వయిస్తూ రచనలను విశ్లేషించే పరిశోధన పద్ధతే జీవన చారిత్రక పరిశోధన. రచయిత జీవితంలోని ఏఏ అనుభవం తమ భిన్న అభివ్యక్తికి ఏ విధంగా మూలమయిందో పరిశీలించడమే ఈ పరిశోధన.

తెలుగు సమాజంలో గద్దర్ చరిత్రను చెరిపివేస్తే కానీ మరొకరి చరిత్రకు స్థానం లేదనే జంకు ఆధిపత్యవర్గాలలో



ఉంది. కనుక ఆయన మీద నిందలు మోపటమనేది ఆయన మరణించిన క్షణాన్నే ప్రారంభమయింది. ఎవరెన్ని కొంచెపు వాక్యాలు రాసినా ఆయన సూర్యునిలాంటి వాడని కాలం రుజువు చేసింది. కవిని కన్న తల్లి గర్భం ధన్యమనే మాట ఇప్పటికీ సత్యవాక్యంగా ఉంది. కనుకనే జగన్‌రెడ్డి తన పరిశోధనలో గద్దర్‌కు అద్వితీయ స్థానాన్ని ఇచ్చాడు. భారతీయ ప్రజాస్వామ్య వ్యవస్థలో ఖాళీ ఏర్పడినప్పుడల్లా దానిని పూరించడానికి ఎందరో వచ్చారు. కానీ ఆ ఖాళీలో తనదైన జాగను ఖాయం చేసుకున్న, ప్రజల పక్షం నిలిచిన ఒకే ఒక్కడు గద్దర్ అనే అభిప్రాయాన్ని స్థిరపర్చడంలో జగన్ మొహమాటపడలేదు. సామాజిక శాస్త్రాలలో తత్వవేత్తలుంటారు, అలాగే సాహిత్య సాంస్కృతిక రంగంలో కూడా తత్వవేత్తలుంటారని, కులవర్గ సమాజంగా ఫ్యూడల్ విలువలతో లుకలుకలాడుతున్న సామాజిక రంగంలో మౌలిక మార్పు కోసం స్పష్టమైన సాంస్కృతిక, రాజకీయ దృక్పథం ఉన్న తత్వవేత్తను జగన్ గద్దర్‌లో దర్శించాడు. కవిత్వాన్ని హృదయ గత వ్యాపారం అంటారు. కనుకనే గద్దర్ తన హృదయం నుంచి ఇతరుల హృదయాలకు చేర్చే పనిని ఎంత సృజనాత్మకంగా చేసాడో ఈ పరిశోధన ద్వారా తెలుసుకోగలుగుతాం. గద్దర్ స్థానాన్ని భారతీయ సాహిత్యంలో నిలపడానికి ఈ పరిశోధకుడు ఒక భూమికను ఏర్పర్చుకున్నాడు. తెలుగు సాహిత్యంలో పాల్కుర్కి సోమనాథుడిది విలక్షణమైన స్థానం. ఆయన కవిత్వాన్ని సామాజిక ప్రయోజనం కోసం వినియోగించాడు. సామాజిక అంతరాలను దాటి శివభక్తిని అక్షరబద్ధం చేసాడు. నియమబద్ధ మార్గ కవితారూపాన్ని విడనాడి ద్విపదకు దారులు వేసాడు. అన్యదేశమైన సంస్కృతానికి బదులుగా దేశీ కవితకు పట్టం కట్టాడు. తెలంగాణ నేల మీద ధిక్కార గొంతును వినిపించిన తొలితరం కవిగా పాల్కుర్కి సోమనను తెలంగాణ సమాజం ఎదలకు అద్దుకుంది. కనుక గద్దర్‌కు పునాది ఇక్కడి నుంచి ఉందని జగన్ భావన.

గద్దర్ పరిణామ క్రమాన్ని క్రమపద్ధతిలో చెబుతూనే ఆయన రూపొందడానికి దోహదపడిన జాతీయ, అంతర్జాతీయ నియమాలను కూడా ఈ పుస్తకంలో చూడవచ్చు. అయితే గద్దర్‌కు తన జీవితమే కవిగా, కళాకారునిగా రూపొందడానికి ఆలంబనగా ఉండింది. గద్దర్ తల్లి లచ్చుమమ్మ వ్యవసాయ కూలీ. శ్రమ సందర్భంలో ఆమె పాటలు అల్లి పాడుతుండేది. జీవితాన్ని పాటగా అల్లే కళను గద్దర్ తల్లి నుంచి నేర్చుకున్నాడు. తండ్రి శేషయ్య బతుకుదెరువు కోసం మహారాష్ట్రకు వలసపోయాడు. ఆ కాలంలో అక్కడి దళితుల మీద బౌద్ధం, కబీర్, అంబేద్కర్ ప్రభావం విశేషంగా ఉండేది. కనుక శేషయ్య అంబేద్కర్ ప్రభావానికి గురయ్యాడు. ప్రాథమిక స్థాయిలో అక్షర జ్ఞానమున్న శేషయ్య సామాజిక చైతన్యానికి అంబేద్కర్ రాజకీయ పోరాటాలు కారణమయ్యాయి. స్వయంగా శేషయ్య అంబేద్కర్‌తో కలిసి పనిచేసాడని గద్దర్ చెబుతుండేవాడు. ఆ విధంగా బాల్యపు తొలి కాలంలోనే అంబేద్కర్‌ను తండ్రి శేషయ్య ద్వారా గద్దర్ విన్నాడు. తమ జీవితాల విముక్తి కోసం ఆయన చేసే పోరాటాన్ని ఆరాధన భావంతో చూసాడు. దేశంలో ఏ జాతీయోద్యమ నాయకుడు కూడా అంటరానివారి జీవితాల విముక్తి కోసం అంబేద్కర్ లాంటి స్పష్టతతో లేరు. అది అంబేద్కర్‌కే ఎలా సాధ్యమయిందంటే, ఆయననే స్వయంగా అంటరాని తనపు దుర్మార్గపు విలువలను అనుభవించాడు కనుక. అందుకే గద్దర్ పన్నెండేళ్ల వయసులోనే అంబేద్కర్ బుర్రకథను పాఠశాల స్థాయిలో చెప్పి అందరి మెప్పును పొందాడని జగన్ రాసాడు. అంబేద్కర్ బుర్రకథతో మొదలైన గద్దర్ రాజకీయ జీవితం ఎన్ని పాయలుగా ప్రవహించిందో ఈ పరిశోధన ద్వారా మన స్ఫురణలోకి వస్తుంది. "ఆయన బతుకుదెరువు కోసం అనేక పనులు చేసినప్పటికీ బుర్రకథా ప్రదర్శనను నిర్లక్ష్యం చేయలేదు.

పదహారేళ్ల నుంచి ఇరవై ఏళ్ల మధ్య కాలాన ఆయన బతకడానికి హైదరాబాద్ వంటి మహానగరంలో ఒక వ్యక్తిగా, కళాకారునిగా నిలదొక్కుకోవడానికి ఆయన చేసిన పోరాటం దానికదే ఒక చరిత్ర.” తెలంగాణ నుంచి అంబేద్కర్ మీద తొలి బుర్రకథ రాసిన వ్యక్తి గద్దరేననే చరిత్రను సొంతం చేసుకున్నాడు.

సున్నితమైన భావుకుడైన గద్దర్ ప్రజల భాష మీద, నుడికారం మీద పట్టు సాధించాడు. ఏ సందేశాన్నైనా శ్రోతల హృదయాలలోకి చొప్పించే కళను అభ్యసించాడు. 1960ల కాలం ప్రపంచ విప్లవాలకు వేదికలా ఉండింది. ఆ కాల ప్రభావంలో హైదరాబాద్ నగరానికి చేరుకున్న గద్దర్ ఉస్మానియా యూనివర్సిటి ఇంజనీరింగ్ కాలేజీ విద్యార్థిగా విశ్వవిద్యాలయ రాజకీయ ప్రభావానికి గురయ్యాడు. మెల్లగా అధ్యయనం వైపు మొగ్గు చూపాడు. పేదరికం, అంటరానితనం, అవమానం, వివక్ష వెంటపడి తరుముతుంటే సాంత్వన కోసం పరుగుతీసాడు. అలా సికిందరాబాద్‌లోని అల్వాల్ లైబ్రరీ గద్దర్ కింత చోటునిచ్చింది. పుస్తకాలు తనను సమీపించి జ్ఞానలోగిళ్లను విశాలం చేసాయి. అక్కడే బి.నర్సింగరావు(బి.ఎన్) పరిచయం ఏర్పడింది. బి.ఎన్. ఫ్యూడల్ కుటుంబం నుంచి వచ్చాడు, కానీ పేద ప్రజల ప్రేమికుడు. విప్లవాన్ని కోరుకున్నాడు. ప్రత్యామ్నాయ సాంస్కృతిక భావజాలాన్ని నిర్మించడంలో, ప్రచారం చేయడంలో నిమగ్నమై ఆర్ట్‌లవర్స్(1966)ను స్థాపించాడు. గద్దర్‌లోని కళాతాత్వికతను గుర్తించిన బి.ఎన్ ఆయనకొక తాత్విక దృక్పథాన్ని పరిచయం చేసాడు. స్పష్టమైన ప్రాపంచిక దృక్పథం ఉంటేనే ఏ కళాకారుడైన రాణించగలుగుతారని గద్దర్‌ను చూసి నిర్ధారించుకోవచ్చు. ఆర్ట్ లవర్స్, విరసం(1970), జననాట్యమండలి(1972) ఈ పూలను గుదిగుచ్చడానికి దారం విప్లవోద్యమం కలిసి గద్దర్‌లో నిద్రపోతున్న కళా ప్రభంజనాన్ని మేల్కొల్పాయి. గద్దర్ స్వయంగా ప్రతిభావంతుడు. సృజనశీలి. మిగతావన్ని ఉపకరణాలు. పాట కవితా రచనను గద్దర్ సామాజిక అవసరంగా భావించాడు. వచన కవిత, కథ, నవల, వ్యాసం పూడ్చలేని ఖాళీని గద్దర్ పాట పూడ్చింది. విప్లవ సందేశాన్ని విప్లవకర వర్గాలలోకి తీసుకెళ్లింది. ఆయన మొదట రాసిన “ఆపురబండోడా బండెంటనేనొస్తా” అనే పాట రాజకీయావరణంలో వచ్చింది. శైలిలో శిల్పంలో ప్రజాబాణిని సంతరించుకున్నది. బహుశ ఈ పాట పిలుపు పత్రికలో అచ్చయ్యే క్రమంలో గుమ్మడి విఠల్‌బాబు వి.బి.గద్దర్ అయ్యాడు. ఇక అప్పటి నుంచి గద్దర్‌గా తెలుగు నేల మీద నూతన శకానికి పునాది రాళ్లు వేసాడు. గద్దర్‌లోని తిరుగుబాటు కేవలం పదబంధమే కాదు, అదొక భయం లేని ఆచరణగా అర్థశతాబ్దం కొనసాగింది. వెరపులేని పాటగా ప్రయాణించింది.

జననాట్యమండలి ఏర్పాటు(1972) భారతదేశ సాంస్కృతిక రంగంలో విప్లవాత్మక మార్పుగా జగన్‌రెడ్డి ఈ పుస్తకంలో విస్తారంగా ప్రస్తావించాడు. మునుపటి ప్రదర్శనరీతులు, వ్యక్తీకరణ నైపుణ్యాలను పూర్వపక్షం చేస్తూ ప్రజాప్రదర్శన పద్ధతులను ముందుకు తెచ్చిన కాలమది. ఒగ్గుకథ, వీధిభాగోతం, ఆసుకవిత్వం రూపాలే కాకుండా పాట రచనలోనే మౌలిక మార్పు వచ్చింది. ఈ మొత్తం పరిణామాలకు జీవకణం గద్దరే. కొండపల్లి సీతారామయ్య ప్రజానాట్యమండలి అనుభవాలను రంగరించి గద్దర్‌కు బోధించాడు. కళకు సామాజిక, రాజకీయార్థిక అంశాలు పునాదిగా ఉండే పద్ధతిని కూడా కేవీస్ గద్దర్‌కు వివరించాడు. ప్రారంభంలో గద్దర్ వివిధ వేదికల మీద శివసాగర్ రాసిన నరుడో భాస్కరుడ, చెరబండరాజు రాసిన ‘‘రాయిరప్పకు చెప్పనా నాగోడు’’ పాటలు పాడుతుండేవాడని, అలా కాకుండా జననాట్యమండలియే స్వయంగా పాటలు రాసి పాడాలని తన సహచరుల సూచన మేరకు గద్దర్ పాటకవిత్వం మొదలయిందని జగన్‌రెడ్డి ఒక అధ్యాయం(పుట.200)లో ప్రస్తావించాడు. జననాట్యమండలి తాత్విక చింతనకు సంబంధించి జగన్ ఇలా రాసాడు... “తెలంగాణ 1969 తిరుగుబాటు, శ్రీకాకుళం, నక్సల్బరీ తిరుగుబాటు ప్రేరణతో దేశవ్యాప్తంగా తలెత్తిన సాహిత్య రంగానికి సంబంధించి ఈ సూత్రీకరణే ముఖ్యమైన ఆచరణబాట. ప్రజా పోరాటాలకు అనుగుణంగా సాహిత్య సంగీత, సాంస్కృతికోద్యమాన్ని నిర్వహించడంలో భాగంగా జననాట్యమండలి మొదలయింది”. జె.ఎన్.ఎమ్. తాత్విక భూమికను వివరించిన జగన్ దీని తెరవెనుక కొండపల్లి సీతారామయ్య నిర్వహించిన పాత్రను కూడా విస్తారంగా పేర్కొన్నాడు. జెఎన్‌ఎం నిర్మాణంలో ఇప్పుడు కొందరు ఉద్దేశ పూర్వకంగా కొందరి పేర్లను ముందుకు తెస్తున్న వాదనలో హేతుబద్ధత లేదని జగన్ పుస్తకం చదివాక అవగాహనలోకి వస్తుంది.

ఈ చాప్టర్‌లోనే ఈ పరిశోధకుడు గద్దర్‌తో అనేక మందిని పోలిక తెచ్చి తులనాత్మక అధ్యయనం చేసాడు. ప్రసిద్ధ రష్యన్ రచయిత మాక్సింగోర్కీ తన జీవితంలోని సంఘర్షణను సాహిత్యంగా మలిచినట్లు, ప్రేమ్‌చంద్ సమీపంలోని మనుషుల

ఈతిబాధలే తన సృజనాత్మక సాహిత్యంలోకి పాత్రలుగా మారిన తీరుగా గద్దర్ తన సమాజం నుంచి, జీవితం నుంచి గడించిన అనుభవంతో సాహిత్యాన్ని సృష్టించాడు. పాట రచనలో సులువైన శైలి, అందమైన కవితా పాదం, సరళమైన వ్యక్తీకరణ ఉంటుంది. ప్రతి పాట తనదైన భాష, నుడికారం, ప్రతీకలతో నిర్మాణమవుతుంది.

పాట కవిత్వాన్ని విశ్లేషించే ప్రమాణాలు సాహిత్య విమర్శ ఇంకా సమకూర్చుకోలేకపోయింది. పాట మీద వచ్చిన చర్చ వాచకానికే పరిమితమయింది తప్ప దాని నిర్మాణం జోలికి వెళ్లలేదు. కేవలం పాతకాలపు వ్యాఖ్యానపద్ధతికే విమర్శ పరిమితమయింది. ఇప్పటికీ పరిశోధన పరికరాలను, ప్రమేయాలను సాహిత్య విమర్శ రూపొందించుకోలేకపోయింది. ఈ అర్ధశతాబ్దంలో తెలుగు సాహిత్యాన్ని నిర్దేశించిన గద్దర్ కవిత్వాన్ని అంచనా వేసే శక్తి ఏ సాహిత్య విమర్శకులకు లేదు. అలనాటి అల్లసాని, అన్నమయ్య కవిత్వాన్ని పరిశోధించడానికి, పరిశీలించడానికి ఈనాటికీ ఆసక్తి చూపే విమర్శకులు మనకాలపు గద్దర్ కవిత్వాన్ని మాత్రం పరామర్శ చేయలేకపోతున్నారు. కారణం స్పష్టమే. పాట అంతర్గత సమీకరణ గురించిన జ్ఞానం లేకపోవటమే. విమర్శకులంతా పై సామాజిక వర్గాల నుంచి ఎదిగివచ్చారు. పాట మాత్రం దిగువ సామాజిక సమూహాల నుంచి పుట్టుకొచ్చింది. ఇక్కడే వైరుధ్యం ఉంది. విమర్శకులలో ఉండే ఈ పరిమితిని గద్దర్ గుర్తించి విస్తరించిన తీరును ఈ గ్రంథంలో జగన్ పేర్కొన్న విధానం అభినందనీయం. "ప్రజల పాటకు ప్రాథమికంగా విమర్శకులు ప్రజలేనన్నది ఆయన ప్రమాణంగా తీసుకున్నారు. తాను పాట రాయడంలో ఉన్న సైద్ధాంతిక నిబద్ధతకు అది లేకుండా పాట రాసేవారికి, వచన కవులకు మధ్య వైరుధ్యం గుర్తించడం వల్ల గద్దర్ తన పాటలు కళారూపాల రచనలో సరళతను, స్పష్టతను సాధించారు"(పుట.246)

ఈ మహత్ గ్రంథంలో గద్దర్ గురించిన విషయాలు తెలుసుకోవాలంటే స్థూలంగా మనకు ఆరు అంశాలు కన్పిస్తాయి. 1.గద్దర్ జీవితం-చదువు, 2.ఆర్ట్ లవర్స్‌తో పరిచయం-నక్సల్బరీ రాజకీయాలు, 3.జననాట్యమండలి స్థాపన, 4.కవిగా గద్దర్ ప్రస్థానం, 5.గద్దర్ ప్రవేశపెట్టిన నూతన ప్రదర్శనరీతులు, 6.గద్దర్ పాటలలో ఉండే విస్తృతి. ఈ పుస్తకంలో అనుబంధంతో కలుపుకొని 45 చాప్టర్లు ఉన్నాయి. ప్రతీ చాప్టర్‌కు ఉపశీర్షికలు కూడా ఉన్నాయి. సుమారు వెయ్యి పేజీల పుస్తకాన్ని రూపొందించిన జగన్‌రెడ్డిని తప్పకుండా అభినందించాలి. దీనిని రూపొందించడంలో ఆయన శ్రమ అవిరామం. చాలా విషయాలను ప్రస్తావించడం వలన అన్వయలోపం ఉన్నట్టు అన్పించే ప్రమాదం ఉంది. కానీ గద్దర్ లాంటి వ్యక్తిత్వాన్ని అంచనా వేయాలంటే తులనాత్మక అధ్యయనం అనివార్యం. జగన్‌రెడ్డి కూడా విస్తృత అధ్యయనశీలి కావడం వలన ఆయన స్మృతిలో ఉన్న ప్రతి విషయాన్ని గద్దర్ సందర్భంలో పేర్కొన్నాడు. ఈ మొత్తం పుస్తకంలో మూడు చాప్టర్లు అతి ముఖ్యమైనవి. 1.జననాట్యమండలి స్థాపన, 2.ప్రజారంగస్థలం, 3.ఆరు దశాబ్దాల పాట. వీటి ఆధారంగా గద్దర్ జీవితం, పరిణామం, విస్తృతి, ఆయన నెలకొల్పిన సాహిత్య, సాంస్కృతిక విలువలను అంచనా వేయవచ్చు.

ప్రజారంగస్థలం అనే మాట పీపుల్స్ థియేటర్‌కు తెలుగులో సమాన అర్థంగా ఈ పరిశోధకుడు ఉపయోగించాడని తెలుస్తుంది. భారతీయ సాంస్కృతికోద్యమ చరిత్రలో ప్రజారంగ స్థలం అంటే గద్దరే. ఈ విషయంలో ఇంకెవరి గురించి చెప్పాలన్నా గద్దర్ తర్వాతనే అని చెప్పే చరిత్రను గద్దర్ నిర్మించాడు. ఆయనకు ముందు ఇండియన్ పీపుల్స్ థియేటర్ అసోసియేషన్(ఐపిటిఏ) మనదేశంలో ఉంది. బెంగాల్, బాంబే కేంద్రంగా వీధి నాటిక ప్రదర్శన పద్ధతిని బాదల్ సర్కార్ లాంటి వాళ్లు ప్రవేశపెట్టారు. అయితే ఈ ప్రదర్శనలను తిలికించిన శ్రోతలు వందలలో వేలలో ఉండేవారు. అలాగే తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట కాలంలో నాజర్, సుద్దాల హనుమంతు బుర్రకథ ప్రదర్శన, సుంకరి సత్యనారాయణ లాంటి నాటక రచయితల ప్రదర్శనలు ఉన్నా వీటికి శ్రోతలు కూడా పరిమితమే. ఈ కాలంలో ప్రదర్శనారీతుల మీద ఆంధ్ర ప్రాంత పద్యనాటకాల ప్రభావం కన్పించేది. కనుక అశేష ప్రజలలోకి వెళ్లడానికి పరిమితి ఏర్పడింది. ఇప్పా, ప్రజానాట్యమండలి నెలకొల్పిన సాంస్కృతికోద్యమ విలువలను కొనసాగిస్తూ వాటికి సైద్ధాంతికంగా మాస్‌లైన్‌ను అన్వయించిన మొదటివ్యక్తి గద్దర్. మునుపటి కళాకారులలో ఎక్కువమంది శూద్రకులాల నుంచి వచ్చారు. కానీ జననాట్యమండలి ఏర్పడిన తర్వాత గద్దర్‌తో సహా కళాకారులు అతి శూద్రకులాల నుంచి వచ్చారు. ఒకరిద్దరు మినహాయిస్తే, అందరికి అందరూ దళితులే. కనుక ప్రదర్శన రీతులలో మనం ఈ మౌలిక మార్పును చూడగలం. పైగా గద్దర్ తన తల్లి లచ్చుమమ్మతో పాటు నాట్లలో, కోతలలో, కుప్పలలో భాగమయ్యాడు. శ్రమ జీవితంలో వారి

కాళ్లు, చేతులు కదిలినట్లే లయ రూపొందిన విధం తల్లి నుంచి అభ్యాసం చేసాడు. దృశ్యానికి అనువుగా ఆంగిక అభినయం శ్రమ నుంచే అబ్బింది. ప్రజారంగ స్థలానికి సంబంధించిన విస్తారమైన చర్చను జగన్‌రెడ్డి ఈ చాప్టర్‌లో ఉటంకింపులతో సహా చేసాడు.

గద్దర్ వేదిక మీద ఎగిరి దుంకే రూపకాన్ని నటరాజనృత్యంలో భాగంగా స్వీకరించాడని జగన్ కొత్త ప్రతిపాదన చేసాడు. దానికి తెలంగాణను మూలంగా ఎంచుకున్నాడు. కాకతీయులకాలంలో నృత్యరత్నావళి (జాయపసేనాని)లో చిందు భాగవతాన్ని పేర్కొనటం. పండితారాధ్య చరిత్రలో(పాల్కురికి సోమనాథుడు) ప్రస్తావించిన కళలను ఆధారం చేసుకున్నాడు. అంటే గద్దర్ స్వీకరించి ప్రదర్శిస్తున్న కళారీతులకు పునాది ఇక్కడి పండిత రచనల ఉదాహరణగా ఈ పరిశోధకుడు చూపుతున్నాడు. అయితే జగన్ ప్రతిపాదనతో ఏకీభవించడం సాధ్యం కాకపోవచ్చు. ఎందుకంటే డప్పునృత్యం, కోలాట నృత్యం, చిరుతల నృత్యంలో కూడా ఎగిరి దుంకే వ్యక్తీకరణలు ఉన్నాయి. ఇంకా చెప్పాలంటే జంతువులను పోలిన అనేక ఆటల సంప్రదాయం శ్రామిక కులాలలో ఉంది. బహుశ గద్దర్ అక్కడి నుంచి గ్రహించి తర్వాత విప్లవ పాటలోని రసానుకూలతను జోడించి ఉండవచ్చు. "జననాట్యమండలి ప్రదర్శనలలో కనిపించే గజ్జెలు, డప్పు, డోలక్, హార్మోణియం వాద్యాలు పూర్తిగా తెలంగాణలోని ప్రజా ప్రదర్శన నాటక రంగంలో వాడుకలో ఉన్నవే. బుర్రకథలో ఉపయోగించే ఆహా, ఓహో, బలే, బలే వంటి చెణుకులను జననాట్యమండలి ప్రదర్శనలో ఉపయోగించడం గద్దర్‌తోనే మొదలు"(పు. 257)

ఈ చాప్టర్‌లోనే జగన్‌రెడ్డి గద్దర్ రాసిన మూడు పుస్తకాలను తనదైన పరిశోధన దృష్టితో చేసిన విశ్లేషణను మనం తప్పక పట్టించుకొని తీరాలి. 1.తరగనిగని, 2.ప్రతిపాటకు ఒక కథ ఉందా?, 3.సాంస్కృతిక రంగ సమస్యలు. సాధారణంగా కళాకారులు మూడురకాలుగా ఉంటారు. ఒకటి వేదిక మీద కేవలం పాటలు పాడేవారు, రెండు కేవలం పాటలు రాసేవారు, మూడు పాటలు రాసిపాడేవాళ్లు. ఈ మూడింటిలో గద్దర్ మూడోశ్రేణి వ్యక్తి. అందుకే ఆయనను వాగ్గేయకారుడని అంటారు. పాటరాస్తాడు, తానే పాడుతాడు, దానికి అనుగుణంగా నృత్యం చేస్తాడు. పాట మధ్యలో రాజకీయ ఉపన్యాసం ఇస్తాడు. ఇన్ని లక్షణాలు ఉన్న కళాకారులు అరుదుగా ఉంటారు. అయితే ఎవరికి లేని ప్రత్యేకత గద్దర్‌లో ఉన్నదేమిటంటే ఆయన సాంస్కృతికోద్యమం మీద సైద్ధాంతిక రచనలు చేయడం. కనుక ఆ రంగంలో కృషి చేస్తున్న వ్యక్తి ఆ రంగం నుంచి తాను పొందిన అనుభవాలను తర్వాతి తరాలకు అందించే అరుదైన పనిని గద్దర్ చేసాడు. గద్దర్ చేసిన అరుదైన కృషి మీద జగన్‌రెడ్డి తనదైన విశ్లేషణ చేయడం ఈ పుస్తకానికి అదనపు మెరుగును ఇచ్చింది. పాట కవిత్వం రాసి కోట్లాది పాఠకులను, శ్రోతలను మెప్పించి ఒప్పించిన గద్దర్ వచన రచనలతో కూడా సాహిత్య ప్రపంచాన్ని ఒప్పించాడు. కాకపోతే ప్రధాన స్రవంతి సాహిత్యం గద్దర్ రాసిన ఆ గ్రంథాలను తనలో భాగం చేసుకోవలసి ఉంది. అప్పుడే తెలుగు సాహిత్య సంస్కారం వ్యక్తమవుతుంది. జగన్‌రెడ్డి మాటలలోనే చెబితే 'ఏ కాలంలోనైనా రాజకీయ, సామాజిక, సాంస్కృతిక దృక్పథం ఉన్న రచయితలు, కళాకారులు అరుదుగా జన్మిస్తారు. బహుముఖ పొదుపులు ఉన్న గద్దర్ ఈ తరహా పరంపరకు చెందినవాడు. 'ఆయన అభివ్యక్తి, వాక్యనిర్మాణం, పదాల పొందిక ఒక సిద్ధాంత గ్రంథం రాస్తున్నప్పుడు ఎలా ఉండాలో ఎరుకతో వ్యక్తమయ్యాడు.

గద్దర్ పాట కవిత్వాన్ని సంపూర్ణంగా అర్థం చేసుకోవాలంటే ఆరు దశాబ్దాల పాటల బాట చాప్టర్‌ను చదివి తీరాలి. ఒక్కో సామాజిక సందర్భంలో గద్దర్ కలం నుంచి జాలువారిన పాటల ప్రవాహం మనల్ని ముంచెత్తుతుంది. ఆయన హైదరాబాద్-సికిందరాబాద్ జంట నగరాలలో జీవించడం వలన రిక్షా కార్మికుడి మీద విస్తృతంగా రాసాడు. ఒక మనిషి ముగ్గురు మనుషులను మోసుకెళ్లడం ఎంతటి శ్రమతో కూడి ఉంటుందో రిక్షా కార్మికుడికే తెలుస్తుంది. కళ్లంటే చూసి వాక్కుంటే రాయమని చెప్పిన శ్రీశ్రీ వలె గద్దర్ చూసి రాసాడు. గద్దర్ పాటలు ప్రధానంగా 1.కార్మిక సమస్యలు, 2.రైతాంగ సమస్యలు, 3.రాజ్య నిర్బంధం, 4.స్మృతి, 5.కుల సమస్య, 6. స్త్రీ సమస్య, 7. ప్రపంచీకరణ -సామ్రాజ్యవాదం, 8.పనిముట్లు మొదలైన విషయాలను ఇతివృత్తంగా తీసుకొని ఆయన పాటలు రాసాడు. వర్గపోరాటంలో కుల ప్రస్తావన తాత్విక దృష్టితో చేసిన కవి గద్దర్ మాత్రమే. వర్గ పోరాటమే సకల సమస్యలకు పరిష్కారం చూపుతుందనే ఏకశిలాసదృశ సిద్ధాంతాన్ని గద్దర్ విశ్వసించలేదు. కనుక ఆయన మదినిండా మార్క్స్, లెనిన్, మావోతోపాటు భారతీయ సామాజిక విప్లవకారుడు అంబేద్కర్ ఉన్నాడు. ఒక రకంగా గద్దర్ రాజకీయ

ఆచరణ అంబేద్కర్ విగ్రహాన్ని ట్యాంక్‌బండ్ మీద ప్రతిష్ఠించే పోరాటంతో మొదలయింది. ఆయన సాంస్కృతిక ప్రదర్శన అంబేద్కర్‌తోటే ప్రారంభమయింది. కనుక విప్లవోద్యమం ఎన్ని పరిమితులు విధించినా, ఆయన సహచరులు నొసలు చిట్లించినా తాను నమ్మిన విలువల కోసమే నిలబడ్డాడు. విప్లవం మాకు ఆదర్శం కాదు, అవసరమని ప్రకటించి నిమగ్నమయ్యాడు. నిబద్ధత దగ్గరే ఆగిపోకుండా విప్లవాచరణలో అజ్ఞాతంలో ఉండి ఆదివాసుల జీవితాన్ని బయటి ప్రపంచానికి కళాత్మకంగా తెలియపర్చాడు.

యాలరో ఈ మాదిగ బతుకు, బాంచెన్ బాంచెన్ అంటూ, దళిత పులులమ్మ పాటలను ఎనభయో దశకం ప్రారంభంలోనే రాసాడు. అప్పటికి విప్లవోద్యమం కులం ఉపరితలాంశమా? పునాద్యంశమా? అనే మీమాంసలో ఉంది. కానీ గద్దర్‌లో ఏ సంశయం లేదు. కులం ఈ దేశంలో మనిషి అస్తిత్వాన్ని, చైతన్యాన్ని, సామాజిక హోదాను నిర్ణయించే సోషల్ క్యాపిటల్ అనే స్పష్టతతో పాటలు రాసాడు. నిజమైన విప్లవకర వర్గాలు సొంత ఆస్తి లేనివాళ్లు అనుకుంటే ఈ దేశంలో దళితులే భూమిలేని, సంపదలేని నిరుపేదలు. కనీసం మనుషులుగా కూడా గుర్తింపుకు నోచుకోని మూగజీవులు. వారిని విప్లవంలోకి సమీకరించాలంటే, వారి జీవితాన్ని గానం చేయవలసిన వస్తుగత స్థితిని గద్దర్ గుర్తించాడు. స్త్రీ సమస్య విప్లవంలో అర్థం కావాలంటే ఏ విప్లవ కవి రాయకముందే గద్దర్ శ్రామిక స్త్రీ గురించి రాసాడు. 'సిరిమల్లె చెట్టుకింది లచ్చుమమ్మ' కేవలం గద్దర్ తల్లి మాత్రమే కాదు, సమస్త శ్రామిక వర్గ దళిత స్త్రీకి నమూనా. రాజన్యుల మీద అంకిత గీతాలు రాయడం, స్తుతిగీతాలు రాయడం, అంత:పుర కాంతల మీద పుంఖాను పుంఖాలుగా వర్ణనీయ కవిత్వం రాయడం ఒక సంప్రదాయంగా వస్తుంది. కానీ గద్దర్ ఆవరణలోని స్త్రీలు వేరు. వాళ్లు శ్రమజీవులు, విప్లవంలో ఒరిగిపోయిన వీరవనితలు. వీరుల మీద ఎంతటి భావుకతతో పాటలు రాసాడో అంతే వీరరసంతో స్త్రీల మీద రాసాడు. స్వర్ణక్క, శోభక్క మీద వచ్చిన పాటలు విప్లవ సాహిత్యంలో వాటికవే సాటి.

ఈ పుస్తకంలో జగన్‌రెడ్డి గద్దర్ సాహిత్య, రాజకీయ, కళా వ్యక్తిత్వాన్ని సంపూర్ణంగా ఆవిష్కరించాడు. గద్దర్ ఆలోచనల పరంపరకు చెందిన భావధారను పూలను కలిపే దారం వలె పుస్తకం అసాంతం కొనసాగించాడు. శివకవులు, అచల కవులు, నాట్యకారులు, ఇప్టా, ప్రజానాట్యమండలి కొనసాగింపుగా గద్దరే నిర్మాణం చేసిన జననాట్యమండలి. ఆయన సైద్ధాంతిక దృక్పథం వలన ఉక్కు క్రమశిక్షణ కలిగిన కళాకారుడిగా ఎదిగాడు. ఫలితంగా రచనలో నూతన ఒరవడిని సృష్టించాడు. "కవితను రాయడంలో గద్దర్ ఒక ఎత్తుగడతో మొదలుపెట్టి పాఠకులను లేదా శ్రోతలను తన ఆధీనంలోకి తెచ్చుకొని చివరికి ఒక బలమైన ముగింపుతో వదిలిపెడుతాడు. తాను చెప్పదలుచుకున్న వస్తువు లేదా భావన చుట్టూ చాలినంత వాతావరణాన్ని దాన్ని స్ఫురింపచేసే ప్రతీకలను చొప్పించి కవితను ఒక నాటకం, ఒక సినిమా చిత్రం, ఒక ప్రదర్శనగా తీర్చిదిద్దడం, ప్రతిపాటలో ఒక లక్షణంగా ఉంటుంది"(పు.403) ఈ విశ్లేషణ చేసిన జగన్‌రెడ్డి గద్దర్‌ను మనముందు సాక్షాత్కారం చేసాడు. ఆయన పాటలను స్వయంగా విన్న మనం గద్దర్ మనలో కలిగించే రసానుభూతికి ఆశ్చర్యచకితులమవుతాం. ఆయన ఆట, పాట, మాట అలలు అలలుగా గాలిలో వ్యాపిస్తుంది. మన సర్వేంద్రియాలను తన స్వాధీనంలోకి తీసుకుంటాడు. సంగీతంలో రాగం, శబ్దం మాత్రమే కాకుండా భాష నిర్వహించే పాత్ర మీద సంపూర్ణ అధికారం గద్దర్‌కు ఉండటం వలన ఆయన పాట ద్వారా మనందరిని మంత్రముగ్ధులను చేసాడు. గానం మధ్యలో ఆయన చేసే శబ్దాలు శ్రోతలకు విషయం మీద ఆసక్తిని పెంచడానికే. ఈ చెణుకులను పాటలో ప్రవేశపెట్టింది గద్దరే. ఈ విషయంలో తొలి సంగీతకారునిగా గద్దర్ స్థానాన్ని జగన్‌రెడ్డి అక్షరబద్ధం చేసాడు.

చరిత్రకారుడు వాస్తవాలను ఎన్నుకొని వాటి ఆధారంగా తన వ్యాఖ్యానాన్ని జోడిస్తూ పని ప్రారంభిస్తాడు. వెలికివస్తున్న వాస్తవాలు ఒక దానిని మరొకటి ప్రభావితం చేసుకుంటూ మార్పు చెందుతుంటాయి. గతం, వర్తమానం పరస్పర సంబంధాలలో సాగిన జగన్‌రెడ్డి రచన మనలో కొత్త ఆలోచనలకు పాదుకొల్పుతుంది. వాస్తవాలకు ప్రాణం, అర్థం కల్పించే చరిత్రకారుడి వలన కొత్త విషయాలను మనం తెలుసుకోగలుగుతాం. మనకాలపు యుగకర్త గద్దర్ చరిత్రను జగన్‌రెడ్డి ఎంతో శ్రమించి అనేక ఉటంకింపులతో సాధికారికమైన పరిశోధనా గ్రంథాన్ని సాహిత్య ప్రపంచం ముందుకు తెస్తున్నందుకు అభినందిస్తూ గద్దర్ చరిత్రలోకి మిమ్మల్ని ఆహ్వానిస్తున్నాను.

★ రచయిత: ప్రొఫెసర్, ఓయు T

# విద్యార్థులను వెంటాడుతున్న పేపర్ లీకేజీలు

డా. సిలువేరు హరినాథ్

దేశంలో పలు ప్రభుత్వ ఉద్యోగాలకు, ఉన్నత విద్య ప్రవేశాల కోసం నిర్వహించే పరీక్షలు, పేపర్ లీకేజీల వల్ల రద్దవుతున్నాయి. ఈ పరిణామాలతో రేయింబవళ్ళు శ్రమకోర్చి చదువుకుంటున్న కోట్లాది మంది నిరుద్యోగ యువత నిరాశ నిస్పృహలకు లోనౌతున్నారు. మరోవైపు ఉన్నత చదువులు చదివినప్పటికీ అందుకు ఆశించిన ఉద్యోగం లభించక పోవడంతో విద్యార్థులు మనోవేదనకు గురవుతున్నారు. ప్రపంచ వ్యాప్తంగా సాంకేతిక పరికరాలు అందరికీ అందుబాటులోకి రావడం సంతోషకరమైన విషయమే. కానీ అదే స్థాయిలో సాంకేతికత నైపుణ్యాన్ని ఉపయోగించడం ద్వారా సైబర్ నేరాలు హెచ్చరిల్లుతున్నాయి. అయితే పోలీసు అధికారులు సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి సైబర్ నేరాలను సకాలంలో అరికట్టలేకపోతున్నారు. అందుకు తాజాగా చోటుచేసుకుంటున్న పేపర్ లీకేజీల వ్యవహారమే ఇందుకు నిదర్శనం అని చెప్పాలి. అధికారులు పరీక్షల నిర్వహణలో ఎంతో కీలకంగా తమ బాధ్యతలను నిర్వహించాల్సి ఉంటుంది. కానీ అధికారులు వారి విధుల పట్ల నిర్లక్ష్య వైఖరినే ప్రదర్శిస్తున్నారు. అంతే కాదు ఉన్నతాధికారుల అండదండలతోనే పేపర్ లీకేజీలకు దారితీస్తున్నాయని చెప్పడానికి బీహార్ రాష్ట్రంలో చోటుచేసుకున్న నీట్ పరీక్ష పేపర్ లీకేజీల ఉదంతమే ఇందుకు నిదర్శనం.

ఇటీవల జరిగిన నీట్ ప్రవేశ పరీక్షలో అవకతవకలు జరిగాయనే అభియోగంతో ఆ పరీక్షను రద్దు చేయాలని దేశ వ్యాప్తంగా నిరసన పోరాటాలు ఇప్పటికీ కొనగాగుతూనే ఉన్నాయి. అయితే తాజాగా నీట్ పేపర్ లీకైన విషయం నిజమే అని బీహార్ రాష్ట్రానికి చెందిన అనురాగ్ అనే విద్యార్థి పోలీసు దర్యాప్తులో ఒప్పుకోవడం గమనార్హం. ఈ నేపథ్యంలో నీట్ ఫలితాలపై ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం చేసుకుంటుందో వేచి చూడాల్సి ఉంది. ఈ సమస్య వల్ల పరీక్ష రాసినటువంటి 23.33 లక్షల మంది విద్యార్థులను మానసిక వొత్తిడిలోకి నెట్టి వేసినట్లయింది. అయితే ఈ వివాదం చల్లారకముందే ఇటీవలే నిర్వహించిన యూజీసీ-నెట్ పరీక్షలో సైతం అక్రమాలు జరిగాయని జాతీయ సైబర్ నేర హెచ్చరికల విశ్లేషణ విభాగం కేంద్రానికి అందించిన సమాచారం మేరకు నెట్ పరీక్షను రద్దు చేస్తున్నట్లు కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ ప్రకటించడం విస్మయానికి గురిచేసింది. ఈ నిర్ణయంతో నెట్ పరీక్షకు హాజరైన సుమారు 11.21 లక్షల మంది విద్యార్థుల ఆశలపై పిడుగు పడినట్లయింది.

కేంద్ర ప్రభుత్వం నిర్వహించే పోటీ పరీక్షలతో పాటు ఆయా రాష్ట్రాల పరిధిలో నిర్వహించే పోటీపరీక్షల పేపర్ లీకేజీల వ్యవహారం తీవ్ర స్థాయిలో ఉంది. దేశంలో గత ఐదేండ్ల కాలంలో సుమారుగా 70కి పైగా పోటీ పరీక్షల పేపర్లు లీకేజికి గురైనాయి. దీని కారణంగా ఆ పోటీ పరీక్షలకు హాజరైన సుమారు 1.40 కోట్ల మంది విద్యార్థులు మళ్ళీ పోటీ పరీక్షలు రాయక తప్పలేదు. ఈ పేపర్ లీకేజిల వ్యవహారాన్ని క్షుణ్ణంగా పరిశీలిస్తే దేశంలో అత్యధికంగా రాజస్థాన్ రాష్ట్రంలో 7 రకాల పోటీపరీక్షలు రద్దు చేయగా, సుమారుగా 38.41 లక్షల మంది విద్యార్థులు తీవ్రంగా నష్టపోయారు. బీహార్ రాష్ట్రంలో మూడు పరీక్షలు రద్దుకాగా 22.80 లక్షల మంది విద్యార్థులు తమ విలువైన సమయాన్ని కోల్పోవాల్సి వచ్చింది. గుజరాత్ రాష్ట్రంలో మూడు పరీక్షలు రద్దు కాగా 16.41 లక్షల మంది విద్యార్థులు మళ్ళీ శ్రమకోర్చి పరీక్షలు రాశారు.

తెలంగాణ రాష్ట్రంలో నిర్వహించిన గ్రూప్ - 1 పరీక్ష ఏకంగా రెండు సార్లు రద్దు అయిందంటే పరీక్షల నిర్వహణపై అధికారులు ఏ స్థాయిలో విఫలమయ్యారో అర్థం చేసుకోవచ్చు. ఉత్తర ప్రదేశ్ రాష్ట్రంలో గత ఐదేళ్ళలో 11 పరీక్షలు రద్దు కాగా 19 లక్షల మంది విద్యార్థులు తిరిగి మళ్ళీ పరీక్షలు రాసినప్పటికీ వారు మానసికంగా ఎంతగా కుంగిపోయారో అర్థం చేసుకోవచ్చు. ఈ రాష్ట్రంలో ఒక పోలీసు శాఖలో 62 అటెండర్ పోస్టులకు 2024 జనవరిలో నోటిఫికేషన్ విడుదల చేసింది ఆ ప్రభుత్వం. సుమారుగా 93 వేల మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకోగా అందులో 3,700 మంది పీహెచ్డీ చేసిన విద్యార్థులే ఉండడం ద్వారా నిరుద్యోగం ఏ మేరకు పేరుకు పోయిందో అర్థం చేసుకోవచ్చు. అలాగే 28,000 మంది పీజీ చదివిన అభ్యర్థులు ఉన్నారు. అయితే ఆ అటెండర్ పోస్టుకు కావాల్సిన

## దేశంలోని ప్రధాన రాష్ట్రాలలో రద్దు చేసిన పోటీపరీక్షల వివరాలు

| రాష్ట్రం | పరీక్షలు రద్దయినవి | పోస్టుల సంఖ్య | పరీక్షలకు హాజరైనవారి సంఖ్య |
|---|---|---|---|
| రాజస్థాన్ | 7 | 40590 | 3841000 |
| బీహార్ | 3 | 24380 | 2287000 |
| ఉత్తర ప్రదేశ్ | 11 | 3300 | 1900000 |
| గుజరాత్ | 3 | 5260 | 1641000 |
| మహారాష్ట్ర | 2 | 6560 | 1125000 |
| హర్యాన | 2 | 6980 | 841000 |
| తెలంగాణ | 5 | 3370 | 674000 |
| జార్ఖండ్ | 1 | 2010 | 650000 |
| కర్ణాటక | 2 | 1660 | 334000 |
| జమ్మూ కాశ్మీర్ | 3 | 2330 | 249000 |
| ఉత్తరాఖండ్ | 4 | 1800 | 237000 |

అర్హత మాత్రం కేవలం ఐదవ తరగతి మాత్రమే కావడం ఆశ్చర్యం కల్గించే అంశం. అయితే ఇక్కడ గమనించాల్సిన అంశమేంటంటే నిరుద్యోగుల సంఖ్య ఎక్కువ ఉండడం కారణంగా నేరగాళ్లు ఉద్యోగ ప్రాధాన్యతను విద్యార్థులకు ఆశగా చూపెట్టి వారి నుండి లక్షల రూపాయలు వసూలు చేసి పేపర్ లీకేజీలకు పాల్పడుతున్నారని అర్థం చేసుకోవాలి.

పోటీపరీక్షల నిర్వహణ అనేది కట్టుదిట్టమైన పోలీసు బందోబస్తు మధ్య నిర్వహించాల్సి ఉంటుంది. పేపర్ సెట్టింగ్ కోసం సబ్జెక్టు నిష్ణాతులను ఎంపిక చేసే సమయం నుండి పరీక్ష ఫలితాల విడుదల వరకు అధికారులు మూడో కంటికి తెలియకుండా పోలీసు మరియు నిఘా వర్గాల సహకారం తీసుకోవాల్సి ఉంటుంది. కానీ అలా జరగడం లేదు. అయితే రాజకీయ అండదండలతో అవినీతికి అలవాటు పడిన అధికారుల చేష్టలవల్లనే పేపర్ లీకేజిలకు దారులు పడుతున్నాయనేది నిగ్గరసత్యం. మరోవైపు తల్లిదండ్రులు తమ పిల్లల భవిష్యత్తు బాగుపడాలని అడ్డదారుల్లో అధికారులకు డబ్బులు చెల్లించి అక్రమాలను ప్రోత్సహిస్తున్నారు. అలాంటి వారిని అరెస్టు చేసి త్వరతిగతిన శిక్షించాలి. అందుకు ఫాస్ట్‌ట్రాక్ కోర్టులను ఉపయోగించాలి. పేపర్ లీకేజిలో ఏదైనా కోచింగ్ సెంటర్ల ప్రమేయం ఉందని తేలితే అందులో పనిచేసే బాధ్యులను శిక్షించడమే కాకుండా కోచింగ్ సెంటర్లను సైతం శాశ్వతంగా మూసివేయాలి.

పేపర్ లీకేజీలు, మోసాలకు పాల్పడే వారిపై చర్యలు తీసుకోవడానికి కొన్ని రాష్ట్ర ప్రభుత్వాలు కఠినమైన చట్టాలను రూపొందించాయి. అయితే కఠినమైన చట్టాలు ఉన్నప్పటికీ పేపర్ లీకేజీలు యథేచ్ఛగా కొనసాగుతున్నాయి. అంటే అవి పేరుకే చట్టాలు తప్ప ఆచరణలో లేవని అర్థం చేసుకోవాలి. కేంద్ర ప్రభుత్వం సైతం పేపర్ లీకేజీలను అరికట్టడానికి పబ్లిక్ పరీక్షల (అన్యాయమైన మార్గాల నివారణ) బిల్లు, 2024, ఫిబ్రవరి 12న అందుబాటులోకి వచ్చింది. ఈ చట్టం ప్రకారం ఎవరైనా కాపీ కొట్టి పట్టుబడితే మూడేళ్ల జైలు శిక్షతో పాటు 10 లక్షల జరిమానా విధిస్తారు. అలాగే పేపర్ లీకేజీలకు పాల్పడితే 10 సంవత్సరాల జైలు శిక్షతో పాటు కోటి రూపాయల జరిమానా విధిస్తారు. ఈ చట్టం అన్ని కేంద్ర ప్రభుత్వ నియామక సంస్థలు మరియు జాతీయ పరీక్షా సంస్థ ద్వారా నియామకాల కోసం నిర్వహించే పరీక్షలకు వర్తిస్తుంది. ప్రస్తుతం నీట్ పేపర్ లీక్ చేసిన నిందితులకు ఈ చట్ట ప్రకారమే శిక్ష పడనుంది. ఈ చట్టాన్ని రాష్ట్ర పరిధిలో సైతం అమలు చేసినట్లయితే పేపర్ లీకేజీలను అరికట్టవచ్చు. ఆ దిశగా అధికారులు చర్యలు తీసుకొని ప్రశాంతంగా పరీక్షలు నిర్వహించాలని ఆశిద్దాం.

★ **రచయిత: రీసెర్చ్ అసోసియేట్, సెస్** T

# విశ్వర్షి వాసిలి 'నేను'- శైలీశాస్త్రానువర్తనం

● డా. బోలుగద్దె అనీల్‌కుమార్

"సాహిత్యవిమర్శకు సౌందర్యం, తత్త్వం అనేవి రెండు కన్నులు. ఆ నేత్రద్వయంతో అనుశీలనం చేస్తున్నప్పుడు సమీక్షకు నిలిచేవి 'సౌందర్యతత్త్వం, తత్త్వసౌందర్యం. ఈ రెండూ కావ్యపరమార్థంలో అద్వైతంగా భాసించి ఏకవాక్యతను భజిస్తాయి"[1] అన్నటువంటి జి.వి. సుబ్రహ్మణ్యం గారి మాటలు శైలీశాస్త్రమరందానికి తావలమైన పుష్పాలు.

పై మాటల్లోని 'శైలి' అంటే ఏమిటో చూద్దాం – భాష అనేది శబ్దార్థాలతో ద్విముఖం అయినట్లే సాహిత్యం కూడా 'విషయం–విధానం' అని రెండు రకాలు. హితమైన సాహిత్యాన్ని హితమైన విధానంలో చెప్పినప్పుడు ఆ హితవిధానాన్ని నిర్వహించిన తీరును గురించి చెప్పడమే సాహిత్యవిమర్శ చేసే పని. దీనిని అందరికీ అర్థమయ్యేలా 'సాహిత్యాంశాలను వెల కట్టడం అని చెప్పవచ్చు. లేదా అభివ్యక్తి అధ్యయనం అని చెప్పవచ్చు.

ఈ అభివ్యక్తి అధ్యయనం, విషయనిర్వహణతోపాటు భాషను కూడా భూమికగా చేసుకుని ముందుకు వెళుతుంది. భాషాతత్త్వాన్ని ఆవిష్కరించే భాషాశాస్త్రాన్ని ఆధారంగా చేసుకుని సాహిత్య గ్రంథాన్ని విశ్లేషించడం వల్ల రచనావిధానం, ఇంకా సులభంగా అర్థమవుతుంది. భాషాభూమిక వల్ల ఏర్పడ్డ సౌందర్యాన్ని, ఈ కారణంగా గ్రంథంలో ఆవిష్కృతమవుతున్న సాహిత్యపు విలువలను (సారూప్యతత్త్వ సంబంధి – Iconicity అయినా సరే) మనం గ్రహించవచ్చు. ఈ విధంగా భాషావిశ్లేషణ ద్వారా గ్రంథసౌందర్యతత్త్వాన్ని, తత్త్వసౌందర్యాన్ని వివరించే శాస్త్రాన్నే **శైలీశాస్త్రం** (Sylistics) అని అంటారు. దీనినే మన ప్రాచీన భారతీయులు **'సంవిధానం'** (≠శిల్పం) అని అన్నారు. కానీ ప్రాచీనులు అన్నిరకాల విధానాలను ఒడిసిపట్టి సిద్ధాంతీ కరించక పోవడంవల్ల, ఇంకనూ సిద్ధాంతీకరించవలసినటు వంటి – రానున్న అభివ్యక్తులకు స్థానం ఇవ్వాల్సినటువంటి బాధ్యతను 'శైలీశాస్త్రం' తీసుకున్నది. సౌందర్యకారకాలు లేదా పోషకాలు కవినిబట్టి, పాఠకుణ్ణిబట్టి, వారిరువురి ప్రభావాన్నిబట్టి, కాలధర్మాన్నిబట్టి మారుతూ ఉండవచ్చు. కచ్చితంగా ఇలా అని చెప్పలేము. ఆ కాలానికి, ఆ సందర్భానికీ లేదా ఆ గ్రంథాన్ని సాకల్యంగా చదివినప్పుడు కనపడే విలక్షణతకి విధేయయై శైలీ శాస్త్రం నడుస్తుంది. ఒక కళ ఎలా శాస్త్రంగా అవుతుందో చెప్పి దానిని అభ్యసించేవారికి మార్గాన్ని ఏర్పరుస్తుంది శైలీశాస్త్రం. వైజ్ఞానిక శాస్త్రాల్లోని **ఆగమన-నిగమన** పద్ధతులు ఇక్కడ అనుప్రయుక్తం.

ప్రస్తుతం మనం కేవలం భాషావిశ్లేషణకు మాత్రమే పరిమితమై అతి తక్కువ కాలంలోనే నలుదిక్కుల కీర్తిని పొంది నటువంటి, తొలి తెలుగు యౌగికకావ్యంగా, ఆధునిక ఇతిహాసం గా వాచస్పతులతో ప్రామాణీకరింపబడినటువంటి విశ్వర్షి వాసిలి వసంతకుమార్ గారి 'నేను' అనే గ్రంథానికి శైలీశాస్త్ర సిద్ధాంతా లను అనుప్రయుక్తం చేస్తూ ఆ గ్రంథ సౌందర్యాన్ని గ్రోలుదాం – నిజానికి ఈ గ్రంథము శైలీశాస్త్ర పరంగా ఒక పిహెచ్.డి. కోసం స్వీకరించదగ్గది. కాని పరిశోధనావ్యాసం కొరకు సంక్షిప్తం గా ఒక్కొక్క అధ్యాయంలోని ఒకటి లేదా రెండు ఉదాహరణలను మాత్రమే తీసుకొని అనుప్రయుక్త పూర్వకంగా విశ్లేషించడం జరిగింది.

కం. **విశ్వర్షి పదారూఢుఁడ**
**వై,శ్వశ్రేయోపదేష్టవై నిరవధికా**
**నశ్వర సంపల్లక్ష్మీ**
**శాశ్వతకీర్తుల రహిల్లు సంతుష్టిమెయిన్!"**

అని "విశ్వర్షిగీతగా వాసిలించిన నేను" అనే పేరుతో తన అభిప్రాయాన్ని 'నేను' కావ్యానికి అందించిన డా॥ ఏల్చూరి మురళీధరరావుగారి గ్రహణపారీణత ఈ గ్రంథ శైలీశాస్త్ర ఛాయాంశాలను చెప్పకనే చెబుతున్నది. **'పదారూఢుఁడ'**వై అనే పదబంధసమాలోచనం నా ఈ భావనకు పునాది.

ఈ యౌగికకావ్యంలో కవిగారు అధ్యాయాలకు పేరు పెట్టిన తీరులోనే రూపవాద శైలీశాస్త్ర మర్యాదలు తొంగి చూస్తు న్నాయి. ఇది క్రమాధ్యయనం వల్ల అవగతమవుతుంది. జీవుడు తొలిగా పరమాత్మలో ఉంటాడు. కర్మఫలం శూన్యం కావడం వల్ల తిరిగి మళ్ళీ పరమాత్మను చేరుతాడు. పుట్టుకకు ముందూ తర్వాత జీవుని వసనం పరమాత్మలోనే. దీన్ని సూచించడానికి బృహదారణ్యక, ఈశావాస్యోపనిషత్తుల్లోని శాంతిమంత్రం ఇక్కడ

ఉల్లేఖింపదగినది –

**ఓం పూర్ణమదః పూర్ణమిదం**
**పూర్ణాత్ పూర్ణముదచ్యతే ।**
**పూర్ణస్య పూర్ణమాదాయ**
**పూర్ణమేవావశిష్యతే ॥**

ఈ శ్లోకభావాన్ని వాసిలివారు వ్యంజింపజేయడం కోసం ప్రథమ, షష్ఠ్యధ్యాయాల ప్రథమాక్షరాన్ని ఒకే అక్షరంతో సూచించారు. యోగం ( = జంట → ఆత్మాపరమాత్మల సంలీనం) అనేది చావుపుట్టుకల తర్వాత, ముందే కాదు బ్రతికి ఉన్నప్పుడు కూడా అదే స్థితిని కలిగి ఉండాలి అని చెప్పడానికి సంయుక్తాక్షరమైన 'ప్ర' కారాన్ని ప్రయోగించారు. వీటిని ఐదు మాత్రమే ప్రయోగించ డానికి కారణం, ఆ స్థితిలోనే పంచభూతాలు స్వాధీనం అవుతాయని చెప్పడం. ఏడు అధ్యాయాల ప్రణాళికను నిర్వహించడం "సంబంధంబు సాప్తపదీనంబు"ను గూర్చి చెప్పడం కోసమే. మరి సంబంధం వల్లనే కదా 'యోగం' సిద్ధించేది. అసలు 'నేను' అనే మాటలోని నకారద్వయమే 'యోగం' కదా! 'న' కారాలతో కూడుకున్న శీర్షికను నిర్ణయించడం లోనే కవి లేదా రచయిత యొక్క ప్రతిభ ఏమిటో తెలుస్తుంది. సారూప్యతత్త్వసంబంధి అంటే ఇదే – ఇప్పటి వరకూ చెప్పిన విషయాలను కొందరు చమత్కృతిగా కూడా అభివర్ణించ వచ్చు. కానీ అది చమత్కృతి కావాలంటే చెప్పిన విషయాల్లో అనౌచిత్యం తొంగిచూడాలి అలా కానప్పుడు అది శైలీనే అవుతుంది. ఇలాంటి వాటిని దృఢపరచడానికే మనకు శైలీశాస్త్రపరమైన రేఖాచిత్రాలు, ప్రసారచక్రాలు లేదా పట్టికలు అవసరమవుతాయి –

0. ◇ప◇ రిణామం (*శరీరవృద్ధి)
1. (ప్ర) – మోదం (*శైశవానందం)
2. (ప్ర) – మాణం(*మానం/గౌరవజీవనం)
3. (ప్ర) – స్థానం (*సమాజప్రతిష్ఠ)
4. (ప్ర) – యోగం (*కలిసిరావడం)
5. (ప్ర) – విమలం (*శుద్ధి/విముక్తం)
6. ◇ప◇ – రమం (*పరమాత్మసంలీనం)

**ప – పరమాత్మ**
పంచప్రకారాలు
(పంచభూతాలు = Iconicity)
0–6 → శాంతిమంత్రం
(బృహదారణ్యకం, ఈశావాస్యము)
ప్ర → ప్రకృష్టయోగం
**ప – పరమాత్మ**

ఇక్కడి పకార, ప్రకారాలు నన్నయ చెప్పిన అక్షరరమ్యతగా (Sound Patterns) అనిపించవచ్చు. కానీ నన్నయగారు కేవలం భావస్ఫురణ కోసం మాత్రమే వాడిన తీరు అది. అందుకే ఆ రమ్యత కవిత్వభాషలో భాగమయ్యింది. ఇందాకటి రేఖాచిత్రంలో మనకు విభిన్నమైన భావనలు సారూప్యతత్త్వంతో అందించ బడ్డాయి. ఇది అక్షరరమ్యతను మించిన విధానం. ఇది ఒక లాంటి సౌందర్యం. అందుకే ఈ చర్చ శైలీశాస్త్రంలో చేరింది. *గుర్తుగల వాటిని చదివితే మానవజీవన క్రమవికాసం కూడా తెలుస్తుంది.

పాశ్చాత్యదేశాలలో సాహిత్యానుశీలనలోని వ్యక్తినిష్ఠ ధోరణులను, సూటిగా చెప్పకపోవడానికి ప్రతిక్రియగా శైలీ శాస్త్రం ఆవిర్భవించిందని అంటారు. ఇక్కడ రెండు విషయాలు 1. పుట్టుక ఎలాంటిదయినా అనువర్తనాలు అనేకం, 2. ప్రాచీన భారతదేశంలో శైలీశాస్త్రం అనే పదం లేకుండానే "వక్రత – వక్రోక్తి – రీతి – అలంకారాలు" అనే పేరుతో శైలీ శాస్త్రం పోషింపబడింది అనే సంగతిని మరువరాదు.

విధానం (శైలి)
↓
భాషాతత్త్వ సంబంధి (శబ్దార్థ స్వరూపం) | విషయ నిర్వహణసంబంధి
↑
విధానం (శైలీవిమర్శ)


ముందుగా **పరిణామపథం**లోని ఈ కవితాపాదాలను గమనిద్దాం –

అణువు మూలంగా కణకణ **సంయోగాన్ని**
మానవతత్వానికి తొలి **ఆత్మను**
మానవతనానికి తొలి **అణువును**
మానవరూపానికి తొలి **కణాన్ని**
**సృష్టి**కి ఆకరంగా నేను. (నేను – పుట 49)

పై నాలుగు పాదాల్లోని చివరి పదాలను మనం గమనిస్తే అవి చివరిపాదంలోని 'సృష్టి' అనే పదానికి సార్థకతను కలిగిస్తాయి. పై పాదాలన్నీ నిజానికి వ్యస్తాలు. అన్నింటి భావసారం సృష్టి. కానీ దీనిని పదాలలో వ్యజింపజేయడం అనేది పదస్థాయి అగ్రీకరణం. సృష్టిలో మొదటిచర్య సంయోగం. దాని ద్వారా ఏర్పడే సంయుక్తబీజం గానీ లేదా తర్వాతి దశల్లోకిగానీ ప్రవేశించేది ఆత్మ. ఆ తర్వాత అణువుల ప్రమేయంతో శరీరం పెరగడం (రిక్తికలు, డిఎన్ఎ, జీవద్రవ్యం, మైటోకాండ్రియా – మొ॥) పెరిగే శరీరానికి కనిష్ఠ ప్రమాణం 'కణం' కావడం – ఇదంతా సృష్టికి మూలం, అసలు సృష్టి ఏర్పడే తీరు ఇది అని చెప్పడం కోసం 'సృష్టి' పదం చివరి

పాదంలో ప్రయోగింపబడింది. ఇది కదా చెప్పే విధానంలోని విలక్షణత అంటే! ఇదే ఇక్కడ సౌందర్యానికి కారణం. దీన్నే 'శైలీ' అంటున్నాము.

**సృష్టిక్రమాన్ని అర్థం చేయించే రేఖాచిత్రం**




(*సంయోగం తర్వాత నేరుగా 'ఆత్మ' శబ్దాన్ని వాడటం కేవలం 'యోగం' అనేది ఆత్మసంబంధమైనదని చెప్పటం కొరకే)

అలాగే శబ్దాలంకారాలన్నీ శైలీశాస్త్రంలోని వర్ణస్థాయిలో జరిగే అగ్రీకరణం అంటే సమాంతరత అనే (Parallelism) అగ్రీకరణ విభాగంలోకి వస్తాయి. దీనికి 'నేను' లోని మంచి ఉదాహరణ –

సంకల్పజని**తమే** !
అయోనిజ సంజా**తమే** !
జనన మరణ వలయాతీత **తత్వమే** !
మృతతత్వాన్నధిగమించే అమర**త్వమే** !
శాశ్వత ఆత్మగా అయోనిజ స**త్వమే** !
సంభోగరహిత విశ్వరచనా సార**థ్యమే**!

(నేను – పుట 54)

సామాన్య ప్రాతిపదికా స్థాయిని మించి వ్యక్తినిష్ఠ నుండి వస్తునిష్ఠాస్థాయిని అంచనావేసే అభివ్యక్తియే **అగ్రీకరణం.**[2] దీనికి 'నేను' కావ్యంలో కొన్ని వందల ఉదాహరణలు కనబడతాయి. ఉదాహరణకు **ప్రమోదపథం**లోని ఈ క్రింది పాదాలను గమనించండి –

**నింగి ఉరిమిందంటే నా అక్షరాల రాపిడే**
**ఆకాశం మెరుపయిందంటే నా అక్షరాల విరుపే**
**నల్లమబ్బు కరిగిందంటే నా అక్షరాల లాలిత్యమే**

(నేను – పుట 75)

నిజానికి అక్షరాల రాపిడికీ – నింగి ఉరమడానికీ, అక్షరాల విరుపుకు – ఆకాశపు మెరుపుకు, అక్షరాల లాలిత్యానికి – నల్లమబ్బు కరగడానికి సంబంధమేమీ లేదు. కారణం కాని దానిని కారణం, చేసి విషయనిర్వహణలో (భావగతంగా) దానిని సరియైన కారణంగా ఋజువు చేయడం అనే శైలి ఇందులో కనపడుతున్నది. ఇలాంటి సౌందర్యశైలి మనకు అలంకారాల్లో పూర్తిస్థాయిలో కనపడదు. ఇందులో భావం సూచ్యం. ఈ విశ్లేషణ ఒకరకంగా శైలీశాస్త్రంలోని **సమతాగుణం**[3] క్రిందకు వస్తుంది.

| **కర్త** | **క్రియ** | **కర్మ** | **ప్రతిక్రియ** |
|---|---|---|---|
| 1. అక్షరాలు | (1-1) రాపిడి → | 2. నింగి → | (2-1) ఉరిమింది |
| | (1-2) విరుపు → | 3. ఆకాశం → | (3-1) మెరుపయ్యింది |
| | (1-3) లాలిత్యం → | 4. నల్లమబ్బు → | (4-1) కరిగింది |

కర్త ఏమాశించి ఏ క్రియను నెరపిందో ఆ క్రియకు తగిన ఫలితం తగినంతగా వచ్చింది. ఇక్కడ నిజానికి ఇక్కడ ఘటనల క్రమం ఉండవలసినది ఇలా –

1 – (1-1) – 2 – (2-1)
1 – (1-2) – 3 – (3-1)
1 – (1-3) – 4 – (4-1).

కానీ సౌందర్యసిద్ధి కోసం కవి తన కవితాపాదాల్లో ఈ క్రింది క్రమాన్ని అనుసరించాడు –

2 – (2-1) – 1 – (1-1)
3 – (3-1) – 1 – (1-2)
4 – (4-1) – 1 – (1-3)

ఇంకాస్త వివరణలోకి వెళితే 'హేత్వాభాస' అనే మాట ఉంది. న్యాయశాస్త్రజ్ఞులు, బౌద్ధికులు దీన్ని ఒక దోషంగా చెబుతూ ఉంటారు. అంటే హేతువనే భ్రాంతి. ఇది వాచ్యార్థాలకు ఉపయుక్తం. కానీ కవితాపాదాలు లక్షణ లేదా వ్యంజనార్థాలైనప్పుడు ఈ 'హేత్వాభాస' నిరర్థకం అవుతుంది. పోనీ ఇది జాత్యభావ లేదా అసిద్ధ హేతూత్ప్రేక్ష (కారణం కానిది కారణమవ్వడం) అని అందామా అంటే – కారణం కానిదాని వెనుక ఈ కారణమే సరియైనది అనే భావాలు ఇమిడి ఉన్నాయి. ఇది హేతూత్ప్రేక్షలో ఉండదు. కాబట్టి ఇక్కడ శైలీశాస్త్ర చర్చే అవసరమయ్యింది.

| | **క్రియ** | | **ప్రతిక్రియ** | | **ప్రతీకలు** |
|---|---|---|---|---|---|
| 1. | అక్షరాల రాపిడితో | → | నింగి ఉరమడం | → | (ప్రజాస్పందన) |
| 2 | అక్షరాల విరుపుతో | → | ఆకాశం మెరుపవ్వడం | → | (ప్రజాచైతన్యం) |
| 3. | అక్షరాల లాలిత్యంతో | → | నల్లమబ్బు కరగడం | → | (ప్రజామానవీయత) |

శైలీశాస్త్రవేత్తలు చెప్పిన భావనలలో Collocative

clash ఒకటి. దీనిని యోగ్యతాభంగంగా **ఆచార్య పరిమి రామనరసింహం** గారు అనువాదం చేశారు. ఈ లక్షణం కవిత్వం యొక్క సర్వసాధారణ ప్రధాన లక్షణాల్లో ఒకటి. ఈ క్రింది కవితలో యోగ్యతాభంగంతో పాటు రూపకాలంకారాన్ని కూడా కవి ప్రదర్శించి సౌందర్యాన్ని రాబట్టాడు –

**నా అక్షరాలు**

**నైమిశారణ్యంలో విహరించే శుకపికాలు**
**నీటి సవ్వడులు వినిపించే నింగి రహస్యాలు**
**గిరి మంత్రాలు నినదించే అరణ్య తంత్రాలు**
**పల్లెపదాలు నిస్వనించే కర్షక నినాదాలు**
**బ్రహ్మర్షి బోధనలు ఘోషించే కర్మిష్ఠి క్రియలు**
**(నేను – పుట 75)**

దీనిని ఈ విధంగా ప్రదర్శించవచ్చు –

| ఉపమేయం | ఉపమానాలు | అభేదం | యోగ్యతాభంగాలు |
|---|---|---|---|
| అక్షరాలు | = రహస్యాలు | వినిపించడం | నీటి సవ్వడులు వినిపించడం |
| | = నినాదాలు | నిస్వనించడం | పల్లెపదాలు నిస్వనించడం |


*ప్రతీకార్థంలో నీరు అంటే నింగి అని, పల్లె అంటే కర్షకులని కవి తెలియజేశాడు. అంటే కర్షకులనే అర్థం, భాషలో సూచ్యార్థంగా (Connotative Meaning) రూఢమై ఉన్నది. ఈ రూఢత వాక్యప్రయోగాల్లో **స్వయంచాలనా**[4] నికి తలుపులు తీస్తుంది.

సాధారణంగా మనకు శబ్దాలంకారాల్లో ముక్తపదగ్రస్తాలంకారం ఉంటుంది. ఇందులో కచ్చితంగా చివరి పదాన్నే తర్వాతి పాదారంభంలో గ్రహిస్తారు. కానీ ఇందుకు భిన్నంగా విచ్ఛిన్నతతో ఒక పాదంలో చివరి నామపదాన్ని, మరొకపాదంలో ఉపాంత క్రియాపదాన్ని గానీ విశేషణాన్ని గానీ తీసుకుని కవిత్వం వ్రాయడం వల్ల కొంత సౌందర్యం సిద్ధిస్తుంది. అందుకు 'నేను' కావ్యంలోని **ప్రమాణపథంలోగల** ఈ క్రింది ఉదాహరణను చూడండి –

**శూన్యాన నెలకొన్న వాయువును**
**వాయువు పరిణమించిన గాలిని**
**తేజస్సు విరచిస్తున్న కాంతిని**
**విరిసిన ఇంద్రచాప విభవాన్ని**
**వర్ణసమీకృత జలకాంతిపుష్పాన్ని**
**జలతరంగ జనన వాసనను** (నేను – పుట 116)

ముందు పాదంలోని **వాయువుతో** తర్వాతి పాదాన్ని మొదలు పెట్టాడు. మూడవ పాదంలో రెండవ పాదపు ఏ పదాలూ లేక విచ్ఛిన్నత ఏర్పడింది. అదే మూడవ పాదంలోని **విరచిస్తున్న** అనే ఉపాంత క్రియాపదాన్ని తీసుకుని నాల్గవ పాదాన్ని **విరిసిన** అనే విశేషణంతో మొదలుపెట్టాడు. నాల్గవ పాదంలోని **ఇంద్రచాపవిభవాన్ని** వివరించే **వర్ణసమీకృత** అనే పదంతో ఐదవ పాదాన్ని ప్రారంభించాడు. ఈ ఐదవపాదంలోని ఉపాంత విశేషమైన **'జల'** శబ్దాన్ని తీసుకుని **'జలతరంగ'** అనే విశేషణంతో ప్రారంభించాడు. ఇలాంటి విధానం కొంతవరకు శ్రవణానంద కరంగా ఉంటుంది.

**విచ్ఛిన్నముక్తపదగ్రస్తము**




'అ'కారపు ఆద్యక్షర ప్రాసతో వృత్త్యనుప్రాసాలంకారం గల అలంకృతవర్ణస్థాయి అగ్రీకరణానికి ఈ క్రింది పాదాలు చక్కని ఉదాహరణ –

**అవసరాలను గణించనివాడిని**
**అనవసరాలను పరిగణించనివాడిని**
**అవసరంలోని అనవసరత అవగతమైనవాడిని**
**అనవసరంలోని అవసరత అర్థమైనవాడిని**
**అవసర తొందరనూ కాను**
**అనవసర వేగాన్నీ కాను** (నేను–పుట 119)

శైలీశాస్త్రంలో భాషానిర్మాణపరమైన సాధ్యతల ఒకానొక లాభసాటి వినియోగాన్ని కూడా శైలీ అని పిలుస్తారు. దీన్నే Style as a particular exploitation of a grammar of possibilities అని అంటారు. పై చరణాలన్నీ ఒకేరకమైన వాక్యవిన్యాసంతో నడచి చివరి వాక్యభాగంతో అన్వయిస్తాయి. దీన్నే లంకెలు ఏర్పడటం లేదా **సంధాయకాలు** అని అంటారు. దానికి పోతనగారి 'మందారమకరంద' పద్యం గొప్ప ఉదాహరణ. ఇలాంటిదే ఈ 'నేను' కావ్యంలో కూడా కనపడుతున్నది. ఈ ఉదాహరణలో 'నేను' అనే పదం శబ్ద సంబంధమైన **పూర్వసూచిగా** (Anaphora) ప్రవర్తిల్లుతున్నది. అయితే ఇదే పూర్వసూచికావిధానం మాత్రం ఈ కావ్యమంతా అవిచ్ఛిన్నంగా కనపడుతూ ఉన్నది. ముందు సాధ్యతల ఒకానొక లాభసాటి వినియోగాన్ని **ప్రస్థానపథంలో** గమనిద్దాం –

**అవును, నేను**

**గమ్యం నుండి విముక్తం కావాలి**
**గమనం నుండి విముక్తం కావాలి**
**ఇహం నుండి విముక్తం కావాలి**
**పరం నుండి విముక్తం కావాలి**
**తపస్సు నుండి విముక్తం కావాలి**
**మహస్సు నుండి విముక్తం కావాలి**
**ధ్యాస నుండి విముక్తం కావాలి**
**ధ్యానం నుండి విముక్తం కావాలి**
**అన్నిటికంటే**
**ముందస్తుగా**
**నా నుండి నేను విముక్తం కావాలి**

(నేను – పుట 155)

'నా నుండి నేను' అనే భావన, పైన పేర్కొన్న అన్ని భావనలతో సంధాయకాన్ని ఏర్పరచుకోగా **'అవును, నేను'** లోని 'నేను' పూర్వసూచి అయ్యింది.

ఒక వాక్యంలోని పదాల మధ్య ఉండే **రూపావళి సంబంధాన్ని** (Paradigm) కూడా శైలీశాస్త్రం విశ్లేషిస్తుంది. ఉదాహరణకు 'నేను' కావ్యంలోని **ప్రయోగపథంలో**గల ఈ పాదాలను గమనించండి –

**నేను**
**రూపంలో అరూప అవతరణను ... శబ్దంలో నిశ్శబ్ద అవతరణను**
**చూపులో లోచూపు అవతరణను ... స్వరఝరిలో మౌన అవతరణను**
**ఫాలభాగాన త్రినేత్ర అవతరణను ... నడినెత్తిన ముల్లోక అవతరణను**
**కపాలకేంద్రాన సహస్రార అవతరణను** (నేను – పుట 171)

| **పదాలు** | | **సామ్యపదాలు** | **పర్యాయాలు** |
|---|---|---|---|
| రూపం | – | అరూప | (నిరాకారం అని చెప్పొచ్చు కదా!) |
| శబ్దం | – | నిశ్శబ్దం | (ధ్వనిరహితం అని అనొచ్చు కదా!) |
| చూపు | – | లోచూపు | (అంతర్దృష్టి అని అనొచ్చు కదా!) |

కానీ సౌందర్యం కోసం ధ్వనిసామ్యమున్న పదాలనే కవి ఎంపిక చేసుకున్నాడు. అందుకే దీనిని **ఎంపిక సంబంధం** లేదా Choice Relationship అని అంటారు.

ఈ శైలీశాస్త్రంలో **రెండుతరువుల అగ్రీకరణం** (Two - tier foregrounding) అనేది కూడా విశేషమైనది. ఒక అగ్రీకృతవాక్యానికి నేపథ్యమైన వాక్యం, మరొక నేపథ్యవాక్యానికి అగ్రీకృతవాక్యం అయినప్పుడు దాన్ని రెండుతరువుల అగ్రీకరణం అనవచ్చు. ఉదాహరణకు నేను కావ్యంలోని **ప్రవిమలపథాన్ని** చూద్దాం –

**నేను మౌనాన్ని**
**మౌన శిఖరాన్ని**
**శిఖర మౌనాన్ని** (నేను – పుట 201)

**నేను మౌనరాగాన్ని**
**రాగ సంసారాన్ని**
**సంసార సరాగాన్ని** (నేను – పుట 202)

| | | | |
|---|---|---|---|
| **అగ్రీకృతవాక్యం** | : | నేను మౌనాన్ని | నేను మౌనరాగాన్ని |
| ↑ | | | |
| **నేపథ్యవాక్యం$_1$** | : | మౌనశిఖరాన్ని | రాగసంసారాన్ని |
| ↑ | | | |
| **నేపథ్యవాక్యం$_2$** | : | శిఖరమౌనాన్ని | సంసార సరాగాన్ని |

అలాగే ఆది ద్విప్రాస, అంత్య ఏకప్రాసలతో కూడా శైలీశాస్త్రపరమైన సౌందర్యం సిద్ధిస్తుంది. ఉదాహరణకు నేను కావ్యంలోని **పరమపథంలోగల** ఈ పాదాలను చూడండి –

**కాను, సప్తధాతు తనువును**
**కాను, జ్ఞానేంద్రియ సంపదను**
**కాను, కర్మేంద్రియ సంహితను**
**కాను, పంచవృత్తుల పేటికను**
**కాను, పంచవాయువుల వేదికను**
**కాను, సుషుప్త అజ్ఞాన మండలాన్ని** (నేను – పుట 219)

అలాగే వాక్యస్థాయి అగ్రీకరణం ఈ మధ్యకాలంలో వచనకవితల్లో ఎక్కువగా చోటు చేసుకుంటున్నది. ఇందులో క్రమాలంకారం కూడా ఒక భాగం. ఇందుకు 'నేను' కావ్యంలోని ఈ ఉదాహరణను చూడండి –

**తెల్లకాగితంపైన అదుగిడిన అక్షరాలు**
**నిశిరాత్రిన వెలుగుజాడలవుతున్నాయి**
**ఫాలరేఖన జాగృతమైన అక్షరదర్శనాలు**
**పాలపుంతకు దత్తతపోతున్నాయి**
**ఈ దర్శనయోగంలో**
**మార్గదర్శనాలూ నావే! విశ్వదర్శనాలూ నావే!**

(నేను – పుట 238)

1. అడుగిడిన అక్షరాలు – వెలుగుజాడలు
2. అక్షరదర్శనాలు – పాలపుంత
3. మార్గదర్శనాలు }
4. విశ్వదర్శనాలు } – నావే

(1-3), (2-4) పద్ధతి వల్ల ఇక్కడ సౌందర్యం ఏర్పడింది. ఇది మన ప్రాచీనులు చెప్పిన క్రమాలంకారమే. ఇలా ఎన్నో రకాలుగా ఈ కావ్యమంతటా సౌందర్యాన్ని దర్శించవచ్చు.

**ముగింపు**

సాహిత్య అధ్యయనానికి ఉన్న అనేక అంగాలలో భాషా శాస్త్రదృక్పథం (భాషాతత్త్వ వివేచనసూత్రాల అనువర్తనం) అనేది కూడా ఒక ముఖ్యమైన అంగం అని తెలుపుతూ దాన్ని అనువర్తింపజేయగా వచ్చిన సౌందర్యం ఈ వ్యాసం ద్వారా తెలియవస్తున్నది అని మనవి చేస్తున్నాను.

**పాదసూచికలు**

1. ఆంధ్ర మహాభారత శైలీపరిశీలనం – ఆచార్య పరిమి రామనరసింహం – హైదరాబాద్, 1996.
2. **అగ్రీకరణం** – ప్రమాణభాష యొక్క నియతిని (Norm) వెనుకకు ఉంచి ఒక ప్రత్యేకమైన అభివ్యక్తిని 'ముందుకు తేవడం'. దీన్నే Foregrounding అని అంటారు.
3. **సమతాగుణం** – ప్రసిద్ధార్థ అప్రసిద్ధార్థాలను ప్రయోగించడం లోనూ, ఆయా అంశాలను ఉపమాన ఉపమేయాలకు అన్వయించటంలోనూ, వ్యాకరణాంశాల వ్యాప్తిలోనూ ఒక సమతూకం స్పష్టంగా కనిపించడం.
4. **స్వయంచాలనం** – అగ్రీకరణకు గురైన అభివ్యక్తులు కాలక్రమంలో ప్రమాణభాషలో కలిసిపోవడాన్ని స్వయం చాలనం లేదా Automatization అని అంటారు.


**ఉపయుక్తగ్రంథాలు :**

1. అనువర్తిత భాషాశాస్త్ర దృక్కోణాలు – ఆచార్య పరిమి రామనరసింహం – పరావాక్ ప్రచురణలు – హైదరాబాద్, 1997.
2. ఆంధ్ర మహాభారత శైలీపరిశీలనం – ఆచార్య పరిమి రామనరసింహం – హైదరాబాద్, 1996.
3. ఆధునిక సాహిత్య విమర్శరీతులు – ఎ.వి. కళాశాల (గగన్‌మహల్) – హైదరాబాద్, అక్టోబర్ 2004.
4. నేను (యౌగికకావ్యం) – విశ్వర్షి వాసిలి వసంతకుమార్ – యోగాలయ ప్రచురణలు – హైదరాబాద్, మార్చి 2020
5. Stylistics (A Resource Book - For students) - Paul Simpsow - phychology press - 2004.

**పత్రికలు :**

6. టి. సతీశ్ – మిసిమి (చింతనాత్మక సారస్వతం) – పుటలు 65-69-ISSN : 2454-4329 – కళాజ్యోతి ప్రాసెస్ ప్రైవేట్ లిమిటెడ్ – హైదరాబాద్, ఏప్రిల్ 2018.
7. డా॥ ఎన్. గోపికవిత్వం – పరిభాష – ఎం. నారాయణశర్మ (98483 48502) – నవతెలంగాణా – హైదరాబాద్, 23 మార్చి 2017.
8. సౌందర్యభారతి – డా॥ బోలుగద్దె అనిల్ కుమార్ – శ్రీచందన మారోజు ప్రచురణలు – హైదరాబాద్, 2020.


★ **రచయిత: తెలుగు అధ్యాపకులు, చైతన్య అకాడమి** T


**రచయితలకు సూచనలు:**

**1. రచనలను డీటీపీ చేసి పంపేవారు ప్రతినెల 12వ తేదీలోగా ఓపెన్‌ఫైల్‌లో లేదా వర్డ్ ఫైల్‌లో పత్రిక మెయిల్ అడ్రస్‌కు పంపించగలరు.**

**2. స్మార్ట్‌ఫోన్లలో ఫొటోలు తీసి వాట్సప్ ద్వారా రచనలను పంపించవద్దు.**

**3. ఇతర పత్రికలకు పంపే రచనలను మాకు పంపవద్దు.**

**4. అర్థం కాకుండా, కొట్టివేతలతో ఉండే వ్యాసాలను పత్రిక అంగీకరించదు.**

**5. పరిశోధక రచయితలు పంపే రచనలు కచ్చితంగా తమ ఆమోదపత్రం జతచేసి పంపించగలరు. గతంలో ముద్రించిన వ్యాసాల్లోని పేరాలు ఎత్తి రాసి పంపవద్దు.**

# 'మా భూమి' నాటకం-భూస్వామి, రైతు సంబంధాలు

డా॥ ఎమ్. శంకర్

**సంక్షిప్తి(Abstract)**

మాభూమి నాటకం తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట నేపథ్యంగా వచ్చింది. సుంకర సత్యనారాయణ, వాసిరెడ్డి భాస్కరరావు కలిసి ఈ నాటకాన్ని రాసారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటాన్ని వీడి మాభూమి నాటకాన్ని అర్థంచేసుకోవడం కష్టం. కథావస్తుపరంగా నిజాంకాలంలో భూస్వాముల ఆగడాలు ఎలా ఉన్నాయి? ఆంధ్రమహాసభ, రైతు సమస్యలను ఎలా పరిష్కరించింది? తెలంగాణ ప్రాంతంలో రైతు సంఘాలు ఎలా పనిచేసాయి? లెవీపన్నుతో ప్రజలు ఎన్ని కష్టాలు ఎదుర్కొన్నారు? హిందూముస్లింలు ఐక్యంగా జమిందార్లను ఎలా ఎదుర్కొన్నారు? నిజాం ఫ్యూడల్ విధానంలో దేశ్ ముఖ్, దేశ్ పాండె, పటేల్, పట్వారిలు ప్రజలను ఎలా జలగల్లా పీల్చిపిప్పిచేశారు? జమిందార్ల ఏలుబడిలో వెట్టి విధానం ఎలా కొనసాగింది? రజకులు, మంగలివారు, గొల్లవారు, వ్యాపారులు ఎలాంటి బాధలు పడ్డారు? జమిందారీ వ్యతిరేక ఉద్యమ సాహిత్యంలో పాట ఎలాంటి పాత్రపోషించింది వంటి ఎన్నో అంశాలు ఈ పత్రంలో చర్చకి వచ్చాయి. ఈ అంశాలు భూస్వాములు, రైతులకు మధ్య ఉన్న సంఘర్షణాత్మక సంబంధానికి నిదర్శనాలు. వీటిని తెలంగాణ చారిత్రకభూమికతో పరిచయం చేయడం ప్రస్తుత పరిశోధన వ్యాస ముఖ్య ఉద్దేశం.

**సాంకేతిక పదాలు (Key Words)**

*నాటకం, తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం, నిజాంకాలం, భూస్వామి, రైతు, సంఘం, లెవీ పన్ను, ఆంధ్రమహాసభ, అమరులు, భూస్వామి-రైతు సంబంధాలు, హిందూముస్లిం, దేశ్ ముఖ్.*

## 1. మాభూమి నాటక పరిచయం

మాభూమి నాటకంలోని ప్రతీ దృశ్యం సామాజికం, అది నాటి సమాజానికి దర్పణం. ఒక రకంగా చెప్పాలంటే పంతొమ్మిది వందల ముప్పై, నలభై సంవత్సరాల మధ్య తెలంగాణ ప్రాంతంలో ఉన్న పరిస్థితులకు డాక్యుమెంటరీ చిత్రం మాభూమి నాటకం. ఈ నాటకానికి చాలా ప్రాముఖ్యం ఉంది. అప్పటికే "ముందడుగు" నాటకాన్ని రాసి ప్రాచుర్యం పొందిన సుంకర సత్యనారాయణ, వాసిరెడ్డి భాస్కరరావు గార్లు మాభూమి నాటకాన్ని రాయడం రచనాపరమైన ప్రత్యేకత కాగా ఇతివృత్తం, కథావస్తువులో సమాజాన్ని, సామాజిక పరిస్థితులని చిత్రించడంవల్ల ఈ నాటకాన్ని సాంఘిక నాటకాల్లో మకుటాయమానమైనదిగా పేర్కొనవచ్చు.

బందగీ సమాధి వర్ణనతో ప్రారంభమైన నాటకం వీరారెడ్డి, దాదాసాహెయబ్, సుభాన్, రామిరెడ్డి, సీత, కమల వంటి పాత్రల సంభాషణతో కొనసాగుతుంది. నాటకంలోని పాత్రల మధ్య నడిచే సంభాషణ ముఖ్యంగా నాటక కథ, కథాకాలం నాటి పరిస్థితులు ఏకకాలంలో పాఠకునికి అందించడం జరిగింది. కథాపరంగా జగన్నాథరెడ్డి అనే జాగిర్దార్ కు, అతన్ని ఎదిరించిన వీరారెడ్డి కుటుంబానికి మధ్య నడిచిన ఘర్షణ కనిపిస్తుంది.

ఈ నాటక రచయితలిద్దరూ అభ్యుదయ భావాలు కలిగినవారు. వాసిరెడ్డి భాస్కరరావు కమ్యునిస్టు ఉద్యమాలద్వార ఆకర్షితులై తమ యావదాస్తిని కమ్యునిస్టు పార్టీకి విరాళంగా ఇచ్చి, నమ్మిన సిద్ధాంత ప్రచారంకోసం రచనలు చేసారు. సుంకర సత్యనారయణ సమాజ అభ్యుదయాన్ని కాంక్షించి ముందడుగు, పరివర్తన, అపనింద వంటి నాటకాలు రాయడమేకాక 1930లో ఉప్పుసత్యాగ్రహంలో పాల్గొని, జైలు శిక్షనుకూడా అనుభవించారు. తాను రాసిన నాటకాలకు తానే ప్రయోక్తగా ఉండి, 100కు పైగా ప్రదర్శనలిచ్చారు. కష్టజీవి, అల్లూరి సీతారామరాజు, తెలంగాణ, అమరజీవి లెనిన్, అమరయోధులు మొదలైనవి వీరి కలం నుండి జాలువారిన బుర్రకథలు. వీరకుంకుమ, గిత్తలబేరం, నూరుకాకులు, మొదలైనవి వీరి ఇతర నాటకాలు. ఈ ఇద్దరు రచయితలకు సినిమారంగంతో పరిచయం ఉంది. సుంకర సత్యనారాయణ 23 మార్చి, 1909లో జన్మించి, 9 సెప్టెంబర్ 1975న మరణించారు. వాసిరెడ్డి భాస్కరరావు 2 సెప్టెంబర్ 1914న జన్మించి, 1 నవంబర్ 1957న మరణించారు.

## 2. నిజాం కాలం - భూస్వామ్య విధానం

"తెలంగాణ ప్రాంతంలో రైతాంగ సాయుధ పోరాటం

ఉవ్వెత్తున ఎగిసిపడటానికి ప్రధాన కారణం నిజాం పాలనలో కొనసాగిన భూస్వామ్య(ఫ్యూడల్) విధానమే. హైదరాబాద్ సంస్థానంలో వ్యవసాయం కిందగల మొత్తం భూమి 5.30లక్షల ఎకరాలు. అందులో 30కోట్ల ఎకరాలు ప్రభుత్వ శిస్తు వ్యవస్థ కింద ఉండేవి. దీనినే 'దివాణి లేదా ఖల్సా' ప్రాంతం అంటారు. దాదాపు 1.50 లక్షల ఎకరాలు జాగీర్దారి విధానం కింద ఉండేవి. 10% భూమి నైజాం స్వంత కమతంగా ఉండేది. పోలీసు చర్య తర్వాత సర్ఫేస్‌ఖాన్(జమిందార్ స్వంతభూమి), జాగిర్దారి భూములు రద్దయినాయి. జాగిర్దార్ ప్రాంతాలలో పైగాలు, సంస్థానాలు, ఇజారాదార్లు ఇనాందార్లు, అగ్రహారాలు అనే పేర్లతో వివిధ రకాల ఫ్యూడల్ దోపిడీదారులుండేవారు. వారిలో కొందరు తమకు వచ్చే ఆదాయంలో స్వల్పభాగం సంస్థానానికి చెల్లిస్తుండేవారు. మరికొందరైతే చెల్లించాల్సిన అవసరమే లేదు. ఈ ప్రాంతంలో వివిధ రకాలైన అక్రమ వసూళ్ళు, వెట్టిచాకిరి సర్వసాధారణం" (సుందరయ్య, పి. 1992 : 3). మా భూమి నాటకంలో పై పరిస్థితులకు దర్పణంగా జగన్నాథరెడ్డి, వెంకట్రావ్ పాత్రలు చిత్రితమయ్యాయి. వీరిద్దరు అధిక ఆస్తులు కలిగి తాము లెవీ పన్ను కట్టకుండా ప్రజలచే దాన్ని కట్టించాలని చూస్తారు. ఇది వారిలోని భూస్వామ్య భూర్జువ భావజాలానికి నిదర్శనం. ఈ భూస్వామ్య విధానం వివిధరూపాలలో విస్తరించింది. దీని విశృంఖల రూపం మాభూమి నాటకంలో వివిధ రకాలుగ చిత్రితమైంది.

**2.1. దేశ్‌ముఖ్ సంస్కృతి**

మాభూమి నాటకంలో ప్రధాన పాత్ర జగన్నాథరెడ్డి అతను దేశ్‌ముఖ్. ఈ దేశ్‌ముఖ్ వ్యవస్థ నిజాంకాలంలో ఏర్పడింది. అంతకు పూర్వం ఈ దేశ్‌ముఖ్‌లు లేరు. "దేశ్‌ముఖ్, దేశ్‌పాండేలు నిజాం ప్రభుత్వంలో పన్నులు వసూలు చేసేవారు. నైజాం ప్రభుత్వానికి సాలార్జంగ్ దివానుగా(ముఖ్యమంత్రిగా) ఉండగా సంస్థాన యంత్రాంగంచే తనే ప్రత్యేకంగా పన్నులు వసూలుచేసే పద్ధతిని ప్రవేశపెట్టాడు. అప్పుడు ఈ దేశ్‌ముఖ్‌లకు, దేశ్‌పాండేలకు గతంలో వారు వసూలు చేసిన పన్నుల మొత్తం ప్రాతిపదికపై వతన్‌లు లేదా మాష్(ఉద్యోగ విరమణ అనంతరం ఇచ్చే భృతి)లు మంజూరు చెయ్యబడ్డాయి. ఈ దేశ్‌ముఖ్‌లు, దేశ్‌పాండేలు పన్నులు వసూలు చేసే కాలంలో సాగులో ఉన్న అతిసారవంతమైన భూములను వేలకొద్ది ఎకరాలను కబలించారు. భూములను తమ స్వంత ఆస్తులుగా దఖలు పరుచుకున్నారు. ఈ భూములను సాగుచేస్తున్న రైతులు చిత్తం వచ్చినపుడు తొలగించడానికి వీలుగా కౌలుదారుల స్థాయికి నెట్టబడ్డారు" (సుందరయ్య, పి. 1992 : 4).

**2.2. వెట్టి విధానం**

"వెట్టి అంటే నిర్బంధ చాకిరి. తెలంగాణలో వెట్టివిధానం సమాజం అంతటా వ్యాపించి ఉండేది. ప్రజలలో అన్ని వర్గాల ప్రజలకు తరమతస్థాయిలో అది వర్తించేది. ప్రతి హరిజన కుటుంబం వెట్టిచాకిరి చెయ్యడానికి కుటుంబంలోని ఒక్కరిని కేటాయించేది. చిన్న పల్లెలలో ప్రతి ఇంటినుండి ఒకరిని పంపడం జరిగేది. పటేల్, పట్వారీ, మాలిపటేల్, దేశ్‌ముఖ్ ఇండ్లలో గృహసంబంధమైన పనులు చెయ్యడం, పోలీసు స్టేషన్లకు, తాలుక ఆఫీసులకు రిపోర్టులు మోసుకెళ్ళడం, గ్రామ చావడికి కాపల కాయడం వీరి రోజువారి పనిలో భాగం. ఇవిగాక గ్రామ చావిడికి ఎవరైన అధికారులు వచ్చినపుడు వీరిపని రెట్టింపయ్యేది" (సుందరయ్య, పి. 1992 : 6).

వెట్టి విధానానికి మాభూమి నాటకంలోని మంగలి రాముని పాత్ర చక్కని నిదర్శనం. అతను తానుచేసిన అప్పుకి వడ్డీకింద జగన్నాథరెడ్డివద్ద వెట్టిచాకిరి చేస్తుంటాడు. దివాణాం మొత్తం ఊడ్వడం, జగన్నాథరెడ్డికి వంటచెయ్యడం, అధికారులు వచ్చినపుడు వారికి మర్యాదలు చెయ్యడం అతని రోజు దినచర్యగా ఉండేది. ఈ వెట్టిచాకిరికి జగన్నాథరెడ్డి అతనికేమీ ఇవ్వకపోగా అతనికున్న ఇనామ్ భూమిని కూడా లాక్కుంటాడు. ఈ వెట్టిచాకిరిలోపడి తన కుటుంబాన్ని కూడా పట్టించుకోకుండ రాముడు పనిచేసినా అతనికి ఫలితం ఉండదు. చివరికి విసుగుచెంది రాముడు కూడా వీరారెడ్డి సంఘంలో చేరి జగన్నాథరెడ్డి దగ్గర జరిగే సంగతులను రహస్యంగా వీరారెడ్డికి చేరవేస్తాడు. వీరారెడ్డిని పోలీసులు అరెస్టు చెయ్యగా సాహసంతో అతనిని కాపాడుతాడు.

**రాముడు:** నేను కూడా సంఘం పడదామనుకున్న దొర

**సీత:** ఈ సంగతి దొరకి తెలిస్తే నీ కాస్తి నౌఖరి ఊడిద్ది

**రాముడు:** పోతే పోయింది లేమ్మా నా పీడ వదిలిద్ది. ఈ నౌఖిరి ఉండి మట్టుకు నాకొరిగేదేముంది. పొద్దస్తమానం ఆయన ఇంట్లో అరవచాకిరి తప్ప

**సీత:** అదేం రాముడు అట్లంటావ్

**రాముడు:** ఏముంది తల్లి కోడిగూసినప్పుడనగా లేసి సద్దిదాగి గడికిబోత. ఆ పోయిన పోవడం మళ్ళి నడిజాముకిగాని కొంపకుజేరను. ఇంకా నేను నాకొడుకిని ఎత్తుకునేదెప్పుడమ్మా!

**సీత:** నిజమే పాపం నీవెళ్ళెటప్పటికి లేవడు, మళ్ళి నీవు తిరిగి వచ్చెటప్పటికి నిద్రపోతా ఉంటాడు. అంతేనా?

**రాముడు:** అంతేనమ్మా అంతే"

(మాభూమి :2005 : 40 –41)

**2.3. అక్రమ వసూళ్లు**

నిజాంకాలంలో జాగిర్దార్లు ప్రజలవద్ద నుండి వివిధరూపాలలో అక్రమ వసూళ్లకు పాలుపడేవారు. అందులో ఒక్కోకులంవారు ఒక్కోరకంగా దోపిడికి గురయ్యేవారు.

దేశ్‌ముఖ్, గ్రామాధికారుల ఇండ్లలో బట్టలుతకడం, అంట్లు తోమడం, గ్రామ చావిడిలో మకాంవేసిన అధికారులకు మంచాలు, పరుపులు మోసుకెళ్ళడం వంటి పనులు రజకులు చేసేవారు. మాభూమి నాటకంలో అమీన్ జగన్నాథరెడ్డి ఇంటికి వచ్చిన సందర్భంలో రాముడు పై పనులన్నీ చేస్తాడు.

“భూస్వాముల ఇండ్లలో వేడుక జరిగితే మందనుండి గొర్రెను ఇచ్చితీరాలి. ఏదో ఒక సాకుతో భూస్వాములు ఎప్పుడు కోరితే అప్పుడు గొర్రెనిచ్చితీరాలి” (సుందరయ్య, పి. 1992 : 7). మాభూమి నాటకంలోని యల్లమంద పాత్ర ద్వారా నాటికాలంలోని గొల్లవారిపై జరిగే దోపిడి చిత్రితమైంది. దివాణంలో అధికారులు వచ్చారని మస్తాన్ అతని మందనుండి గొర్రెను ఎత్తుకెళ్ళగా యల్లమంద అతనితో గొడవపడతాడు. అప్పుడు మస్తాన్ అతన్ని కొట్టి గొర్రెను తీసుకెళ్తాడు.

“**యల్లమంద:** పొద్దున్నే లేసి ఓడిమొగం చూసిన్నో కట్టానికి కట్టం దప్పలా నట్టానికి నట్టం దప్పలా

**వీరారెడ్డి:** యేం యల్లమందా ఇంత పొద్దెంకిందాక ఉన్నావేం

**సుబాన్:** ఏముంది ఏదో జరిగి ఉంటుంది

**యల్లమంద:** ఆడెవ్వడో ఈయాల్ల గడికిజచ్చిండంటా


**వీరారెడ్డి:** ఎవడు

**యల్లమంద:** ఆ ఆడుగాడే. ఇంకెవడు జచ్చిండు ఆ పోలీసు అమీనే

**వీరారెడ్డి:** అయితే ఇంకేం వేటపోతుకోసం యల్లమంద మంద మీద వచ్చిపడి ఉంటారు

**యల్లమంద:** వచ్చినాళ్ళు దేన్నో ఒకదాన్ని పట్టకపోతే ఒక ఏడ్పుఏడ్చి ఊరుకుందును. నలుగురెదవ నాయాళ్ళను యెమ్మటేసుకచ్చి (సుబాన్ వైపు తిరిగి) నీయన్న మత్తానయ్య దేవరపోతును పట్టుకెళ్ళాడు గదా! ఎట్టా జావాలి”

(మాభూమి 2005 : 8-9)




**3. మాభూమి నాటక చారిత్రక నేపథ్యం-భూస్వామి, రైతు సంబంధాలు**

“నల్లగొండ జిల్లాలో జరిగిన ప్రజాపోరాటాన్ని గురించి ఈ నాటకం రాయబడింది. ఆ పోరాటంలో 240 గ్రామాలపై పోలీసు దాడులు జరిగాయి. 8500 మంది అరెస్టు అయ్యారు. 15, 390మంది నైజాం ప్రభుత్వ హింసాకాండకు గురయ్యారు. 12 లక్షల 25 వేల విలువగల ఆస్తి లూటీ చేయబడింది. 52మంది వీరులు ప్రాణాలు కోల్పోయారు. నైజాం కిరాతకుల చేతుల్లో 64మంది స్త్రీలపై మానభంగం జరిగింది. వీరిలో ఇద్దరు మరణించారు. ఈ మహోజ్వల పోరాటమే మమ్మల్ని ఈ నాటకం రాయడానికి ప్రోత్సహించింది” (సత్యనారయణ, సుంకర 2005:4) ఇవి మాభూమి నాటకం రాయడానికి ప్రేరేపించిన పరిస్థితుల గురించి రచయితలు పేర్కొన్న వాక్యాలు. ఈ వ్యాక్యాలు నిజాం నిరంకుశ పాలనలో తెలంగాణలో నెలకొన్న పరిస్థితులు మాభూమి నాటక నేపథ్యంగా నిలిచిన విధానాన్ని తెలుపుతున్నాయి.

**3.1. బందగీ- ఇతివృత్తం**

మా భూమి నాటకంలో చిత్రితమైన మొదటి సజీవ సామాజిక చిత్రం బందగీ ఇతివృత్తం. ఈ బందగీ ఒక సాధారణ

వ్యక్తి. అతని జీవితంలో జరిగిన ఒక సంఘటన ప్రజలు అతన్ని అరాధించేలా చేసింది. బందగీ ఒక పేద ముస్లీం రైతు. ఇతనికి, ఇతని అన్నకి భూమి విషయంలో తగాదా వస్తుంది. బందగీ అన్న విసునూరు దేశ్ ముఖ్ రామచంద్రారెడ్డి వద్ద పనిచేస్తుంటాడు. దేశ్ ముఖ్ అండ చూసుకొని బందగీ పొలాన్ని అక్రమంగా లాక్కుంటాడు. బందగీ, అన్నను ఏమీచేయలేక "ఏళ్ళతరబడి విసునూరి దొర రామచంద్రారెడ్డితో పోరాడి కోర్టుకువెళ్ళి తన భూమిని తాను గెల్చుకుంటాడు. ఇది ఓర్వలేని రామచంద్రారెడ్డి పట్టపగలే గూండాలతో బందగీని చంపిస్తాడు. బందగీ మరణం ప్రజలను ఎంతో కలచి వేస్తుంది. అప్పుడు వారు ఆగ్రహాన్ని వెలుబుచ్చలేక దిగమింగాల్సి వచ్చింది. అప్పటి పరిస్థితుల్ని, అతనిమీద తమకున్న సహానుభూతిని కలిపి అతనిమీద పాటలల్లుకున్నారు. ప్రతీ సంవత్సరం బందగీ సమాధి దగ్గర జరిగే ఉర్సు(జాతర్)కి హాజరై పూలమాలలు వేసి తమ గౌరవాన్ని తెలుపు తున్నారు" (తిరుమలరావు జయధీర్ 1988:98). ఇది చారిత్రక సత్యం ఈ చారిత్రక సంఘటన ఆధారంగా మాభూమి నాటకం ఒకటవ భాగం రచించబడింది.

"సబ్జా మొక్కలు, సన్నజాజులు వగైరా రకరకాల పూలమొక్కలతో సమాధి అలంకరించి ఉంటుంది. వీరారెడ్డి, దాదాసాహెబ్, ఒక పక్కన, సుభాన్, రామిరెడ్డి మరోపక్కన నుంచుని ఉంటారు. వీరారెడ్డి భార్య సీతమ్మ, చెల్లెలు కమల సమాధిపై అగరవత్తులు వెలిగిస్తుంటారు''(మాభూమి 2005:01). ఇది బందగీ సమాధి వర్ణన. ఈ వర్ణన అనంతరం బందగీ త్యాగాన్ని కీర్తిస్తూ "భాయీ బందగీ/ నీజీవితమే జీవితము/ భాయీ బందగీ" (మాభూమి 2005:01) అనే పాటను నాటకంలోని పాత్రలు ఉమ్మడిగా కలిసి పాడటం కనిపిస్తుంది. ఆ తరువాతి నాటకంలో సీత, సుభాన్, వీరారెడ్డి, కమల, దాదాసాహెబ్, రామిరెడ్డి మధ్య నడిచిన సంభాషణలో బందగీ పూర్తి ఇతివృత్తం చెప్పబడింది. ఇలా సామాజిక అంశం నాటక ప్రథమాంక వస్తువుగా మారింది.

### 3.2. రైతు సంఘాలు – ప్రత్యేకత

మాభూమి నాటకంలో ప్రస్తావితమైన రెండవ సామాజిక అంశం రైతుసంఘం. బందగీ సమాధి వద్ద గుమిగూడిన సుభాన్, రామిరెడ్డి, దాదాసాహెబ్ మొదలైనవారు వీరారెడ్డి నాయకత్వాన సంఘంగా ఏర్పడదామని నిర్ణయించుకుంటారు.

"**సుభాన్:** యేం దాదా మరి యేమంటావు? మన్నోళ్ళు కూడా సంఘం పెట్టుకుందామా?

**దాదాసాహెబ్:** మీమాటలింటా వుంటే సంఘం బెట్టుకోవడమే మంచిదనిపిస్తా ఉంది. కాని, మనోళ్ళే తలకొక మాట నిర్వాకమై చస్తాందా?

**వీరారెడ్డి:** "మరేం పర్వాలేదు దాదా, మీబోటివాళ్ళు పైనకాస్త ఊతమిస్తే చాలు. ఆ పని అంతా మేమే చేస్తాంగా" (మాభూమి 2005:08).

మాభూమి నాటక రచనాకాలానికి భారతదేశంలోనూ, తెలంగాణ ప్రాంతంలోనూ ప్రత్యేక పరిస్థితులు చోటుచేసుకున్నాయి. అప్పటికే ఆర్థికమాంధ్యం వచ్చింది. "ఇదేకాలంలో 1935 రాజ్యాంగ చట్టం ద్వారా అసెంబ్లీకి ఎన్నికలు ప్రకటించబడ్డాయి. 1936 ఏప్రిల్ లో లక్నో కాంగ్రెసు మహాసభ సందర్భంలోనే అఖిల భారత రైతు సఘం స్థాపించబడింది. 1936 డిసెంబరు ఫైజ్ పూర్ కాంగ్రెస్ మహాసభ సందర్భంలో రైతాంగ సమీకరణ జరిగింది. రైతుల కోర్కెలు ఆమోదించాలన్న డిమాండ్ ఆమోదించబడింది". (కృష్ణారావు వై.వి 1990:135). దీనికి అనుబంధంగా తెలంగాణ ప్రాంతంలో కూడా మార్పులొచ్చాయి. "1938 వ సంవత్సరం ఖమ్మం పట్టణమందు రైతు సదస్సు జరిపి "నిజామాంధ్ర రైతు సంఘం" ఏర్పాటు చేయబడింది. దీనికి చెరకు మిట్ల హనుమయ్య అధ్యక్షులుగా, అమ్మిన మంచి కామయ్య కార్యదర్శిగా, మరో ఎనిమిది మంది సభ్యులు కార్యవర్గంగా ఉన్నారు. సంఘం సభ్యత్వం చేర్పించి అఖిల భారత రైతు సంఘానికి హైదరాబాదు స్టేటు రైతు సంఘాన్ని అనుబంధించి రుసుం చెల్లించబడింది. దీనిని ప్రభుత్వం నిషేధించింది"(కృష్ణారావు వై.వి 1990:137). ఇలా 1930–47 మధ్యకాలంలో ఏర్పడిన రైతు సంఘాలను నిజాం ప్రభుత్వం నిషేధించింది. ప్రజలు మాత్రం చాటుమాటుగా సంఘంగా ఏర్పడి భూస్వాములకు వ్యతిరేకంగా ప్రణాళికలు రచించేవారు. మాభూమి నాటకంలో కూడా వీరారెడ్డి సంఘం ఏర్పరుస్తున్నాడని తెలియగానే దేశ్‌ముఖ్ జగన్నాథరెడ్డి దాన్ని ఎలాగైనా కూకటి వేళ్ళతో సహా పెకిలించివేయాలనుకుంటాడు.

"**జగన్నాథ రెడ్డి:** సంఘం. సంఘమా? నా ఊళ్లో సంఘం బెట్టాడా?

**వెంకట్రావ్:** సంఘం బెట్టడమేమిటి? వాడింటిమీదా ఇవ్వాళ జండా కూడా వెలిసింది.

**జగన్నాథ రెడ్డి:** ఐతే ఇప్పడిదాకా నీవేం జేస్తునావు? ఎందుకు పీకించలా?

**వెంకట్రావ్:** పికించేవాణ్ణి కాని య–కాని ఇదివరకంతటి తేలికకాదు. వ్యవహారం కొంచం బెడిసింది. ఊరంతా ఏకమైంది. కాపు, రెడ్డి, చాకలి, మంగలి, సాహేబులు చివరకు మాల–మాదిగలు కూడా సంఘంలో చేరారనుకోండి.

**జగన్నాథ రెడ్డి:** ఏడ్చారు. గుడ్డికన్ను మూస్తే ఎంతా, తెరిస్తే ఎంతా? రేపీపాటికి ఒక్కోక్కణ్ణి నరికిపారేస్తాను". (మాభూమి 2005:18–19).

### 3.3. ఆంధ్ర మహాసభ

"నిజాం నిరంకుశ పాలనాయుగంలో అంధకార బంధురంగా ఉన్న తెలంగాణలో ఆంధ్రమహాసభ అవతరించింది. గ్రంథాలయాలు, తెలుగు భాషాపునరుద్ధరణతో ప్రారంభమైన ఈ సంస్థ అనతికాలంలోనే తెలంగాణా ప్రజల ఆదరాభిమానాలను చూరగొన్నది. కీర్తిశేషులు మాడపాటి హనుమంతరావు ఉత్తమ వైతాళికులుగా పనిచేశారు. మధ్యయుగాల దోపిడీచీకటిలో ఇదొక ఆశాకిరణంగా ప్రజలకు అనిపించింది. ఈ ఆంధ్రమహాసభ పౌరసత్వాలు మొదలుకొని బంజరు భూములు, వెట్టిచాకిరి, అక్రమ వసూలు, భూమి శిస్తూలాంటి సమస్యలపై తీర్మానాలు చేసింది. క్రమక్రమంగా ఈ సంస్థ 10–12 సంవత్సరాలలోనే ఫ్యూడల్ వ్యతిరేక నిరంకుశపాలన వ్యతిరేక విశాల వేదికగా రూపొందింది. ఆ తరువాత 1945 నుండి బలమైన ప్రజాసంస్థగా పీడిత ప్రజల పదునైన ఆయుధంగా నిర్మించబడి వీరోచిత సాయుధపోరాటాల మహొత్సవాలకు నాయకత్వం వహించింది". (కృష్ణారావు వై.వి. 1990:131). మాభూమి నాటకంలో రైతుసంఘం, ఆంధ్రమహాసభ రెండింటి ప్రస్తావన కనిపిస్తుంది. ఇంకోరకంగా చెప్పాలంటే ఆంధ్రమహాసభలో కొనసాగుతూ రైతుసంఘంగా ఏర్పడిన సంధి వ్యవస్థ మాభూమి నాటకాంలో కనిపిస్తుంది. నాటకం ప్రారంభంలో అందరూ కలిసి సంఘంగా ఏర్పడాలని నిర్ణయించుకున్న తరువాత వీరారెడ్డి బోలో ఆంధ్రమహాసభకీ–జై అంటాడు. అదేవిధంగా నాటకం చివరిలో సీతా, దాదాసాహేబ్, సమాధులవద్ద అందరూ అంజలి ఘటించిన తరువాత ఇంకోసారి ఆంధ్రమహాసభ నినాదాన్ని ఇస్తారు.

"**వీరారెడ్డి:** దున్నేవారిదే భూమిహక్కు.

**అందరూ:** దున్నేవారిదే భూమిహక్కు.

**కమల:** బోలో ఆంధ్ర మహాసభకీ జై.

**అందరూ:** బోలో ఆంధ్ర మహాసభకీ జై".(మాభూమి 2005:79).

### 3.4. భూకబ్జాలు

"నైజాంపాలనలో అధికార్లను కూడగట్టి ప్రభుత్వ భూములను, అటవీ బంజరు భూములను స్వాధీన పరుచుకోవడమేకాక వాటిని కొందరు పట్టాలుగావించుకున్నారు. నిజాం వ్యతిరేక పోరాట రోజుల్లో 200 ఎకరాలను కుటుంబ పోషణకి వదిలి అదనంగా ఉన్న భూముల్ని, ప్రభుత్వ భూముల్ని జాగిర్దార్లు, జమిందార్ల భూముల్ని పంపకంగావించి వారి పశు సంపదను దానంగా పంచడం జరిగింది". (కృష్ణారావు వై.వి. 1990:1). జాగిర్దార్ల భూములను సంపాదించిన విధానం మాభూమి నాటకంలో ప్రస్తావితమైంది. ఈ నాటకంలో జగన్నాథరెడ్డి దేశ్ ముఖ్ మరియు అతిపెద్ద భూస్వామి. అతనికి సాలినా ముప్పై నుండి నలభై వేల ఆదాయం వచ్చే భూమి ఉండేది. నిజాంప్రాంతంలోని రైతుల కష్టాలకు సహానుభూతి తెలుపుదామని వచ్చిన ఆంధ్ర ప్రజానాయకులపై దాడి జరుగుతుంది. అప్పుడు ప్రతాపరెడ్డి అనే ఇంకో భూస్వామి ప్రస్తావన వస్తుంది.

"**రామిరెడ్డి:** కుంపిణి నుండి వాళ్ళనలిక్కడికి ఎందుకొచ్చారు సుభాన్.

**సుభాన్:** మన కష్టాలు తెలుసుకోడానికే

**యల్లమంద:** మన కష్టసుఖాలు తెలుసుకొని కుంపిణిలో వాళ్ళేంజేస్తారు.

**సుభాన్:** కుంపిణీవాళ్ళంటే ఎవరూ? వాళ్ళూ మన తెలుగువారే. మనం కష్టపడుతుంటే మనోళ్ళు చూస్తూ ఊరుకుంటారా? ఇక్కడ జరిగే సంగతులన్నీ చూసి అక్కడికెళ్ళి మనవాళ్ళకందరికీ చెప్పుదామని వచ్చారు.

**దాదాసాహెబ్:** ఇదంతా చేసింది ఆ ప్రతాపరెడ్డేగా?

**కమల:** అవును ఆ దుర్మార్గుడే.

**రామిరెడ్డి:** ఎవడూ ఆ లక్షాముప్పై ఎకరమోడా?

**సుభాన్:** వాడే. వూళ్ళకూళ్ళు లేవగొట్టి తోటేసుకున్నడు.

**యల్లమంద:** తల్లి సిగదరగ తోటంటే తోట. ఒకసారి దారి ప్రయాణంబోతా తోటకీదరిని సద్ది దాగి బయల్దేరితే, మళ్ళీ ఆ దరికెళ్ళేటప్పటికి ఏనుగూకిందంటేనమ్మూ.

**సుభాన్:** వాడి ముల్లేంబోయింది. ఎంతతోటైనా వేస్తాడు. చుట్టుపక్కల ఊళ్ళందరివారిచేత వెట్టి చేయించి.

**కమల:** చేయించిననాళ్ళు చేయించాడు. ఇక ఆ పప్పులేవి ఉడకవు. ఆ ఊళ్ళన్నీ ఇప్పుడు సంఘంలో చేరాయి.

**యల్లమంద:** చేరినయ్. ఇక కూసోని ఏడవమను" (మాభూమి 2005:67–68).

**3.5. అధికపన్నులు – లెవీ వసూళ్లు**

"నిజాం పరిపాలనాకాలంలో ప్రజలపై అధిక పన్నుల భారం పడేది. నిజాంరాజు విధించిన పన్నులే కాక స్థానిక జాగిర్దార్లు ఇంకా అధికమొత్తంలో పన్నులు వసూలు చేసేవారు. ఈ పన్నులు కట్టలేక ప్రజలు తమ ఆస్తులను అమ్ముకునేవారు. నిజాం కాలంలో లెవీపన్ను అమలులో ఉండేది. యుద్ధనిధి పేరుతో ప్రభుత్వం ప్రజలపై మోపిన అదనపు భారమే ఈ లెవీపన్ను. పంటపండినా పండకపోయినా లెవీపన్ను కట్టాల్సిందే. గ్రామాధికార్లు, తహసీల్, రెవెన్యూ శాఖ ఉద్యోగులు లెవీ పేరుతో రైతుల్ని నిలువునా దోచుకునేవారు. రైతులు నల్లబజార్లలో ధాన్యంకొని లెవీ కట్టేవారు. మొదట్లో లెవీగా ఇచ్చిన ధాన్యం ప్రజలకు ప్రభుత్వం తిరిగి పంపిణీ చేస్తుందని భావించారు. ప్రభుత్వం అలాంటి కార్యక్రమం ఏదీ చేయలేదు. పైగా లెవీ పేరుతో అక్రమ వసూళ్ళు ప్రారంభమయ్యాయి. ప్రభుత్వం భూస్వాములు కుమ్మక్కై ఈ వసూళ్ళు చేయించేవారు". (తిరుమలరావు జయధీర్ 1988:91). మాభూమి నాటకం కీలక మలుపు తిరగడానికి లెవీ పన్ను కారణమైంది. గ్రామ ప్రజలను ఏమీ చేయలేని స్థితిలో ఉన్న జగన్నాథరెడ్డి తనవద్ద పట్వారిగా ఉన్న వెంట్రావు సహాయంతో గ్రామప్రజలపై అక్రమంగా లెవీపన్ను వేస్తాడు. వీరారెడ్డితోసహా అందరూ తమకు ధాన్యం పండలేదని తాము లెవీ కట్టలేమని తిరస్కరిస్తారు. అంతగా ప్రభుత్వానికి లెవీ కట్టాలనుంటే ముందు వేల ఎకరాలున్న మీరు కట్టండని అంతా మూకుమ్మడిగా చెప్తారు. ఈ గొడవను మనసులో ఉంచుకొని జగనాథ రెడ్డి వీరారెడ్డి భార్యను, దాదాసాహెబ్ ను చంపిస్తాడు.

**వెంకట్రావ్:** అదేమిటయ్య వీరారెడ్డి చదువుకున్నవాడివి నీవు కూడా అలా మాట్లాడతావ్. ఏది తప్పినా సర్కార్ లెవీ తప్పుతుందా.

**దాదాసాహెబ్:** పండితే ఎందుకియ్యం ఏటా ఇయ్యటం లేదేంటి.

**సుభాన్:** సర్కారు మాత్రం పండందే ఎట్లా వసూలు చెయ్యమంటారు

**వెంకట్రావ్:** ఆ ఖానూన్ గొడవ నీకేం తెలుసునోయ్ కౌలంటే, పాలంటే దొరగారితో పని గనుక ఎదో ఒకవిధంగా జప్పికొన్నాళ్ళు నెట్టుకెళ్తాను. ఇదేం అడ్డగోలుగాదు సర్కారుతో పని.

**వీరారెడ్డి:** ముందు నిరుడు వసూలుచేసిన మా లెవీ డబ్బు మాకివ్వండి ఈ యేటి సంగతి తర్వాత చూద్దాం.

**వెంకట్రావ్:** ఆ డబ్బు ఇన్నాళ్ళుందా ఏమిటి అప్పుడే ఇచ్చాం వార్పండ్‌కి.

**వీరారెడ్డి:** అది మా డబ్బు పంచాయితి దారులెవ్వరు దాన్ని ఖర్చుపెట్టడానికి.

**వెంకట్రావ్:** ఏమ్ అయితే మీరు లెవీ ఇవ్వరన్నమాట

**వీరారెడ్డి:** ముందు ఆరువందలెకరాలున్న మీరు గట్టండి

**వెంకట్రావ్:** మా ఇష్టం కడతాం–కట్టం మీరెవ్వళ్ళురా అడగడానికి

**వీరారెడ్డి:** మాటలు కాస్త జాగ్రత్తగా రాని

**సుబాన్:** ఖబద్దార్

(మాభూమి 2005 : 22–25)

**ముగింపు**

తెలంగాణా రైతాంగ సాయుధ పోరాటంలో పాట ప్రధానపాత్ర పోషించింది. ప్రజలు జమీందార్లకు వ్యతిరేకంగా పాటలు రాసారు. అప్పుడు వెలువడిన పాటలు రైతు "భజనావళి"(1934) అచ్చువేశారు. మాభూమి నాటకంలో కూడా పాటకి ప్రత్యేక స్థానం ఇవ్వబడింది. ఈ నాటకం బందగీ త్యాగాన్ని కీర్తిస్తున్న పాటతో ప్రారంభమౌతుంది. చివరికి దున్నేవారికే భూమి దక్కాలన్న సందేశానిచ్చే పాటతో ముగుస్తుంది. ప్రతీ అంకంలోను సందర్భానుసారంగా పాత్రలు ఆలపించిన పాటలు కనిపిస్తాయి. ఈ పాటల రూపంలో రైతులు మేల్కొనాలన్న సందేశం ఇవ్వబడింది. మొత్తంమీద భూస్వాములకు వ్యతిరేకంగా పోరడటానికి రైతులు చేతబూనిన సాహిత్యాస్త్రంగా మాభూమి నాటకం.

**ఉపయుక్త గ్రంథసూచి :**

1.కృష్ణారావు, వై.వి. 1990: ఆంధ్ర ప్రదేశ్‌లో రైతు ఉద్యమాలు పోరాటాలు: విశాలాంధ్రా, హైదరాబాదు.

2.తిరుమలరావు, జయధీర్ 1988: తెలంగాణా రైతాంగ పోరాటం ప్రజాసాహిత్యం: విశాలాంధ్రా, హైదరాబాదు.

3.రమణ, పి.వి. 1988: తెలుగు సాంఘిక నాటకం: స్వీయ ప్రచురణ.

4.సత్యనారాయణ, సుంకర. 2005: మాభూమి నాటకం: విశాలాంధ్ర, హైదరాబాదు.

5.సుందరయ్య, పుచ్చలపల్లి 1992: వీరతెలంగాణా విప్లవ పోరాటం గుణపాఠాలు: హైదరాబాదు బుక్ ట్రస్టు, హైదరాబాదు.

★ రచయిత: తెలుగు అధ్యాపకులు, టి.ఎస్.డబ్ల్యు.ఆర్.ఎస్. బోధన్

# విమల కథలు ; సామాజికార్థిక విశ్లేషణ

పల్లపు స్వాతి

విప్లవ సాహిత్యోద్యమంలో విమలది చెరగని ముద్ర. విప్లవ కవిత్వం, స్త్రీవాద కవిత్వం రెండిట్లోనూ సరికొత్త డిక్షన్ ప్రవేశపెట్టింది. మార్క్సిస్టు దృక్పథంతో కథలు, కవిత్వం అల్లుతున్నది. ఆమె అక్షరాల నిండా ఓపలేని దు:ఖం, ఆగ్రహం, తండ్లాట. సమాజ కట్టుబాట్లలో బందీగా మారి విలపిస్తున్న స్త్రీల వేదనలు. ధ్వంసమవుతున్న బతుకులు. కూలిన బతుకు శిథిలాల్లోంచే పచ్చని మొలకలా నవ్వే మనుషులు. నూరు పూలు వికసించేలా. వేల ఆలోచనలు సంఘర్షించేలా.

ఆమె తండ్రి అమరారెడ్డి తెలంగాణ సాయుధ పోరాటంలో పాల్గొన్నాడు. అమ్మా నాన్న అందరూ సాహిత్యం బాగా చదువుకున్నవాళ్లే. ఇంటికి 'సోవియట్ ల్యాండ్' పత్రిక, పుస్తకాలొచ్చేవి. ఆమె ఈ పుస్తకాలతో ప్రభావితమైంది. పదో తరగతి(1974)లో ఉన్నపుడే 'నవోదయ'(సాహిత్య, సాంస్కృతిక సంస్థ), డి.ఎస్.ఓ.(డెమోక్రటిక్ స్టూడెంట్స్ ఆర్గనైజేషన్) సంస్థలతో పరిచయమైంది. ఎమర్జెన్సీ అనంతర కాలంలో పి.డి.ఎస్.యు.(ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం), పి.ఓ.డబ్ల్యూ.(ప్రగతిశీల మహిళా సంఘం) సంఘాలు పరిచయమయ్యాయి. 1976-77నుంచి మహిళా సంఘాల్లో పనిచేసింది. 1980లో డిగ్రీ పరీక్షలు రాసి, ఫలితాలు చూసుకోకుండానే విప్లవోద్యమంలోకి పూర్తికాలం కార్యకర్తగా వెళ్లింది. పార్టీ నిర్ణయం మేరకు కొంతకాలం ఖమ్మం జిల్లా కొత్తగూడెంలో పనిచేసింది.

విమలది మార్క్సిస్టు దృక్పథం. "విమల ఉద్యమంలోంచే కవిత్వంలోకొచ్చింది. ఉద్యమంలో వుంటూ కవిత్వంలోకొచ్చింది. ఉద్యమ అనివార్య అవసరంగా కవిత్వంలోకి వచ్చింది. తెలుగు పాఠకులకు ఆమె అడవి కవిత్వం ద్వారా పరిచయమయింది". (అడవి ఉప్పొంగిన రాత్రి; 1990, పు.3)

'తెగబడిన మా కలల ప్రపంచం', 'వంటిల్లు', 'సౌందర్యాత్మక హింస', 'వేశ్యా శిశువు' కవితలు స్త్రీల సమస్యలను మార్క్సిస్టు దృక్పథంతో ఎట్లా అర్థం చేసుకోవచ్చో చెప్పింది. మహిళా విముక్తి ఉద్యమాలు ప్రజా విముక్తి ఉద్యమాల్లో ఎట్లా అంతర్భాగమో అవగాహన కల్గించాయి. రెండో కవితా సంకలనం 'మృగన'. విమల విప్లవోద్యమం నుంచి బయటకు వచ్చాక తెచ్చిన కవితా సంకలనం ఇది. విప్లవోద్యమంలో పనిచేస్తున్నప్పుడే 'చేదుపాట' కవిత రాసింది. ఈ కవిత నేపథ్యం గురించి... "పార్టీలో మహిళలమీద కూడా పితృస్వామిక అణచివేత ఉంటుంది. మహిళలు అసమానతకు గురవుతారు. లైంగిక వేధింపులకు కూడా గురవుతారు. వాటిని ఎదుర్కోవాలి" అని చెప్పింది. (విమల కథల్లో సామాజికార్థిక విశ్లేషణ; పు.125).

విమల 1979 నాటికే విప్లవ రచయితల సంఘంలో సభ్యురాలు. విరసం సిటీ (హైదరాబాద్, సికింద్రాబాద్) యూనిట్ కన్వీనర్‌గా, కార్యవర్గ సభ్యురాలిగా పనిచేసింది. కొంతకాలం విరసం ఉపాధ్యక్షురాలిగా ఉన్నది. జనవరి 1990లో మొదటి కవితా సంకలనం 'అడవి ఉప్పొంగిన రాత్రి' ప్రచురితమైంది. ఇందులో 1980-1988 మధ్యకాలంలో రాసిన కవిత్వం ఉన్నది. విమల సి.పి.ఐ.(ఎం.ఎల్.) చంద్ర పుల్లారెడ్డి వర్గంలో క్రియాశీలకంగా పనిచేసింది. ఆ పార్టీ పత్రిక 'విమోచన'. 1984-1991 దాకా ఆ పత్రికకు వర్కింగ్ ఎడిటర్‌గా బాధ్యతలు నిర్వహించింది.

## కథా రచయితగా విమల

విమల, కవిత్వంతో చైతన్యమై విప్లవ సాహిత్యోద్యమంలో చేరింది. 1979 నుంచే కథలు రాస్తున్నది. 'నూతన' పత్రిక(1979, జనవరి)లో 'విలువలు' అనే కథ ప్రచురితమైంది. విప్లవోద్యమంలోకి వెళ్లాక కథలు రాయడం ఆపేసింది. బయటకు వచ్చాక చాలా ఏళ్ల తర్వాత 2011లో మొదటి కథ 'నల్లపిల్ల నవ్వు' రాసింది. తర్వాత 'కొన్ని నక్షత్రాలు కాసిన్ని కన్నీళ్లు' (2012), 'దేహభాష' (2012), 'వదిలేయ్' (2013), 'సావిత్రి' (2014), 'మా అమ్మా ఆమె దోస్త్ మల్లి' (2013), 'దౌత్య' (2013), 'కనకలత' (2012), 'చుక్కల క్రింది రాత్రి' (2015), 'మార్తా ప్రేమ కథ' (2013), 'వాళ్లు ముగ్గురేనా?' (2014), 'నీలా వాళ్లమ్మ మరికొందరు' (2013), 'సూర్యుడి మొదటి కిరణం' (2013) అనే కథలు రాసింది. ఈ కథలన్నీ కలిపి 'చినుకు పబ్లికేషన్స్' 2016లో 'కొన్ని నక్షత్రాలు కాసిన్ని కన్నీళ్లు' పేరుతో కథా సంకలనం ప్రచురించింది. ఇందులో 13 కథలున్నాయి. వస్తువు, దృక్పథం, శైలి, కథా కథనం, వస్తుశిల్పాలతో వచ్చిన అద్భుతమైన కథలివి. ఈ కథల నిండా విప్లవోద్యమ నేపథ్యం, సామాజిక దృక్పథం ఉన్నది.

## విమల కథల పరిచయం :

విమల కథల నిండా... స్త్రీల జీవితంలోని అనంతమైన వేదన. బాధామయ గాథలు. స్త్రీల హృదయాల్లోని నిరంతర రక్తస్రావం. నిరాశామయమైన జీవితం. వెలుగుదారుల కోసం అనంతమైన వెతుకులాట. నిరీక్షణ. ప్రేమలో మోసపోయిన స్త్రీలు. ప్రేమను కోల్పోయిన స్త్రీలు. పితృస్వామ్య అణచివేతల్లో తల్లడిల్లే హృదయాలు కన్పిస్తాయి. ఇందులో ఐదు కథలు విప్లవోద్యమంలోని స్త్రీపురుష సంబంధాల్లోని వెలుగు నీడల్ని చిత్రించాయి. మరో ఐదు కథల్లో (నల్లపిల్ల నవ్వు, నీలావాళ్లమ్మ మరికొందరు, దౌత్య, వాళ్లు ముగ్గురేనా?, చుక్కల క్రింది రాత్రి) మగవాళ్ల మోసానికి గురైన స్త్రీలు తమ జీవితాన్ని కొనసాగిస్తున్న తీరును పరిచయం చేస్తాయి. కథల్లో బతకడమే ఓ యుద్ధంగా బతుకుతున్న లక్షలాది మంది స్త్రీలు కన్పిస్తారు. విమల కథల్ని క్లుప్తంగా తెలుసుకుందాం.

## విమల కథల్లో సామాజికార్థిక విశ్లేషణ

విమల కథల నిండా స్త్రీల వ్యథార్థ జీవిత యథార్థ గాథలు. వివక్ష. ఇంటా బయటా. సంఘర్షణలు. పితృస్వామ్యం చేతుల్లో నలుగుతున్న స్త్రీలు. బతుకు పోరాటంలో అలసిన స్త్రీలు. ప్రేమరాహిత్యంతో తల్లడిల్లే స్త్రీలు. సొంత వ్యక్తిత్వాన్ని నిలుపుకొనేందుకు సాగిపోయిన స్త్రీలు. ఇట్లా మనచుట్టూ ఉన్న ఎందరెందరో స్త్రీల జీవితాలను ఇతివృత్తంగా తీసుకొని కథలు రాశారు విమల. ఈ కథల్లోని మనుషులంతా మనకు ఎక్కడో ఓ చోట తారసపడతారు.

"మానవుల చైతన్యం వారి ఉనికిని నిర్ణయించదు. వారి సాంఘిక అస్తిత్వమే వారి చైతన్యాన్ని నిర్ణయిస్తుంది" అన్నాడు మార్క్స్. ఆర్థిక పునాదిలో వచ్చిన మార్పులు వెంటనే గానీ, తర్వాత గానీ మొత్తం బ్రహ్మాండమైన ఉపరితల నిర్మాణంలో మార్పుకి కారణమవుతాయి" అన్నాడు మార్క్స్. (ఓల్గా, కుటుంబ వ్యవస్థ మార్క్సిజం–ఫెమినిజం; 2004, పు.20)

మనిషి చైతన్యాన్ని తన అస్తిత్వమే నిర్ణయిస్తుంది. ఆ అస్తిత్వానికి సామాజికార్థిక పునాది ఉంటుంది. ఇట్లా అర్థంచేసుకుంటే విమల కథల్లోని సామాజికార్థిక అంశాలు తెలుస్తాయి.

### 1. నల్లపిల్ల నవ్వు :

ఈ కథలో నల్లపిల్లది తమిళనాడు. నిరుపేద కుటుంబం. చిన్నప్పుడే తల్లి చనిపోయింది. తండ్రి సంరక్షణలో పెరిగింది. అతడు సినిమాల్లో స్టంట్ మాస్టర్. పదో తరగతి దాకా చదివింది. అప్పుడే ఆమెకు సుబ్రహ్మణ్యం పరిచయమయ్యాడు. ఆమెను ఇష్టపడ్డాడు. ఆమె కంటే తొమ్మిదేళ్లు పెద్దవాడు. ఈ పెళ్లికి పెద్దలు ఒప్పుకోరని తెలిసి, ఇంట్లోంచి పారిపోయి పెళ్లి చేసుకున్నారు. ఇద్దరు పిల్లలు పుట్టాక సుబ్రహ్మణ్యం ప్రవర్తనలో మార్పు వచ్చింది. మధురిమ ఇంట్లో వాళ్లనూ, ఆమె కులాన్ని తక్కువ చేసి మాట్లాడటం మొదలుపెట్టాడు. ఆమెతో ఎక్కువగా మాట్లాడేవాడు కాదు. ఇంతలో రెండోసారి ఆమె గర్భవతయింది. తనకు హైదరాబాద్‌లో ఉద్యోగం వచ్చిందని ఆమెను బెంగుళూర్‌లోనే వదిలివెళ్లాడు. ఇల్లు దొరికాక తీసుకువెళ్తానని చెప్పివెళ్లాడు. కానీ, ఎన్నిసార్లు ఫోన్‌చేసినా స్పందన లేదు. అతని స్నేహితుల్ని అడిగితే తెలియదని చెప్పేవాళ్లు. ఆమెకు ఏం చేయాలో అర్థం కాలేదు. ఇంట్లో కూర్చొని ఒక్కతే దిగులుగా ఏడ్చేది. చివరికి ఓ రోజు ఫోన్‌చేసి, తనకింకా ఉద్యోగం దొరకలేదనీ, ఇల్లు ఖాళీచేసి పిల్లల్ని తీసుకుని పుట్టింటికి వెళ్లమని చెప్పాడు. అప్పటికి ఏడో నెల గర్భిణి. ఇల్లు ఖాళీచేసి విల్లుపురంలోని తన అక్క ఇంటికి వెళ్లింది. తన తండ్రి చాలా బాధపడ్డాడు. సుబ్రహ్మణ్యం నుంచి మళ్లీ ఫోన్‌లేదు. మగపిల్లవాడు పుట్టాడు.

అప్పటికి ఆమె వయసు ఇరవై ఏళ్లు. మద్రాసులో అతని ఇల్లు ఎక్కడని వెతకాలి!. తన తండ్రి, అక్కా, బావ, పిల్లలతో కలిసి అడ్రస్ వెతుక్కుంటూ అతని ఇంటికి వెళ్లింది. అతని తల్లిదండ్రులు ఆమెను తిట్టారు. ఇక్కడి నుంచి వెళ్లిపోవాలంటూ బెదిరించారు. వెళ్లకపోతే పోలీసుల్ని పిలుస్తామని భయపెట్టి వెళ్లగొట్టారు. దిక్కుతోచలేదామెకు. పిల్లల్ని తీసుకొని తండ్రి ఇంటికి వచ్చింది.

ఇద్దరు చిన్నపిల్లల్ని ఎలా పెంచుకోవాలో తెలియని స్థితి. ఏవేవో చిన్నచిన్న పనులు చేసేది. ఇళ్లల్లో గిన్నెలు తోమే పనులూ చేసింది. అప్పుడే తన తండ్రి స్నేహితులు 'సినిమాల్లో చేస్తావా?' అని అడిగారు. అప్పా స్నేహితుడు రాందాస్ మామతో కలిసి హైదరాబాద్ వెళ్లింది. రాందాస్ బంధువుల ఇంట్లో చిన్న గదిలో ఉండేది. సినిమా వాళ్లంటే ఎవరికైనా అలుసే కదా! అట్లా ఆమె ఒంటరి జీవితంలో అనేక అవమానాలు అనుభవించింది. వివక్షల్ని ఎదుర్కొన్నది. ఇద్దరు పిల్లల్నీ, అప్పాను పోషించుకోవాలంటే ఎన్ని కష్టాలైనా ఎదుర్కోవాలనుకున్నది. సినిమాల్లో చిన్న చిన్న వేశాలు వచ్చేవి. అప్పుడప్పుడూ తండ్రినీ పిల్లల్నీ చూడటానికి ఇంటికి వెళ్లేది. కొంతకాలమయ్యాక హైదరాబాద్‌లోనే శ్రీను పరిచయమయ్యాడు. ఇద్దరూ ఒకే రూమ్‌లో కలిసి వున్నారు. అతనూ సినిమాల్లో ఎక్స్‌ట్రా వేషాలు వేస్తాడు. అప్పుడప్పుడూ తాగేవాడు. ఒక్కోసారి ఆమె కూడా తాగేది. ఈ మహానగరంలో, రంగుల లోకంలో ఆమె దిగులు కళ్లతో తిరిగేది. సినిమాల్లో ఒక్కోసారి అవకాశాలు రాక ఇబ్బందిపడేది. తన జీవితం తనను శాంతంగా ఉండనివ్వలేదు. కన్న ఊరినీ, అయినవాళ్ల నుంచి తరిమేసింది. ఎక్కడో

విసిరేసింది. పిల్లలు ఒకచోట. తానొకచోట. ఒంటరి మహిళల జీవితంలో ఎన్ని కల్లోలాలు జరుగుతాయో చెప్పిన కథ ఇది. ఈ కథలో కింది విషయాలు గమనించవచ్చు.

**కుల వివక్ష :**

ఆమెది దిగువ మధ్యతరగతి కుటుంబం. చిన్నప్పుడే ఒకతణ్ని ప్రేమించి పెళ్లి చేసుకుంది. పెళ్లయిన కొంత కాలానికే భర్త నుంచి కులం పేరుతో వివక్ష ఎదుర్కొన్నది. కూతురు పుట్టాక భర్త ఆమెను వదిలివెళ్లాడు. కారణం, కులం. ఆమెది అతనికంటే దిగువ కులం. భర్తను వెతుక్కుంటూ ఇంటికి వెళ్తే, అతని తల్లిదండ్రులు ఆమెను అవమానించారు. బెదిరించారు. దిక్కుతోచక ఇద్దరు పసివాళ్లను తీసుకొని అక్కడి నుంచి వెళ్లిపోయింది. ప్రేమించినపుడు, పెళ్లిచేసుకుని ఇద్దరు పిల్లలకు తండ్రిగా మారినపుడు అడ్డురాని కులం, కలిసి బతికేందుకు అడ్డువచ్చిందా అని ఆమె మౌనంగా ఏడ్చింది.

**ఒంటరి మహిళగా వివక్ష :**

హైదరాబాద్‌లో సినిమాల కోసం ప్రయత్నిస్తున్నపుడు ఎన్నోసార్లు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నది. ఒంటరి మహిళలపై సమాజానికి ఎప్పటికీ చిన్నచూపే. అట్లా అనేకమంది మగ వాళ్లు ఆమెను లోబరుచుకోవాలని చూశారు. ఒంటరి జీవితం ఆమెను వెంటాడింది. అయినా అదరలేదు. బెదరలేదు. ఎంత తెగువగా ఉన్నా ఒక్కోసారి రాజీపడింది.

సినిమాల్లో పనిచేస్తున్నా ఎప్పుడూ పిల్లలు, తండ్రీ గుర్తొచ్చి కులిమి ఏడ్చేది. చెప్పుకోవడానికి ఎవరూ లేక తన బాధనంతా డైరీలో రాసుకునేది.

ఒక పదహారేళ్ల పిల్ల పెళ్లి పేరుతో వంచనకు గురైంది. ఇద్దరు పసికూనలతో ఎట్లా బతకాలో తెలియని స్థితి. పిల్లల్నీ తండ్రినీ పోషించుకునేందుకు ఎడారి లాంటి సినిమా లోకంలోకి వెళ్లింది. అక్కడ అడుగడుగునా పొంచి వున్న మగ తోడేళ్ల నుంచి లైంగిక దాడుల్ని ఎదుర్కొన్నది. ఒంటరి జీవితం ఆమెలో ధైర్యం నింపింది. కష్టాల కడలిలో ఎదురీదడం నేర్పింది.

మహిళలను పితృస్వామ్య వ్యవస్థ ఎన్ని రకాలుగా అణచివేస్తుందో చెప్పిన కథ ఇది. ఎన్ని కష్టాలు ఎదురైనా తలవంచక ఎదురు నిలిచి పోరాడాలని చెప్పిన కథ.

**2. కొన్ని నక్షత్రాలు కాసిన్ని కన్నీళ్లు :**

ఇది విప్లవోద్యమంలోకి వచ్చిన నవయువకుడి ప్రేమ కథ. ఉత్తమ పురుషలో సాగిన కథ ఇది. స్త్రీ జ్ఞాపకాల నుండి శకలాలు శకలాలుగా మొదలవుతుంది. ఆమెకు ఓ యువకుడు పరిచయమయ్యాడు. అతడు పోలీసుల కాల్పుల్లో చనిపోయాడు. అతణ్ని ప్రేమించిన అమ్మాయి బాధను పంచుకోవడానికి తన దగ్గరికి వచ్చింది. ఈ యువకుడి జ్ఞాపకాలను పంచుకున్నది. ఆగక పారే కన్నీళ్లతోనే వెనుదిరిగి వెళ్లింది. ఇదంతా గతం.

చాలా ఏళ్ల తర్వాత ఈ కథ చెప్పే మహిళ ఓ పెళ్లికి వెళ్లింది. అక్కడ ఓ స్త్రీ ఈమెను గుర్తుపట్టి మాట్లాడింది. ఆనాటి ప్రేమ తాలూకు జ్ఞాపకాన్ని తన చేతి మణికట్టుపై పచ్చబొట్టు వేయించుకుంది. ఆ ప్రేమను, జ్ఞాపకాలను కన్నీళ్ల మధ్యే దాచుకుంది. వేరే అతనితో పెళ్లయింది. సగటు మహిళగా సంసారం జీవనం సాగిస్తున్న సంగతి తెలియడం ఈ కథకు ముగింపు. రాలిన నక్షత్రాల కోసం కన్నీళ్లు, ఆశలు సఫలం కాని ఆడవాళ్ల అస్వతంత్ర జీవితం కోసం కన్నీళ్లు ఈ కథలో కలిసి ప్రవహిస్తాయి.

**సామాజిక మార్పు కోసం :**

ఈ కథలో కొందరు నవయువకులు సామాజిక మార్పు కోసం విప్లవోద్యమంలోకి వెళ్లారు. ప్రజల్ని చైతన్యం చేశారు. పోరాటాల్లోకి కదిలించారు. గ్రామాలన్నీ దోపిడీ, పీడనపై తిరుగుబాటు చేశాయి. ఈ చైతన్యం వెనక విప్లవోద్యమం ఉన్నది.

**రాజ్యహింస :**

విప్లవోద్యమంలో పనిచేస్తున్న మాధవ, తిరుపతితో పాటు మరో నలుగురు యువకుల్ని పోలీసులు వేటాడి కాల్చిచంపారు. అంతకు ముందే తిరుపతికి పెళ్లయింది. ఈ మధ్యే కాన్పయింది. మూడు నెలల బాబు కూడా ఉన్నాడు. నిరుపేద జీవితం. అతని భార్య బీడీలుచుట్టే పనిచేస్తున్నది.

ఓ రోజు ఆ నలుగురు యువకుల్ని రామ్మడుగు దగ్గర తిమ్మన్నపల్లి గుట్టల్లో పోలీసులు కాల్చిచంపారు. అదే రాత్రి ఎవరికీ తెలియకుండా పోలీసులు శవాలను సిరిసిల్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అదే రోజు చీకట్లు కమ్ముతుండగా మానేటి ఒడ్డున మామిడి తోటల పక్కన చితిపేర్చి దహనం చేశారు. సమ సమాజం కోసం వేనవేల ఆశలతో సాగిపోయిన ఆ యువకులు మంటల్లో కాలిపోయారు. వాళ్ల స్వప్నాలు, ఆశయాలు కాలి బూడిదయ్యాయి.

ఈ కథలో ఇద్దరు మహిళల దు:ఖమయ జీవితం ఉన్నది. మాధవను ప్రేమించిన జ్యోతి అతని జ్ఞాపకాల్లో బతుకుతోంది. చేతిపై అతని జ్ఞాపకాన్ని వెలిగే దీపంగా పచ్చబొట్టు వేయించుకుంది. అనివార్యంగా ఇంకొకరితో పెళ్లయింది. కానీ, మాధవ జ్ఞాపకాలు మాత్రం ఆమెను వీడలేదు. మరో మహిళ–తిరుపతి భార్య. మూడు నెలల పసికందుతో మిగిలిన మహిళ. పెళ్లయి ఏడాదిలోపే రాజ్యం చేతుల్లో బలయిన

తిరుపతి భార్య. ఈ ఇద్దరు మహిళల గుండె గాయాలను ఏ కాలమూ మాన్పలేదు.

## 3. దేహభాష :

ఈ కథలో కథా నాయిక మాధవి. నలభై ఏళ్ల స్త్రీ. ఓ కాలేజీలో లెక్చరర్‌గా పనిచేస్తోంది. అర్ధరాత్రుల్లో అపరిచితుల నుంచి ఆమెకు ఫోన్ వచ్చేది. ఆ ఫోన్ సంభాషణంతా అటు వైపు నుంచి బూతు మాటలే. 'నీ తల్లిలాంటి దాన్ని' అని చెప్పినా విడవకుండా అవే బూతులు. క్లాసులో పాఠం చెప్తున్నపుడు కూడా అనేక ఫోన్‌లు వచ్చేవి. ఆ జుగుప్సాకరమైన మాటలు వినలేక మానసికంగా అలసిపోయింది. ఎక్కడ విన్నా ఆడవాళ్ల శరీరాలను వర్ణించే బూతు మాటలే విన్పిస్తున్నాయి.

## పితృస్వామ్య వివక్ష :

కాలేజీలో మగ కొలీగ్స్ మధ్య కూడా అలాంటి మాటలే విన్నది. అవి ద్వంద్వార్థపు మాటలు. భర్త చనిపోయాక ఆమె అందరికీ లోకువైపోయింది. ప్రశాంతత కోసం ట్యాంక్‌బండ్‌కు వెళ్లింది. వెన్నెలను ఆస్వాదిస్తూ అక్కడే కూర్చుంది. ఒక్కసారిగా ఆమె వెనక నుంచి మెడమీదుగా పాకిందో చేయి. అది మగవాడి చెయ్యి. 'వస్తావా?' అని అడిగాడు. 'ఎక్కడికి?' అన్నది. 'ఎక్కడికైనా సరే' అన్నాడు. వాడో బూతు మాట మాట్లాడాక అర్థమైంది, వాడి మాటల అంతరార్థం. వెంటనే అక్కడి నుంచి వెళ్లిపోయింది. ఇట్లా అనేక చోట్ల అనేక అవమానాలు ఎదుర్కొన్నది. సమాజం ఒంటరి మహిళలను చులకనగా చూసే దుర్మార్గంలోకి దిగజారిపోయింది. వాళ్లను మాటలతో, చూపులతో, చేతలతో హింసించకుండా నిద్రపోదు, ఈ సమాజం.

## కుల వివక్ష :

మాధవి ఆంధ్రా యూనివర్సిటీలో చదివింది. ఎం.ఏ.చదివే రోజుల్లో దయాసాగర్ అనే దళిత క్రిస్టియన్ పరిచయమయ్యాడు. వాళ్లిద్దరూ ప్రేమించుకున్నారు. ఓరోజు దయాసాగర్ మాధవి ఇంటికి వచ్చాడు. ఆమె తండ్రితో మాట్లాడాడు. మాధవిని పెళ్లి చేసుకుంటానని అడిగాడు. మాధవి తండ్రి అతణ్నీ, అతని కులాన్నీ బూతులు తిట్టాడు. అడ్డుకోబోయిన మాధవిని చెంపలు పగలగొట్టాడు తండ్రి. జుట్టుపట్టుకొని ఈడ్చుకెళ్లాడు. కొన్నాళ్లకి దయాసాగర్‌ను కలిసింది మాధవి. తనను మర్చిపొమ్మనీ, తల్లిదండ్రుల్ని ఎదిరించలేననీ కన్నీళ్లు పెట్టుకుంది. "మీ కులాల వాళ్లు మాట్లాడే బూతుల్ని, అవమానాల్ని, వంచనలనీ తొక్కుకుంటూ మేం ముందుకు పోతున్నాం. ఆ గుంపు నుంచి విడివడ్డదానివనుకొని పొరపడ్డాను నేనే" అన్నాడు, దయాసాగర్. ఆ గుంపులో తననూ కలిపినందుకు బాధపడింది మాధవి. ఆ తర్వాత అతనెప్పుడూ జీవితంలో ఎదురుకాలేదు.

తర్వాత హైదరాబాద్ వెళ్లింది. ఉస్మానియా యూనివర్సిటీలో చదివింది. ఉద్యోగం వచ్చింది. తన కులం వాడినే పెళ్లిచేసుకుంది. అట్లా మాధవి ప్రేమను కులం అనే అడ్డుగోడ అడ్డుకుంది. సామాజిక అంతరాల ఆధిపత్యం అడ్డుకుంది. తరతరాలుగా విస్తరిస్తున్న కులాధిపత్యం ఆమె ప్రేమను ఒప్పుకోలేదు. మానసికంగా, శారీరకంగా దాడులు చేసింది. కులం తననూ, తనను ప్రేమించిన దయాసాగర్‌నూ అవమానించింది. ఈ కుల వివక్ష వెనక వేల ఏళ్ల పితృస్వామ్య అణచివేత ఉన్నది. ఆధిపత్యం ఉన్నది. ఇట్లా ఒక్క మాధవి మాత్రమే కాదు. మనచుట్టూ లక్షలాది మంది మాధవిలు ప్రేమించిన మననుషులతో బతుకును పంచుకోలేని దుస్థితి ఉన్నది. దీనంతటికీ కారణం కులం, మతం, ప్రాంతం, సామాజిక అంతరాలు, ఆర్థిక అంతరాలు. అంతరాల సమాజంలో ఎన్నెన్ని వికసిత ప్రేమలు అంతర్ధానమయ్యాయో.

## 4. సావిత్రి :

విప్లవోద్యమ కేంద్రంగా సాగిన కథ ఇది. జీవితంపై ఎన్నెన్నో కలలతో ప్రేమించి పెళ్లిచేసుకొని చివరికి ఒంటరిగా మిగిలిన ఓ మహిళ కథ. తన సహచరుడు విప్లవోద్యమ నిర్మాణంలో ఉన్నాడు. ఆమె బయట ఒంటరిగా ఇద్దరు పిల్లలతో కలిసి బతకాల్సి వచ్చినపుడు పడిన వేదన. తనపట్ల, పిల్లల పట్ల ఎలాంటి బాధ్యత చూపని భర్తపై పెరిగిన విముఖత సావిత్రి కథాంశం.

సావిత్రి పదిహేడేళ్ల వయసు నుంచే ఎన్నో కష్టాలను ఎదుర్కొన్నది. ఆమె జీవితం ఊహించని మలుపులు తిరిగింది. విప్లవోద్యమంలో అంతర్లీనంగా ఉన్న పితృస్వామ్యాన్ని చర్చకు పెట్టిన కథ ఇది. స్త్రీ, పురుష సంబంధాల విషయంలో విప్లవోద్యమం ఎట్లాంటి వైఖరితో ఉన్నదో చెప్పిన కథ. సహచరుడు తోడులేకపోయినా, ఇద్దరు పిల్లలతో కన్నీటి నదిని దాటిన సావిత్రి కథ ఇది.

ఈ కథ విశాఖపట్నంలో మొదలై విజయనగరం, సీతమ్మధార, అమలాపురం, హైదరాబాద్‌లోని చిక్కడపల్లి, పాతబస్తీ; నల్లగొండ జిల్లాలోని మిర్యాలగూడ మీదుగా మళ్లీ హైదరాబాద్‌లో ముగిసింది.

అది శ్రీకాకుళ గిరిజన రైతాంగ సాయుధ పోరాట కాలం. ఆ ఉద్యమంపై అమలవుతున్న హింసాకాండలతో సమాజం అతలాకుతలం అవుతున్న కాలం. అట్లాంటి కాలమే ప్రకాశరావునూ కదిలించింది. ఆలోచింపజేసింది. అతనికి ఆ ఉద్యమాలతో సంబంధాలున్న కొందరు విద్యార్థులు పరిచయమయ్యారు. వాళ్లిచ్చే విప్లవ సాహిత్యాన్ని ఇష్టంగా చదివాడు. దీంతో అతనికి కొత్త ప్రపంచానికి దారులు

కన్పించాయి. అతని మిత్రులు కొందరు అర్ధాంతరంగా చదువులు వదిలేసి, విప్లవోద్యమంలో పూర్తికాలం కార్యకర్తలుగా వెళ్లిపోయారు. అతను ఉద్యమంలోకి వెళ్లిపోవాలనుకున్నాడు. కానీ, కుటుంబ అవసరాల కోసం ఎంఏ చదువును మధ్యలోనే ఆపేసి, టెలిఫోన్ శాఖలో ఉద్యోగంలో చేరాడు.

సావిత్రిది విజయనగరం దగ్గర ఓ పల్లెటూరు. వాళ్లకు రెండెకరాల పొలం ఉన్నది. ఆరుగురు కుటుంబ సభ్యులు దీంతో ఆదాయం సరిపోకపోయేది. సావిత్రి పదో తరగతికే చదువు మానేసింది. తల్లితో కలిసి జీడిపిక్కల కంపెనీలో పనికి వెళ్లేది. "మల్లెపూవులా యవ్వనం కమ్ముకున్న సావిత్రికి అందమైన కలలుండేవి. వంటినిండా మెరుపులుండేవి. ఏదో తెలియని ఆనందపు కిలకిలలుండేవి. అట్లాంటి పదిహేడేళ్ల సావిత్రికి, ప్రకాశరావు పరిచయమయ్యాడు" (కొన్ని నక్షత్రాలు కాసిన్ని కన్నీళ్లు; 2016, పు.68)

ఓ రోజు సావిత్రికి వసరుసకి బాబాయి అయ్యే పుల్లయ్య ఇంటికి సమావేశం పెట్టుకొనేందుకు తన మిత్రులతో కలిసి వచ్చాడు ప్రకాశరావు. వాళ్లిద్దరికీ అక్కడే పరిచయం. ఒకరినొకరు ఇష్టపడ్డారు. ఏడాది తర్వాత ఆ పరిచయం ప్రేమగా మారింది. 'నన్ను పెళ్లి చేసుకోవడం నీకిష్టమేనా?' అని అడిగాడు. ఆమె 'ఇష్టమే' అన్నది. సావిత్రి ఇంట్లో వాళ్లకు ఈ పెళ్లి ఏమాత్రం ఇష్టంలేదు. అబ్బాయి బాగా చదువుకున్నవాడే అయినా, బతుకుతాడో, చస్తాడో తెలియని రాజకీయాల్లో ఉన్నవాడు. అందుకే వాళ్లు ఒప్పుకోలేదు. ఆమెను కట్టడి చేశారు. ఓ చీకటి రాత్రి 'ఊరవతల ఎదురుచూడు. మోటార్ సైకిల్‌పై వచ్చి, తీసుకెడతాను' అని ప్రకాశరావు అన్నమాట నమ్మింది. కట్టుబట్టలతో ఇంట్లోంచి బయటకు వచ్చింది. కానీ, అతడు రాలేదు. అతని స్నేహితుడు రషీద్ వచ్చాడు. అతనితో కలిసి వెళ్లేందుకు చాలా భయపడింది. కానీ, వెనక్కి వెళ్లలేని పరిస్థితి. తెగించి అతనితోపాటు వెళ్లింది. సీతమ్మధార దగ్గర ఓ డాబా ఇంట్లో ప్రకాశరావు కలిశాడు. స్నేహితుల సమక్షంలో దండలు మార్చుకొని పెళ్లిచేసుకున్నారు. నాలుగు నెలలకే ప్రకాశరావు మీద అనుమానంతో పోలీసులు అరెస్టు చేశారు. దీంతో ఉద్యోగం నుంచి సస్పెండ్ అయ్యాడు.

అతను తనకు తెలిసిందానికన్నా మరింత ప్రమాదకరమైన పనుల్లో ఉన్నాడని సావిత్రికి అర్థమైంది. అక్కడి కొత్త వాతావరణం, అక్కడి స్వేచ్ఛా సావిత్రికి ధైర్యాన్నిచ్చాయి. ఇతరులకంటే భిన్నంగా ఉండే ప్రకాశరావు పద్ధతి చాలా నచ్చింది. "తిట్లు, అవమానాలు, కొట్టడాలు, ఇంట్లోంచి వెళ్లగొడతానని బెదిరించటాలు, చేతికి నయా పైసా ఇవ్వకుండా లొంగదీయటాలూ లేని భర్త తనకు దొరకటం తన అదృష్టం అనుకునేది సావిత్రి' (నక్షత్రాలు కాసిన్ని కన్నీళ్లు; 2016, పు.69)

ప్రకాశరావు ఉద్యోగం వదిలేశాడు. అమలాపురంలో వాళ్లమ్మా, తమ్ముడూ ఉండేవాళ్లు. సావిత్రిని ఆరు నెలలపాటు వాళ్లదగ్గరే ఉంచి వెళ్లిపోయాడు. మధ్యలో కబురుచేస్తే కలవడానికి రెండుసార్లు వెళ్లి వచ్చింది. చివరికి ప్రకాశరావు సావిత్రిని తీసుకొని హైదరాబాద్‌కు వచ్చాడు. చిక్కడపల్లి దగ్గర ఓ రెండు గదుల ఇల్లు అద్దెకు తీసుకున్నాడు. పక్కనే ఓ ప్రింటింగ్ ప్రెస్‌లో ఉద్యోగంలో చేరాడు. రషీద్ కూడా అక్కడే చేరాడు. అక్కడ పార్టీ సాహిత్యం ప్రింటవుతుందనీ, వాళ్లిద్దరూ ఆ పనిలోనే ఉన్నారని సావిత్రికి అర్థమైంది. అప్పటికి ఆమె ఏడో నెల గర్భవతి. అప్పుడే ఎమర్జెన్సీ ప్రకటించారు. అరెస్టులు, పోలీసులు పట్టుకుపోయి కాల్చిచంపుతున్నారు. ఎప్పుడు ఏం జరుగుతుందో తెలియని పరిస్థితి. సావిత్రిలో భయం మొదలైంది. ప్రింటింగ్ ప్రెస్ దగ్గర మఫ్టీ పోలీసులు తిరుగుతున్నారు. దీంతో సావిత్రిని తీసుకొని పాతబస్తీలోని ఓ షెల్టర్‌కు వెళ్లాడు. పరిస్థితులేం బాగాలేవు. ఈ సంగతి ఆమెకూ తెలుసు. 'ఇక్కడే ఓ రెండు రోజులు వుండు. డెలివరీ అయ్యేవరకూ నిన్ను వుంచేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి" అన్నాడు ప్రకాశరావు. ఆ రాత్రి అక్కడే ఉన్నారు. రాత్రంతా ఆమె నిద్రపోలేదు. దిగులుతో ఏడ్చింది. అతను వెళ్లిపోయాడు. ఆమెను నల్లగొండలోని మిర్యాలగూడలో ఒకరి ఇంట్లో ఉంచారు. అక్కడే అరుణిమ పుట్టింది. ఎమర్జెన్సీ ఎత్తివేసి, జనతాపార్టీ అధికారంలోకి వచ్చేదాకా అక్కడే ఉంది సావిత్రి. ఆమెను చూడటానికి ప్రకాశరావు అప్పుడప్పుడూ వచ్చేవాడు. ఆమెను తీసుకొని వేరేచోటికి వెళ్లాడు. నడివయసు దాటిన ఇద్దరు భార్యాభర్తలు సావిత్రి తల్లిదండ్రులుగా, పద్దెనిమిదేళ్ల రవి సావిత్రికి తమ్ముడిగా వ్యవహరించేవాళ్లు. ప్రకాశరావు వ్యాపారస్తుడనీ, పనిమీద ఎక్కువగా ఊర్లు తిరుగుతుంటాడని అక్కడి వాళ్లకు చెప్పుకొనేవాళు ్లు. అక్కడున్నప్పుడే సావిత్రికి క్రాంతి పుట్టాడు.

వారంలో వస్తానని వెళ్లిన ప్రకాశరావు కనపడకుండా వెళ్లిపోయాడు. సావిత్రి ఇద్దరు పిల్లల్ని తీసుకొని హైదరాబాద్‌కు చేరింది. కొంతకాలం తమతో ఉన్న రవి మణుగూరు అడవుల్లో ఎదురు కాల్పుల్లో చనిపోయాడనే వార్త విని సావిత్రి చాలా బాధపడింది. ఉద్యమం నిర్మించేందుకు అడివిలోకి వెళ్లిపోయాననీ, ధైర్యంగా జీవించేందుకు ప్రయత్నించమనీ ఆరునెలల తర్వాత చిన్న చీటీ పంపాడు ప్రకాశరావు. పార్టీ వాళ్లు ఆర్థికంగా కొంతసాయం చేసేవాళ్లు. అయినా జీవిక వెతుక్కోవాల్సిన పరిస్థితి సావిత్రిది. ఇట్లాంటి పరిస్థితుల్లో రషీద్ సావిత్రి జీవితంలోకి వచ్చాడు. ఎమర్జెన్సీ కాలంలో అరెస్టయ్యాడు. తీవ్రమైన హింసలపాలయ్యాడు. మూడేళ్లు జైల్‌లో

ఉన్నాడు. ఆరోగ్యం పూర్తిగా దెబ్బతిన్నది. పూర్తికాలం ఉద్యమంలో పనిచేయలేనని, చిన్న ప్రింటింగ్ ప్రెస్ పెట్టుకొని బతుకుతున్నాడు. అతనే ఆమెకు సనత్‌నగర్ దగ్గర ఓ ఫాక్టరీలో ఉద్యోగం ఇప్పించాడు. కూతుర్నీ, కొడుకునీ బడిలో చేర్పించింది. రమ్మని పిలవగానే ఊరినుంచి ప్రకాశరావు తల్లి వచ్చింది. ఆమె రాకతో సావిత్రికి కొంత నిశ్చింత దొరికినట్లయింది. ప్రకాశరావు నుంచి అప్పుడప్పుడూ ఉత్తరాలు వచ్చేవి. కానీ ఆమెను ఎప్పుడూ కలవలేదు. ఆమెకు ఏది కావాలన్నా రషీద్‌నే అడిగేది. ప్రకాశరావు తల్లి చనిపోయాక ఇంటికి రషీద్ రాకపోకలు ఎక్కువయ్యాయి. పిల్లలిద్దరికీ అతనితో చనువెక్కువ. అతన్ని 'చిన్నాన్న' అని పిలిచేవాళ్లు. రషీద్ సావిత్రిని ఇష్టపడ్డాడు. అతని మాటలు ఆమెకు అర్థమయ్యాయి. రషీద్ కవిత్వం రాస్తాడు. బొమ్మలుగీస్తాడు. సావిత్రిపట్ల గౌరవం ఉన్నవాడు. సావిత్రికి అండగా నిలబడ్డాడు.

## 5. కనకలత :

ఫ్లాష్‌బ్యాక్ కథనంతో సాగిన ఓ మహిళ కథ ఇది. రచయిత్రికి ఆమె చాలా ఏళ్ల క్రితం పరిచయం. రచయిత్రి జర్నలిస్టు. ఓ మీడియా ఛానెల్‌లో పనిచేస్తోంది. అదే పనిమీద ఓ సారి రామప్ప గుడికి వెళ్లింది. అక్కడ ఆమెకు ఓ మహిళ ఎదురైంది. గుర్తుపట్టి నవ్వింది. పలకరించింది. ఆమె పేరు కనకలత. తనకు ఇద్దరు పిల్లలు. "కళ్లకి అద్దాలు, వేలుముడి వేసిన జుట్టు... ఆ నవ్వులో ఏదో వెలితి వుంది. ఆ నవ్వెందుకో, ఆమె మొఖానికి అనాకారితనం తెచ్చినట్లనిపించింది. తేరిచూస్తే, సగం విరిగిన రెండు పళ్లు కనబడి..."

(కొన్ని నక్షత్రాలు కాసిన్ని కన్నీళ్లు; 2016, పు. 112)

రచయిత్రి మనసులో కల్లోలం రేగింది. ఎట్లా వుండే కనకలత ఇట్లా అయిందనే బాధ ఆమెను నిలువనీయలేదు. ఒక్కసారిగా గతంలోకి వెళ్లింది. చాలా ఏళ్ల క్రితం ఓ అమ్మాయి, ముసురు పట్టిన రాత్రి లాలాపేటలో వుండే రచయిత్రి గదికి వచ్చింది. ఒకతను తీసుకొచ్చాడు. ఆమెను అక్కడే వుంచి, వెళ్లిపోయాడు. ఆమే కనకలత. గలగలా మాట్లాడే మెరుపుతీగలాంటి పిల్ల. కలుపుగోలు పిల్ల. అదే ఆమెతో మొదటి పరిచయం. కనకలతది ఆదిలాబాద్ జిల్లా లక్సెట్టిపేట. ఒకప్పుడు బాగా బతికి, ఆర్థికంగా చితికిపోయిన కుటుంబం. తండ్రి తాగుబోతు. అన్న జులాయి. ఏ బాధ్యతా లేని మనిషి. తల్లిదండ్రులూ, చెల్లెపై ఆధారపడి బతికే మనిషి. అతడంటే ఆమెకు అసహ్యం. పదో తరగతి చివరి పరీక్ష రాసిన రోజే టీచర్ కొడుకు, తన క్లాస్‌మేట్ వెంకటరమణతో పారిపోయింది కనకలత. అప్పటికి రెండేళ్లుగా ప్రేమించుకుంటున్నారు. ఇంట్లో తెలిసి తన అన్న బెల్ట్‌తో కొట్టాడు. తల్లి బతిమిలాడితే, పదో తరగతి పరీక్షలు రాయడానికి ఒప్పుకున్నాడు. వెంకటరమణ ఇంట్లోనూ తెలిసి, ఆంక్షలు పెట్టారు. ఆఖరి పరీక్ష రోజే హాలు నుంచి పారిపోయారు. స్నేహితుల సాయంతో వేములవాడ గుడిలో దండలు మార్చుకొని పెళ్లి చేసుకున్నారు. అప్పటికి పదహారేళ్లు కూడా దాటలేదు. ఆమె తెచ్చిన ఇరవై వేలూ, నగలూ ఖర్చుకాకముందే తన అన్న వాళ్ల జాడ తెలుసుకున్నాడు. ఇద్దర్నీ కొట్టి, జీపులో వేసుకొని వెళ్లిపోయాడు.

చిన్నప్పుడే ప్రేమించి పెళ్లిచేసుకున్నది కనకలత. ప్రేమలో మోసపోయింది. రెండోసారి అడవిలో విప్లవోద్యమ నాయకుడితో సహచర్యం. ఆ సంబంధమూ తెగిపోయింది. జైలుకు వెళ్లింది. బయటకు వచ్చాక మరొక వ్యక్తి ఆమె జీవితంలోకి వచ్చాడు. ఈ ప్రయాణమంతా ఎన్నో అవమానాలు. బాధలు. హింసలు. ఆమె స్వేచ్ఛా ప్రపంచం ధ్వంసమైపోయింది. హైదరాబాద్‌లోని లాలాపేట; అడవి, జైలు, వరంగల్ జిల్లా జనగామ, రామప్ప గుడి చుట్టూ తిరిగిందీ కథ.

## 6. చుక్కల క్రింది రాత్రి :

బతుకు ధ్వంసమైపోయిన యువతి కథ ఇది. వర్ణ, నీరజ కలిసి చదువుకున్నారు. వర్ణ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్. నీరజ ఎన్జీవోలో పనిచేస్తోంది. నిరాశ్రయులుగా రోడ్లమీద బతుకుతున్నవాళ్లతో పాటు కలిసి భోజనం చేయాలనుకున్నారు. వాళ్లతోపాటు ఒక్క రాత్రన్నా ఉండి, వాళ్ల జీవితాన్ని అర్థం చేసుకోవాలనుకున్నారు. ఏ దిక్కూలేనివాళ్లకు తామున్నామనే భరోసా ఇచ్చేందుకు ప్రపంచమంతా 'చుక్కల కింది రాత్రి' పేరుతో ఓ కార్యక్రమం నిర్వహిస్తారు. వివిధ స్వచ్ఛంద సంస్థలు ఇందులో పాల్గొన్నాయి. అనేకమంది బృందాలుగా ఏర్పడి ఒక్కో ప్రాంతంలో నిరాశ్రయులను కలిసేందుకు బయల్దేరారు. వర్ణా, నీరజా మరికొందరు ఓ బృందంగా ఏర్పడి సికింద్రాబాద్ క్లాక్‌టవర్ సెంటర్‌కు వెళ్లారు. అప్పటికే రాత్రి చాలా రాత్రయింది. వాళ్లకు అక్కడ బస్టాప్ ఫుట్‌పాత్ మీద కూర్చున్న ఓ మహిళ కన్పించింది. ఆమె చుట్టూ నలుగురైదుగురు మగవాళ్లున్నారు. దారివెంట వస్తున్న వర్ణవాళ్ల బృందాన్ని చూసి వాళ్లు పక్కకుపోయి నిలబడ్డారు. ఆ పిల్ల వీధిలైట్ల నీడలో కూర్చొని వున్నది. బక్కపలచగా, చామనఛాయగా ఉన్న ఆ పిల్ల బుగ్గలు లోపలికిపోయి ఎముకలు కన్పిస్తున్నాయి. వీళ్లనుచూసి మరింత ముడుచుకొని తలదించుకుంది. వర్ణ వాళ్ల బృందం ఆ యువతిని పలకరించారు.

"ఒక్కదానివే ఉన్నావా?", "ఎక్కడినుంచొస్తున్నావ్?", "ఎక్కడికెళ్లాలి?" లాంటి ప్రశ్నలు వేశారు. భయంతో ఆ పిల్ల గబాలున లేచి నిలబడింది. నాలుగడుగులు ముందుకు వేసింది. అక్కడే తచ్చాడుతున్న ఆ మగవాళ్లను చూసి మళ్లీ ఆగిపోయింది.

ఆ అరుగు మీదే కూర్చున్నది. ప్రశ్నిస్తున్నవాళ్లలో ఆడవాళ్లు కూడా ఉండటంతో కొంచెం ధైర్యం వచ్చిందామెకు. "నాంపల్లి బస్‌కోసం చూస్తున్నాను" అన్నది. అప్పుడే వస్తున్న ఓ బస్సును ఆపారు, ఆ అమ్మాయి కోసం. కానీ, ఆమె బస్కెక్కలేదు. మొండిగా అక్కడే నిలబడింది. ఆ బృందం కాస్త దూరం వెళ్లగానే, వాళ్ల వెనక వచ్చింది. దగ్గరికి రాగానే భుజం మీద చెయ్యేసి చిన్నగా నవ్వింది వర్ణ. "భయపడకు. కాసేపయ్యాక మేం కూడా నాంపల్లికే వెడుతున్నాం. ఇంత ఆలస్యంగా వెడితే మీ ఇంట్లో వాళ్లు నీకోసం కంగారు పడతారు కదా? ఎక్కడికెళ్లొస్తున్నావ్? ఎవరినన్నా తోడు తీసుకొని రావాల్సింది. ఇంతకీ నీ పేరేమిటి?" అని అడిగింది. ''సల్మా'', అంది అన్ని ప్రశ్నలకీ అదే జవాబన్నట్లు. (అదే, పు. 131)

వర్ణ ఆమెతో మాటలు కలిపింది. వివరాలడిగింది. 'సికింద్రాబాద్ వెళ్లొస్తున్నాననీ, రైల్వే స్టేషన్ దగ్గర తన అక్కని చూడటానికి వచ్చానని చెప్పింది. ఈ రాత్రికి అక్కడే ఉంటే మగవాళ్లు ఎత్తుకెళ్లి అమ్ముకుంటారని భయంతో ఇక్కడికి వచ్చానన్నది. వర్ణా వాళ్ల బృందం బైబిల్ హౌస్ సందు దగ్గరికి వచ్చారు. అక్కడ వాళ్ల కోసం చాలామంది ఎదురుచూస్తున్నారు. వాళ్లంతా నిరాశ్రయులు. ఏ దిక్కూ లేనివాళ్లు. ఈ బృందం తెచ్చిన ఆహారాన్ని వాళ్లకిచ్చారు. అందరూ కలిసి తిన్నారు. కాసేపయ్యాక వర్ణ అడిగితే చెప్పింది సల్మా. తనకు ఏడాదిన్నర కొడుకున్నాడని. వాణ్ని తన అమ్మ దగ్గర వదిలిపెట్టి వచ్చానని. నాంపల్లి దర్గా దగ్గర ఉంటామని. "ఇల్లు లేదా? మీ ఆయన, నాన్నా ఏం చేస్తారు" అని అడిగింది వర్ణ.

"నా చిన్నప్పుడు వుండేది. మా నాయిన ఇండ్లల్లో సున్నాలేస్తడు. మా అమ్మ ఇండ్లల్లో బాసాండ్లు తోమేడిది. మా అమ్మకి అందరూ ఆడపిల్లలే పుట్టినరని, మా నాయిన ఇంకొకి పెండ్లి చేసుకున్నాడు. నాకు పదేళ్ల వయసప్పుడు మస్తు లొల్లయింది. మా నాయిన మా అమ్మని, మమ్మల్ని ఇంట్లకెల్లి ఎల్లగొట్టిండు. మా అమ్మకి ఎవరూ లేరు. బంధువులు ఎవ్వరూ దగ్గరికి తీయలేదు. మమ్మల్ని పెట్టుకుని జుమ్మా మసీదు తాన అడుక్కునేది. అక్కడనే పడుకునేటోళ్లం. మా అక్క ఎవడితోనో ఎల్లిపోయింది. ఏడున్నదో ఇప్పటికీ తెల్వదు. మా చెల్లెని సాదలేక ఎవరికో ఇచ్చేసింది మా అమ్మ." (అదే, పు. 134)

సల్మా అక్కడే ఓ హోటల్ క్లీనర్‌కు దగ్గరైంది. పెళ్లిచేసుకోలేదు. ఆమె గర్భవతయ్యాక వదిలేసి వెళ్లిపోయిండు. కొడుకు పుట్టిండు. ఏ దిక్కూలేక, చీకటి వీధుల్లో తన ఒళ్లమ్ముకుంటూ బతుకుతోంది. వైట్నర్‌కు అలవాటైంది. అదే మత్తులో ఉంటున్నది. ఆమెను కొంతకాలం ఎక్కడైనా ఆశ్రమంలో పెడతామని వర్ణావాళ్ల బృదం ఎంత నచ్చజెప్పినా ఆ పిల్ల వినలేదు. రానన్నది.

"మేరీ అమ్మీకే పాస్ జావూంగీ. మేరా బచ్చీకొ దేఖ్‌నా," అంటూ అక్కడి నుండి లేచింది.

నాంపల్లి స్టేషన్‌లో హడావుడి మొదలైంది. అప్పటికే తెలవారుతోంది. ఎక్కడి నుంచి వచ్చిన వాళ్లు అక్కడికే వెళు న్నారు. అనేక గల్లీల నుంచి వచ్చిన నిరాశ్రయులంతా వెళ్లిపోతున్నారు. వర్ణావాళ్ల బృందంలో అనేక ప్రశ్నలు చెలరేగాయి. ఎక్కడి నుంచి వచ్చిన మనుషులు వీళ్లంతా? ఇంతకాలంగా ఎట్లా బతకగలుగుతున్నారు? వీళ్ల జీవితాలు ఇట్లా ముగియాల్సిందేనా? సొంత ఇల్లు లేని మనుషులు. సొంత మనుషులంటూ లేని వాళ్లు. ఇట్లా అనేకానేక ప్రశ్నలు. సమాధానం లేని ప్రశ్నలు. ఎప్పటికీ అంతు చిక్కని జీవితాలు. "తలెత్తి ఉదయపు వెలుతురు పరుచుకుంటున్న ఆకాశం కేసి చూస్తే అక్కడ చుక్కలు లేవు. కానీ ఆ చుక్కల రాత్రి రేపిన కల్లోలం మాత్రం ఆమెలో మిగిలింది." (అదే, పు. 136)

## 7. మార్తా ప్రేమ కథ :

తాను ఇష్టపడ్డ అబ్బాయి స్నేహసాహచర్యాలలో అతని రాజకీయాలను కూడా ఇష్టపడి అనితోపాటు విప్లవ నిర్మాణంలో తానూ భాగమైన మార్తా ప్రేమ కథ. అతడు అరెస్టయ్యాడు. ఆమె బయట ఉన్నది. చుట్టూ పోలీసుల నిర్బంధం. తాను అతని సహచరినని చెప్పుకోలేని స్థితి. అయినా ఆమె జీవితమంతా అతని కోసమే ఎదురు చూసింది. అతని ప్రేమను సజీవంగా నిలుపుకుంటూ. అతని సాహచర్యాన్ని, విప్లవాన్ని తలుచుకుంటూ.

మార్తాది వినుకొండ నుంచి గుంటూరుకు వలస వచ్చిన కుటుంబం. ఆమె తండ్రి గుంటూరు మిర్చియార్డులో కార్మికుడు. తల్లి మిషన్ కుట్టేది. మార్తా పదో తరగతిలో ఉన్నపుడే తండ్రి చనిపోయాడు. చిన్నప్పుడే అక్కకు పెళ్లయింది. చాలీచాలని సంసారం. దీంతో కుటుంబ భారమంతా మార్తాపై పడింది. ఆమె ఇంటర్మీడియెట్‌లో ఉన్నపుడు లెనిన్‌చంద్ర పరిచయమయ్యాడు. అతనిది రేపల్లె దగ్గరి పల్లెటూరు. వ్యవసాయ కుటుంబం. ముగ్గురన్నలు. ఇద్దరు అక్కలు. లెనిన్ చంద్రది రెండు తరాల కమ్యూనిస్టు కుటుంబం. అతడు గుంటూరులో చదివేటపుడు విద్యార్థి ఉద్యమాల్లో పాల్గొన్నాడు. ఊరేగింపుల్లో అతన్ని చూసింది. ఆ రెండేళ్లలో అప్పుడప్పుడు మాత్రమే మాట్లాడుకునేవాళ్లు. కుటుంబ ఆర్థిక ఇబ్బందుల వల్ల మార్తా చదువు డిగ్రీ మొదటి ఏడాది మధ్యలోనే ఆగిపోయింది. జీవిక కోసం ఓ ప్రింటింగ్ ప్రెస్‌లో పనిచేస్తోంది. ఆ ఉద్యోగంలో చేరాక

రెండేళ్ల తర్వాత ఓ రోజు కరపత్రం ప్రింట్ చేయించడానికి లెనిన్‌చంద్ర ఆ ప్రెస్‌కు వచ్చాడు. “కాలేజీ వదిలేశాక అతనితో ఎదురుబడి మాట్లాడటం అదే మొదటిసారి. మార్తా కోసం పుస్తకాలు తెచ్చేవాడు. కొంచం అర్థమయి, అర్థంకాక ఆమె చదివేది. వాళ్లిద్దరి మధ్యా సంభాషణ సాగేందుకు ఆ పుస్తకాలు మాధ్యమంగా వుండేవి.” (కొన్ని నక్షత్రాలు కాసిన్ని కన్నీళ్లు; 2016, పు.140)

అట్లా వాళ్లిద్దరి మధ్య సాన్నిహిత్యం పెరిగింది. అప్పుడప్పుడూ కలుసుకునేవాళ్లు. కొంతమందితో కలిసి పార్వతీపురం చుట్టుపక్కల ప్రాంతాల్లో సర్వేచేసేందుకు వెళ్తూ మార్తాను కూడా తనతో పాటు రమ్మన్నాడు. వెళ్లింది. ఆ ప్రయాణమంతా వాళ్లిద్దరూ నిశ్శబ్దంగా మాట్లాడుకున్నారు. అక్కడున్న “ఐదు రోజులూ వాళ్లిద్దరికీ, విడిగా మాట్లాడుకునేంత సమయం దొరకలేదు. అంతమంది మధ్యా వాళ్ల కళ్లు, ఒకరికోసం ఒకరు వెతుక్కొని సంభాషించుకునేవి.” (అదే, పు.144)

వాళ్లిద్దరి మధ్యా ప్రేమ చిగురించింది. ఆమె ఇంట్లోంచి బయటకు వచ్చింది. తల్లి వద్దని చెప్పినా వినకుండా. “ఆ చీకటి రాత్రి, కురుస్తున్న వర్షంలో తడుస్తూ వెళ్లిపోయింది మార్తా.” (అదే, పు. 144)

“చర్చిలో ఏసుప్రభువుపై పాటలు పాడే మార్తా గొంతులో ఇప్పుడు నెత్తుటి పాటలు... వినేవాళ్ల హృదయం ద్రవించేలా, కోపంతో రగిలిపోయేలా పాడేది. అలా పాడేప్పుడు ఆమెకి తెలీకుండానే పాటకి అనుగుణంగా, ఆమె మొఖంలో హావభావాలు మారిపోయేవి. అప్పుడు మార్తా అతనికి కొత్తగా కనపడేది. లెనిన్ చంద్ర చీరాల ప్రాంతంలో, పనిచేసేందుకెళ్లిపోయాడు.” (అదే,పు.144)

అదే కాలంలో చుండూరు మారణకాండ జరిగింది. వాళ్లిద్దరూ అక్కడి గ్రామాలన్నీ కలియదిరిగారు. విప్లవకారులపై నిర్బంధం పెరిగింది. దీంతో వాళ్లు నల్లమల అడవులకు చేరుకున్నారు. అక్కడే వాళ్ల పెళ్లి జరిగింది. ఆ తర్వాత మరో రెండు గంటలకే, చంద్ర పనిమీద సహచరులతో కలిసి వెళ్లిపోయాడు. నెల తర్వాత తిరిగివచ్చాడు. ఓ ఐదురోజుల పాటు అడవిలో కలిసి వున్నారు. అతను మళ్లీ వెళ్లిపోయాడు. వాళ్లనేకసార్లు పనుల నిమిత్తం విడిపోతూ, కలుస్తూ గడిపారు. కొంత కాలమయ్యాక వేరే రాష్ట్రం వెళ్లాల్సి వచ్చింది. అక్కడ మారుపేర్లతో పనిచేశారు. అక్కడొక మెకానిక్ షెడ్డులో, యంత్రాల విడిభాగాలు తయారుచేసే ఓ పంజాబీ యజమాని కింద పనిలో కుదిరాడు చంద్ర. ఆంధ్రా నుంచి వచ్చిన మరో రెండు జంటలు కూడా ఇదే పనిలో ఉన్నారు. కొంత కాలానికి జతిన్ దా ఈ బృందానికి నాయకుడిగా వచ్చాడు. అక్కడ వాళ్లంతా ఆయుధాల విడి భాగాల్ని తయారుచేసి, చేరాల్సిన గమ్య స్థానాలకి రవాణా చేసేవారు. ఓ రోజు సాయుధ పోలీసు బలగాలు ఆ షెడ్డును చుట్టుముట్టాయి. చంద్రతోపాటు అరుణ, రాజును అరెస్టు చేశారు.

మార్తా ఆరోగ్యం పాడైంది. ఆపరేషన్ చేసి గర్భసంచి తొలిగించారు. బాగా చిక్కిపోయింది. వెన్ను నొప్పితో బాధపడుతూ, తిరిగి అడవిలోకి వెళ్లి పనిచేయడం కుదరలేదు. బయట వుండి పనిచేయడం క్షేమం కాక, ఏం చేయాలో తెలియని స్థితిలో పడింది. దాచేపల్లిలో ఉంటున్న అమ్మ దగ్గరికి వెళ్లింది. “ఇన్నాళ్లూ బతికిన తన ప్రపంచానికి దూరమై ఇలాంటి జీవితం గడపడం ఆమెకు చాలా కష్టంగా, ఊపిరాడకుండా ఉండేది. ఇక్కడి మనుష్యులు, వాళ్ల ప్రవర్తన, ఆ కృత్రిమత్వం ఆమెకి అర్థమయ్యేవి కావు.” (అదే, పు.152)

చంద్రతో పెళ్లయిన విషయమూ, అతను జైల్లో ఉన్న విషయమూ బయటి ప్రపంచంలో తెలిసినవాళ్లు అతి తక్కువ మంది. ఆ సంగతులు బహిరంగంగా ప్రస్తావించటం ప్రమాదమన్న రోజులయ్యాక తిరుపతిలోని ఓ స్కూల్‌లో క్లర్కుగా చేరింది.

చంద్ర అరెస్టయి ఏడేళ్లయింది. దేశద్రోహం, అక్రమ ఆయుధాల తయారీ, సాయుధ కుట్ర వంటి తీవ్ర నేరారోపణలున్న ఆ కేసుల్లో వాళ్లెవరికీ బెయిల్ దొరకలేదు. అతని అన్న నాగన్నే ఈ ఏడేళ్లలో లెనిన్ చంద్రను మూడుసార్లు మాత్రమే కలవగలిగాడు. “ఏడు సంవత్సరాల పాటు విచారణ జరిగాక, చంద్ర, అరుణ, మిగిలిన అందరికీ, ఆరు కేసుల్లో, ఆరు యావజ్జీవ శిక్షలు పడ్డాయి. ఆ వార్త విన్న రోజున మాత్రం మార్తా చాలాసేపు ఏడ్చింది. ఎక్కడో మిగిలిన చిగురంత ఆశ కూడా ఆవిరై పోయినందుకు, వాళ్లతో పాటు తాను లేనందుకు.” (అదే, పు.155)

మార్తా మనసులోంచి చంద్ర రూపం చెరిగిపోలేదు. అతన్నెప్పుడూ మర్చిపోలేదు. జీవితమంతా లెనిన్ చంద్ర జ్ఞాపకాలతోనే బతుకుతోంది. కేసు అప్పీలు కోసం లాయర్ వెళ్లినపుడు అతనితో చంద్ర ఓ ఉత్తరం పంపాడు. మార్తాకు అందించమన్నాడు. ఆ ఉత్తరం అందుకున్న మార్తా కళ్లనిండా నీళ్లు. “సంబోధనా, సంతకం లేని ఆ ఉత్తరాన్ని ఆమె ఎన్నిసార్లు చదువుకుందో లెక్కలేదు.” (అదే, పు.155)

మార్తా తన జీవితమంతా లెనిన్ చంద్ర జ్ఞాపకాల్లోనే బతుకుతోంది. అతని కోసమే ఎదురుచూస్తూ ప్రేమను సజీవంగా నిలుపుకున్నది.

**8. సూర్యుడి మొదటి కిరణం :**

తన ప్రేమకూ, తాను ప్రేమించిన వ్యక్తి విప్లవ ఆదర్శానికి మధ్య వచ్చిన వైరుధ్యం కారణంగా వచ్చిన ఎడబాటు వల్ల తల్లడిల్లిన యువతి కథ ఇది. ఆ దు:ఖంలోంచే, వియోగంలోంచే తనకు తానే పరిష్కారాన్ని ఎంచుకున్న కథ. ప్రేమించినవాడు దూరమయ్యాడని, అతని జ్ఞాపకాలతో జీవితమంతా ఎదురుచూసిన విరాళి కథ.

విరాళిది విశాఖపట్నం. మధ్య తరగతి జీవితం. ఎం.ఫిల్. చదివేందుకు ఢిల్లీలోని జె.ఎన్.యూ.లో చేరింది. అక్కడ నూరు పూలు వికసించే జ్ఞాపకాలు. నూరు ఆలోచనలు సంఘర్షించే జ్ఞాపకాలు. అక్కడే నేహా, కార్తీక్ మీనన్, రుక్సానా, అన్వర్, ఇందు సబీర్ సర్కార్, పరుల్‌దేవ్ ముఖర్జీ పరిచయమయ్యారు. వాళ్లందరిదీ మరోప్రపంచ దృక్పథం. ఎప్పుడూ ఏవేవో ఎడతెగని చర్చలు. వీధినాటకాలు. రిహార్సల్స్. పాటలు. స్టడీ సర్కిల్స్. గోడ రాతలు. క్యాంపస్‌లో పోస్టర్‌లు, గొడవలు. కొద్దిరోజుల్లోనే ఆ కల్చరల్ బృందంలో విరాళి కూడా సభ్యురాలైంది. కానీ ఆ రాజకీయాల తీవ్రత తనకెన్నడూ పట్టలేదు. పాటలపట్లే కాస్త ఆసక్తి ఉండేది. అప్పుడు కార్తీక్ మీనన్ పొలిటికల్ సైన్స్‌లో ఎం.ఫిల్. చదువుతున్నాడు. మలయాళీ జానపద గీతాలు అద్భుతంగా పాడతాడు. పుస్తకాలు విపరీతంగా చదువుతాడు. ఇద్దర్నీ కలిపిన ఆసక్తుల్లో ఇదీ ఒకటి. "కార్తి... చుట్టూ ఎప్పుడూ మనుష్యులు, చలికి కళ్ల చిన్నవాడు తనను చూడగానే వెలిగే కళ్లతో పలకరించేవాడు. తనతో అతడికి ప్రత్యేక స్నేహం ఏదో వుందని, తనంటే అతడికీ ఇష్టమేనని విరాళికే కాదు, అతడి స్నేహితులకి కూడా తెలుసు. ఆ నాలుగైదేళ్లలో మెల్లిమెల్లిగా ఇష్టం, ప్రేమగా ఎదిగి, అతడ్ని చూడకుండా వుండలేని, అతడొక కలవరపు పలకరింపై..." (అదే, పు.199)

ఎం.ఫిల్. పూర్తయ్యాక పి.ఎచ్.డి.లో చేరాడు కార్తీ. పూర్తికావస్తున్న థీసిస్‌ని మధ్యలోనే వదిలి వెళ్లిపోతున్నాడు. ఆ చదువు, రిసర్చ్, క్యాంపస్‌లో ఉండేందుకొక అవకాశం మాత్రమేనని, డిగ్రీల పట్ల అతనికేమంత ఆసక్తి లేదని ఆమెకు తెలుసు.

ఒకనాటి రాత్రి క్యాంపస్ రోడ్లపై శరదృతువు వెన్నెల్లో వాళ్లిద్దరూ నడుస్తున్నారు. 'ఎక్కడికెళ్తావ్' అని అడగాలనుకున్నది. కానీ, ఏమీ అడగలేకపోయింది. అతను చేతులు సాచాడు. ఆమె అతడి గుండెలపై తలపెట్టి ఏడుస్తోంది, నిశ్శబ్దంగా. "విరాళికి తెలుసు అన్నింటికన్నా చివరికి అతడి ప్రాణం కన్నా అతడికి అతడెంచుకున్న మార్గం ముఖ్యమని." (అదే, పు.200)

'నేను మా వూరెల్లి, నెలరోజులుందామనుకుంటున్నా. బహుశా, మళ్లీ ఎవర్నీ కలవలేనేమో' అన్నాడు కార్తీ. అన్నట్టుగానే వెళ్లిపోయాడు. కాలేజీ సర్టిఫికెట్‌లనీ, స్నేహితుల్నీ, అందర్నీ వదిలిపెట్టి వెళ్లిపోయాడు. అతనికి వీడ్కోలు చెప్పేందుకు వెళ్లలేదు విరాళి. అతడు వెళ్లిపోయాక విరాళి ఆలోచనల్లో అలజడి మొదలైంది. "చివరి వీడ్కోలు చెప్పకుండానే వెళ్లిపోతాడా? అతడ్ని కలవాలి. ఆఖరిసారి... అతడ్ని తాను ఎంతగా ప్రేమించిందో చెప్పాలి. తను అతడికి అర్థమయి, ఇంకా అర్థం కాలేదా. తను చెప్పగలదా. ఉహూ. చెప్పలేదు. చెప్పాలి. తనకోసం రాగలడా అతడు. కలలా ఒక ధూళి మేఘమై అదృశ్యమై, తిరస్కరించి. తిరస్కారమొక ముల్లు వలె గుచ్చుకొని, గుండెల్లో కొట్టుకొని, మనసు ఉగ్గబట్టుకుని అతడిని తాకాలని, అతడి వడిలో తలపెట్టుకొని- ఏడుపొస్తోంది విరాళికి." (కొన్ని నక్షత్రాలు కాసిన్ని కన్నీళ్లు; 2016, పు.201)

తీవ్రంగా ఆలోచించింది, అతణ్ని కలవడానికి. పదిరోజుల తర్వాత ఒక్క నేహకు తప్ప ఎవ్వరికీ చెప్పలేదు. ఓ రోజు ఒక్కతే రైలెక్కింది. నలభై ఆరు గంటలు ప్రయాణించింది. నిజాముద్దీన్ నుంచి త్రివేండ్రం, అక్కడి నుంచి ప్యాసింజర్ రైలులో బలరాంపురం స్టేషన్‌కు చేరుకున్నది. భోరున కురిసే వర్షంలో అడ్రస్ చెప్పి, ఓ ఆటోలో వెళ్లింది. ఓ ఇంటిముందు ఆగి గేటు తీసింది. అది కార్తీ ఇల్లు. ఓ యువకుడు బయటకు వచ్చి 'ఎవరు కావాలి?' అని ఇంగ్లిష్‌లో ప్రశ్నించాడు. విరాళి చెప్పింది. కార్తీ పనిమీద పక్కవూరికెళ్లాడనీ, సాయంత్రం వస్తాడని చెప్పాడు. స్నానమయ్యాక భోజనం చేసి పడుకున్నది విరాళి. సాయంత్రం ఐదు గంటలకు ఏవో మాటలు వినపడుతుంటే మెలకువ వచ్చింది. కార్తీ వచ్చాడు. విరాళిని చూసి ఆశ్చర్యపోయాడు. "నిన్నస్సలు ఎక్స్‌పెక్ట్ చేయలేదిక్కడ," అన్నాడు కార్తీక్ ఆశ్చర్యం, ఆనందం కలగలిసిన స్వరంతో." (అదే, పు.202)

కార్తీక్‌ది దిగువ మధ్య తరగతి కుటుంబం. ఊర్లోనే ఓ పాత బట్టల దుకాణం. తిరుపూర్ మిల్లు నుంచి బట్ట తీసుకువచ్చి, కుట్టి ఎక్స్‌పోర్ట్ బిజినెస్ అని భాగస్తులతో ప్లాన్‌చేసి మోసపోయిన కుటుంబం. అప్పులు తీర్చేందుకు ఆస్తులు అమ్ముకొని చివరికి మగ్గం పనిచేస్తూ బతుకుతున్న కుటుంబం.

రెండెకరాల పొలంలో ఓ పక్కకు కట్టుకున్న చిన్న పెంకుటింట్లో నివాసం. ఇంటికి కాస్త దూరంగా ఉన్న ఓ పాకలోకి తీసుకెళ్లాడు. ఆ మట్టి గోడల అరల్లో పుస్తకాలు. నేలపై పరిచిన ఈతాకు చాపలు. కిటికీ తెరిస్తే పచ్చని పంటచేలు. ఆ వాతావరణం విరాళికి చాలా నచ్చింది. తన కార్తీలాగే. వ్యాపారంలో దివాళా తీశాక, కార్తీ తండ్రి పెరాలసిస్‌తో చనిపోయాడు. అన్నయ్య అప్పుల్ని, కుటుంబ భారాన్ని భుజానికెత్తుకున్నాడు. విప్లవోద్యమంలోకి వెళ్లాలనుకున్న వసంత్

కుటుంబం కోసం ఆగిపోయాడు. తన తమ్ముడు కార్తీకి పుస్తక ప్రపంచాన్ని పరిచయం చేశాడు. మరో ప్రపంచాన్ని అర్థంచేయించాడు. తనకు ఫ్రెండ్, ఫిలాసఫర్, గైడ్‌గా ఉన్నాడు. అన్న నుంచి అందుకున్న సమసమాజ నిర్మాణ కాంక్ష కార్తీక్‌లో అణువణువూ అంటుకున్నది. ఆ రెండు రోజుల ఒంటరి ప్రయాణంలో విరాళి మనసులో ఎన్నెన్ని సంభాషణలు నడిచాయో, మౌనంగా. అతనికి చెప్పాలనుకున్నవి, ఆమె అడగాలనుకున్నవి. ఆమె నిశ్శబ్దంగా అతడి చేయి పట్టుకున్నది, అపురూపంగా. 'నీతో మాట్లాడదామని వచ్చాను' అన్నది. 'నాకు తెలుసు, నువ్వేం మాట్లాడతావో. కొన్ని సందర్భాల్లో మాటలు, వట్టి నిరాకార శబ్దాలు' అంటూ తెరిచిన ఆమె అరచేతుల్ని తన ముఖానికి హత్తుకొని, ముద్దుపెట్టుకున్నాడు. ఆమె అతడి భుజంపై తలవాల్చింది. ఉబికి వచ్చే కన్నీళ్లను ఆపుకున్నది.

"నీకు నేను వద్దా!"

"కావాలి. కానీ వద్దు కూడా!"

"నేను రానా? నీకోసం..."

"ఉహూ. నీకోసం నువ్వే రావాలి. నువ్వు వచ్చినా నేను అన్నీ మానుకొని అచ్చంగా నీకోసం వుండిపోలేను" (అదే, పు. 204)

విరాళిలో మౌనం. కన్నీళ్లు. నిస్సహాయత. దిగులు. ఆమె ప్రపంచం కళ్లెదుటే కూలిపోయిన దిగులు. ఆమెకు స్పష్టమైంది, అతడు తన కోసం రాలేదని. ఇక్కడ ఉండలేదని. ఇద్దరి ప్రపంచాలూ వేర్వేరని అర్థమైంది. ఇది ఇంతకుముందే తెలిసినా, ఇప్పుడు మరింత స్పష్టమైంది. ఎప్పుడు చీకటి పడిందో గమనించనే లేదు. వసంత్ బ్యాటరీ లైట్ పట్టుకొని, వాళ్లకోసం వెతుకుతూ పిలిచాడు. మర్నాడు పొద్దున్నే వెళ్లిపోతానని పట్టుపట్టింది విరాళి. ఇద్దరూ రాత్రి స్టేషన్‌కు వెళ్లారు. దారిలో కార్తీక్, ఆమె చేయినందుకోబోతే మెల్లగా వెనక్కి లాక్కుంది. అతని ముఖంలో బాధ ఆ మసక వెలుతురులో కనిపిస్తూనే వుంది విరాళికి. "ఎందుకిట్లా, కాస్త నవ్వు మొఖంతో విడిపోవచ్చు కదా!" అన్నాడు కార్తీక్.

"నవ్వు. గుండెల నిండా దు:ఖాన్ని మోస్తూ, పెదవులపై నవ్వు. 'మళ్లీ ఎప్పుడు కలుద్దామంటే ', చెప్పలేనని తేల్చేసినవాడికి, 'నీకోసం ఎదురు చూస్తానంటే', తిరిగిరానని చెప్పినవాడికి చిరునవ్వుతో వీడ్కోలు. అయినా నవ్వింది, కళ్లనిండా నీళ్లతో. రైలు కదులుతూ వుంటే, "నీకోసం ఎదురుచూస్తాను," అంటూ చేయి వూపింది. అతడేదో అన్నాడు. అతడి మాటలు రైలు చప్పుడులో కలిసిపోయాయ్." (అదే, పు. 205)

ఆమె స్వప్నం కూలిపోయింది. ఎటూ దిక్కుతోచలేదు. కన్నీళ్లతో వెళ్లిపోయింది. మనసులో తడి ఆరింది. మనసంతా వికలమైంది. చదువు మానేసి వైజాగ్ చేరుకున్నది. ఏవేవో పోటీ పరీక్షలు రాసి ఓ ప్రైవేటు బ్యాంకులో ఫైనాన్షియల్ ఎనలిస్టుగా ఉద్యోగంలో చేరింది. మళ్లీ ఎం.బి.ఏ చదివింది. ప్రమోషన్ వచ్చింది. హైదరాబాద్‌లోని మియాపూర్‌లో ఓ ఫ్లాట్. కారు. ఏకాంతం. అమ్మ చనిపోయాక అక్క సంబల్‌పూర్ యూనివర్శిటీలో టీచింగ్‌లో చేరింది. పెళ్లిచేసుకొని అక్కడే స్థిరపడింది. నాన్న ఎవరి వద్దా వుండనని ఆశ్రమంలో చేరాడు. విరాళికి సుదీర్ఘ ఒంటరి తనం మిగిలింది. మానసికంగా అలసిపోయింది.

తిరిగిరాని అతడికోసం ఇన్నేళ్లుగా ఎదురుచూస్తోంది. అతడు బతికి వున్నాడో, లేదో తెలియదు. అతని జాడ కోసం విరాళి ఎప్పుడూ ప్రయత్నించలేదు. పాతమిత్రుల వద్ద కార్తీక్ ప్రస్తావన ఎప్పుడూ తేలేదు. అట్లా జీవితంలో చాలా ఏళ్లు గడిచాయి.

చాలా ఏళ్ల తర్వాత మిత్రులంతా కలుసుకున్నారు. పాత జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు.

కార్తీక్ తుపాకీతో యుద్ధరంగాన ఉన్నాడు. ఆమె నిత్యం సమాజంలో జరుగుతున్న అనేక యుద్ధాల్లో దేంట్లోనయినా మనసు పెట్టి పాల్గొనవచ్చునని నిర్ణయించుకున్నది. తన ప్రేమను సమాజం పట్ల ప్రేమగా మలుచుకున్నది.

విమల కథలన్నిటిలోనూ స్త్రీల వేదనలే. గుండె కోతలే. సమాజం నుంచీ, ఇంటి నుంచీ వెలివేతకు గురైన స్త్రీలు. ప్రేమ పేరుతో మోసపోయిన స్త్రీలు. కుల వివక్షల్లో నలిగిపోయిన హృదయాలు. కుటుంబ హింసల్లో విలవిల్లాడిన స్త్రీలు. మగ దురహంకారం కింద ఊపిరాడని స్త్రీలు. వీళ్లందరిలోనూ జీవితేచ్ఛ ఉన్నది. వాళ్ల స్వేచ్ఛను పితృస్వామ్యం బందీగా మార్చేసింది. ఇట్లాంటి లక్షలాది మంది స్త్రీల అంతరంగ వేదనల్ని విమల కథలుగా మలిచింది. కాలానికి ఎదురీదుతూ ధైర్యంగా నిలబడ్డ మహిళల బతుకుల్ని అద్భుతంగా చిత్రించింది.

**సంప్రదించిన పుస్తకాలు :**

1. ఓల్గా. 2004. కుటుంబ వ్యవస్థ మార్క్సిజం-ఫెమినిజం.

2. విమల. 2016. కొన్ని నక్షత్రాలు కాసిన్ని కన్నీళ్లు, చినుకు పబ్లికేషన్స్, విజయవాడ.

3. విమల. 1990. అడవి ఉప్పొంగిన రాత్రి, విప్లవ రచయితల సంఘం, జంటనగరాల యూనిట్, హైదరాబాద్.

4. సుధాకర్, శివరాత్రి. 2024. తూర్పార, కొలిమి ప్రచురణలు, హైదరాబాద్.

★ రచయిత: పరిశోధక విద్యార్థి T

# సర్వాయి పాపన్న- ఒక చారిత్రక పరిశీలన

బొల్లోజు బాబా

దళిత బహుజనులు ఏకమై ఉద్యమిస్తే రాజ్యాధికారం సాధించవచ్చని 17వ శతాబ్దంలోనే నిరూపించిన విప్లవకారునిగా కొందరు చరిత్రకారులు సర్వాయి పాపన్నకు పట్టం కట్టారు. చరిత్రలోంచి వ్యక్తులను తీసుకొని వారిద్వారా సమకాలీన రాజకీయ ప్రాసంగికత కలిగిన దృక్పథాన్ని ప్రకటించటం సహజం.

సర్వాయి పాపన్న జీవితం జానపదగాథలలో నిక్షిప్తమై ఉంది. ఇదొక కళాత్మక రూపం. సాధారణంగా కళాత్మక రూపంలో కల్పన ఉంటుంది. కథానాయకుడి చుట్టూ వ్యతిరేక వాతావరణ రూపంలో ఒక ఘర్షణ చిత్రించబడుతుంది. చివరకు ప్రొటగానిస్ట్ మరణించటంతో కథ ముగుస్తుంది. ఆనందోపదేశాలు కళ బాధ్యతలు. చరిత్రను మోసే అవసరం కళకు ఉండదు. అందుచేత ఆ రచయిత కళారూపానికి విరుద్ధంగా ఉండే కొన్ని సామాజిక, చారిత్రిక వాస్తవాల పట్ల అయితే మౌనమైనా వహించాలి లేదా వాటిని వంకరలైనా తిప్పాలి. అందుకే వీరగాథలలో కనిపించే కథానాయకులకు చరిత్రపుస్తకాలలో కనిపించే కథానాయకులకు హస్తిమశకాంతర వ్యత్యాసం ఉంటుంది.

J.A. Boyle, 1874లో Telugu Ballad Poetry అనే వ్యాసంలో పాపారాయుని వీరగాథను బళ్ళారికి చెందిన ఒక బోయవాని నోటివెంట విన్నట్లు, అది ఇటీవలే వ్రాసినదని పేర్కొన్నాడు. అందులో పాపన్న తల్లితో తన జీవితాశయాలను ఇలా చెపుతున్నాడు.

తల్లీ కొలువుకు వెళ్లను/
ఎంగిలి ముంత ఎత్తలేను
కొట్టుదును గొల్కొండ పట్టనము
ఢిల్లికి మొజుర్ నవుదును
మూడు గడియల బందరు కొట్టుదును
బంగార కడియాలు పెట్టుదును



ఆ తరువాత సర్వాయి పాపన్న వీరగాథను వచనరూపంగా మార్చి సర్వాయి పాపన్న చరిత్ర పేరుతో 1931న వచ్చింది. ఇది మరింత కాల్పనికతో ఉంటుంది.

**సర్వాయి పాపన్న వీరగాథ**

పాపన్న పన్నెండేళ్ల వయసులో చెట్టుక్రింద పడుకొన్నప్పుడు పన్నెండు తలల నాగుపాము అతనికి నీడపట్టింది. అటే పోతున్న కొంతమంది బ్రాహ్మణులు అది చూసి పాపన్న మహర్జాతకుడని, పల్లకిలో తిరుగుతాడని, గోల్కొండను ఏలుతాడని చెపుతారు. (పాపన్న కల్లుగీత వృత్తి చేసే గౌడ కులానికి చెందిన వ్యక్తి. అప్పట్లో సమాజంలోని ఉన్నతవర్గాలకు తప్ప ఇతరులకు పల్లకిలో తిరిగే అర్హత ఉండేది కాదు)

అప్పటినుంచి పాపన్న నోటిమాటకు

మహత్యం వచ్చిందట. తాడిచెట్టును కల్లు ఇమ్మని అడిగితే ఒంగి ఇచ్చేదట. తల్లి దాచుకొన్న కొంత సొమ్మును, వెంకటరావు అనే ఒక భూస్వామిని శిక్షించి అతని ధనాన్ని గ్రహిస్తాడు. ఒక ఎరికల ఆమెను పెండ్లిచేసుకొంటాడు. వజ్రనబుద్ధు అనే జమిందారుని కొల్లగొడతాడు. గోల్కొండ సైనికులతో తలపడి విజయం సాధిస్తాడు. గోల్కొండకోటపై దాడి చేసి ఆక్రమించుకొంటాడు. తరువాత ముస్లిం సైనికులు చుట్టుముట్టినప్పుడు ఇక చిక్కక తప్పదని తెలుసుకొని కత్తితో తలనరుక్కొని చనిపోతాడు. గోల్కొండ నవాబు ఇతని గొప్పదనాన్ని గుర్తించి రాజలాంఛనాలతో అంత్యక్రియలు జరిపించటంతో కథ ముగుస్తుంది.

సమకాలీన కళ్ళద్దాలు పెట్టుకొని చూస్తే ఈ గాథలో బ్రాహ్మణ వ్యతిరేకత (వర్ణ వ్యవస్థను ధిక్కరించి పల్లకిలో తిరగటం), సామ్రాజ్య వ్యతిరేకత, భూస్వామ్య వ్యతిరేకత, దళితబహుజన రాజ్యాధికార సాధన లాంటి ఊహలు అనేకం కనిపిస్తాయి.

ఉద్వేగాలను నింపుకొన్న గాథలు ప్రాచుర్యం పొందాకా చారిత్రిక వాస్తవాలు మసకబారుతాయి అనేది నిష్ఠురసత్యం.

## చరిత్ర రికార్డులలో సర్వాయి పాపన్న (1650-1710)

### 1. ఆనాటి రాజకీయ పరిస్థితులు

సర్వాయి పాపన్న 1695 నుంచి 1710 మధ్యలో క్రియాశీలకంగా ఉన్నాడు. ఔరంగజేబు 1687లో గోల్కొండను వశపరచుకొని గోల్కొండ రాజు అబుల్ హసన్ ను బంధీగా తీసుకొనిపోయి దక్కనును నేరుగా ఢిల్లీ పాలనలోకి తీసుకొచ్చాడు. స్థానికేతరులు అధికారులుగా రావటంతో స్థానిక జమిందార్లు, కులీనులు అసంతృప్తితో ఉండేవారు. పన్నుల భారం అధికమైంది. కరువుకాటకాలు చుట్టుముట్టాయి. ఈ కాలంలో మొఘల్ సామ్రాజ్యం రాజకీయంగా చాలా ఒడిదుడుకులను ఎదుర్కొన్నది. అప్పటికే ఔరంగజేబుకు తొంభై ఏళ్ళు దాటాయి. ఇక చక్రవర్తి రేపోమాపో మరణిస్తాడని దేశం అంతా ఎదురుచూసే పరిస్థితి. వారసత్వ పోరు ఉండనే ఉంది. సామంతులు ఎవరి మట్టుకు వారు స్వతంత్రతను ప్రకటించుకొనే ఆలోచనల్లో ఉన్నారు. కేంద్రంలో కానీ, స్థానీయంగా కానీ బలమైన నాయకత్వం లేదు.

పరిస్థితి ఎంతలా ఉండేదంటే ఔరంగజేబు 1700లో Riza Khan అనే సైనికాధికారిని, బీదరు అల్లర్లను కట్టడి చేయమని పంపిస్తే అతను ఇక్కడకు వచ్చి స్వతంత్రాన్ని ప్రకటించుకొని, సమీప సంస్థానాలను ఆక్రమించుకొని, గ్రామాలను దోచుకొంటూ ఆ ప్రాంతాన్ని ఒక నియంతలా ఏలటం మొదలెట్టాడు.

### 2. పాపన్న రంగ ప్రవేశం

ఇలాంటి అస్థిర పరిస్థితులలో సర్వాయి పాపన్న తెరమీదకు వచ్చాడు. వరంగల్ కు ఇరవై కిలోమీటర్ల దూరంలో ఉన్న తరికొండ గ్రామంలో పాపన్న జన్మించాడు. 1690ల ప్రాంతంలో పాపన్న ధనికురాలైన తన విధవ సోదరిపై దాడిచేసి ఆమె ధనాన్ని గ్రహించాడు. ఈ డబ్బుతో కొంతమంది అనుచరులను కూడగట్టుకొని తరికొండపై చిన్న దుర్గాన్ని నిర్మించుకొన్నాడు. అలా పాపన్న నాయకత్వంలో ఈ దండు, దుర్గంలో ఉంటూ రాజమార్గం (Highway)పై హైదరాబాదువైపు వెళ్ళే వ్యాపారస్తులను, ధనిక పరివారాన్ని అటకాయించి దోపిడీలు చేసేది. ఇది చూసిన స్థానిక నాయకులు పాపన్నని తరిగొండనుంచి తరిమేసారు. అక్కడనుంచి వందమైళ్ల పారిపోయి వెంకటరావు అనే జమిందారు వద్ద జమాదారుగా (head of peons) చేరాడు పాపన్న. అక్కడ కూడా పాపన్న తన పాతపద్ధతులలో దారిదోపిడీలు చేస్తున్నట్లు తెలుసుకొన్న వెంకటరావు ఇతన్ని ఖైదు చేయించాడు. వెంకటరావు భార్య, తనబిడ్డకు అస్వస్థత తగ్గాలని ఖైదీలనందరినీ విడిపించిన సందర్భంలో పాపన్న కూడా విడుదలై తిరిగి జనజీవనంలోకి వచ్చాడు.

### 3. పాపన్న దురాగతాలు

పాపన్న తన పుట్టిన ఊరు సమీపంలో షాపూర్ (Shahpur) అనే ప్రాంతాన్ని తన నివాసంగా చేసుకొని మరలా దారిదోపిడీలు కొనసాగించాడు. ఇక్కడ ఇతనికి సర్వాయి అనే మిత్రుడు తగిలాడు. వీరిద్దరి స్నేహం బలపడి కొండపై ఒక బలమైన దుర్గాన్ని నిర్మించి మరిన్ని అరాచక కృత్యాలు చేయటం మొదలెట్టారు. వీరి చర్యలకు ముస్లిమ్, హిందువులు ఇద్దరూ కూడా బాధితులుగా ఉండేవారు. ఈ విషయాలు కొంతమంది ఔరంగజేబుకు తెలియచేయటంతో అతను కాసింఖాన్ అనే సేనాధిపతిని పాపన్నని తొలగించమని పంపించాడు. పాపన్నని పట్టుకోవటానికి వెళ్ళిన కాసింఖాన్ ను పాపన్న అనుచరులు చంపేయటంతో వీరు మరింత విజృంభించటం మొదలెట్టారు.

1702లో గోల్కొండ డిప్యూటి గవర్నర్ రుస్తుం దిల్ ఖాన్ స్వయంగా పాపన్నని అంతమొందించటానికి షాపూర్ వచ్చి రెండునెలలపాటు పాపన్న బృందంతో పోరాడాడు. ఈ

పోరాటంలో పాపన్న, సర్వాయిలు తప్పించుకోగా, రుస్తుం దిల్ ఖాన్ కోటను ధ్వంసం చేసి హైదరాబాదు తిరిగి వచ్చేసాడు.

రుస్తుం దిల్ ఖాన్ వెళిపోయాక పాపన్న, సర్వాయిలు తిరిగి వచ్చి కోటను మరింత విస్తరించి కట్టుకొని తమ కార్యకలాపాలు కొనసాగించటం మొదలెట్టారు. ఇదే సమయంలో పాపన్న అనుచరులు– సర్వాయికి, పుర్దిల్ ఖాన్ కి మాటామాటా వచ్చి కొట్టుకొని ఇద్దరూ హతమవటంతో పాపన్న నాయకత్వానికి తిరుగులేకుండా పోయింది. పాపన్న బృందం సమీపంలో ఉన్న కోటలను ముట్టడించి ఆక్రమించుకోసాగింది.

1706లో రుస్తుం దిల్ ఖాన్ పాపన్నని నిలువరించమని పైన చెప్పిన Riza Khanను అభ్యర్థించాడు. బహుశా ముల్లును ముల్లుతో తీయాలని గోల్కొండ పాలకులు భావించి ఉంటారు. రిజాఖాన్ కొంతమంది సైన్యాన్ని పంపాడు. పాపన్న ముందు వీరు నిలువలేక వెనక్కి వచ్చేసారు.

ప్రజలనుండి వస్తున్న ఒత్తిడుల కారణంగా 1707లో గోల్కొండ డిప్యూటి గవర్నరు రుస్తుం దిల్ ఖాన్ పాపన్నని పట్టుకోవటానికి సైన్యంతో షాపూర్ వచ్చి పాపన్నతో తలపడ్డాడు. ఈసారి పాపన్న తెలివిగా భారీ ధనాన్ని రుస్తుం దిల్ ఖాన్ కు లంచంగా ఇచ్చి తప్పించుకొన్నాడు. రుస్తుం దిల్ ఖాన్ హైదరాబాదు వెళిపోయాడు.

**4. వరంగల్ కోటపై దాడి**

రుస్తుం దిల్ ఖాన్ కు లంచమిచ్చి తప్పించుకొన్న పాపన్న తనకు ఇక తిరుగే లేదని భావించి ఏప్రిల్ 1708లో మూడువేలమంది అనుచరులతో వరంగల్ కోటపై దాడి చేసి, వశపరచుకొని అపారమైన సంపద, వస్తువులను చేజిక్కించుకొని; వేలమంది ధనిక వర్గానికి చెందిన స్త్రీలను బంధీలుగా తనవెంట తీసుకొనిపోయాడు.

పాపన్న అనుచరులు వరంగల్ పట్టణాన్ని లూటీ చేసారు. వరంగల్ మేలుజాతి కార్పెట్లకు ప్రధాన వ్యాపార కేంద్రంగా ఉండేది. పెద్ద పెద్ద కార్పెట్లను తీసుకెళ్లలేక ముక్కలు చేసి పట్టుకెళ్లారు.

షాపూర్ కోటలో ఎత్తైన గోడలతో నిర్మించిన ప్రదేశంలో అపహరించిన స్త్రీలను, పిల్లలను బంధించారు. వీరిలో వరంగల్ పట్టణ న్యాయాధికారి భార్య, ఎనిమిదేళ్ల కూతురు కూడా ఉన్నారు. అపహరించినవారి బంధువులనుండి పెద్దమొత్తాలలో ధనాన్ని వసూలు చేయటానికి ధనవంతుల స్త్రీలను పిల్లలను పాపన్న ఎంచుకొనేవాడు.(ఆ ఎనిమిదేళ్ళ చిన్నిపాప తాత షా ఇనాయత్. ఇతను ఆనాటి సమాజంలో గౌరవనీయుడు. ఇతను డిల్లీ వెళ్ళి బహదూర్ షా వద్ద తనకు జరిగిన అన్యాయాన్ని చెప్పుకొన్నప్పుడు, బహుదూర్ షా పెద్దగా స్పందించలేదు. చేసేదేమీ లేక ఇతను ఇంటికి వచ్చి తన నౌకరులందరికీ కానుకలిచ్చి స్వేచ్ఛగా బ్రతకమని పంపించేసి కొద్దిరోజులకే బెంగతో చనిపోయాడు)

**5. బోనగిరి కోటపై దాడి**

వరంగల్ కోటపై చేసిన దాడిద్వారా పాపన్న విపరీతమైన ధనాన్ని కూడగట్టాడు. దీనితో ఆంగ్లేయులు, డచ్చివారినుండి 700 తుపాకులు కొన్నాడు. బంగారు పల్లకిలో తిరగటం మొదలెట్టాడు. చుట్టూ 700 మంది సాయుధులైన సైనికులను రక్షణగా పెట్టుకొన్నాడు.

ఆహారధాన్యాలు పెద్దఎత్తున కొంటానని పాపన్న ఒకరోజు వ్యాపారస్తులకు కబురు పెట్టి, వారి ధనాన్ని, వస్తువులను, బండ్లను, పదివేల పశువులను బలవంతంగా లాక్కొని, వారిని బంధించి ఖైదులో పడేయించాడు. ఆ పశువుల సాయంతో చుట్టుపక్కల ప్రాంతాలను సాగుచేయించటం మొదలుపెట్టాడు. వరంగల్ కోటదాడి తరువాత భోనగిరి కోటపై జూన్ 1708లో దాడి చేసాడు. ఈ సమయంలో తన అనుచరులకు– స్త్రీలను తీసుకొచ్చిన వారికి వెండినాణాలు, ఉన్నతవర్గ స్త్రీలను ఎత్తుకొచ్చినవారికి బంగారు నాణాలు ఇస్తానని చెప్పాడు. అలా భోనగిరి కోటదాడిలో సుమారు 2000 మంది స్త్రీలు అపహరింపబడ్డారు.

ఉన్నతవర్గాలు వైభవంగా జరుపుకొనే పెళ్ళిళ్లలో పాపన్న మెరుపుదాడులు చేసి స్త్రీలను అపహరించి, వారి బంధువులనుండి అధికమొత్తాలలో ధనాన్ని రాబట్టేవాడు. Kilpak అనే ప్రాంతపు జమిందారు పాపన్నకి లొంగనందుకు తన వద్ద బంధీగా ఉన్న అతని భార్య నాలుకను కోసి అతనికి కానుకగా పంపించి హెచ్చరించాడు.

ఈ దోపిడీలలో హిందువు ముస్లిమ్ అనే వ్యత్యాసం ఉండేది కాదు. అందువల్ల ముస్లిమ్ శ్రీమంతులు, తెలుగు జమిందార్లు పాపన్న అరాచకాలకు బలై, ఇతని పీడను ఒదిలించమని గోల్కొండకు మొరపెట్టుకొనేవారు.

**6. చక్రవర్తితో సన్మానం**

ఔరంగజేబు చనిపోయాక ఏర్పడిన వారసత్వపోరులో బహదూర్ షా సింహాసనాన్ని చేజిక్కించుకొన్నాడు. ఇది నచ్చని

బహదూర్ షా సోదరుడు Kam Bakhsh హైదరాబాదుకు స్వతంత్ర రాజుగా ప్రకటించుకొన్నాడు. ఇది విన్న బహదూర్ షా దక్కను వచ్చి అతనితో పోరాడి అంతమొందించి దక్కను సామ్రాజ్యానికి తన చక్రవర్తి స్థానాన్ని స్థిరపరచుకొన్నాడు. ఆ సందర్భంలో బహదూర్ షా హైదరాబాదు ప్రముఖులతో దర్బారు ఏర్పాటు చేసినప్పుడు పాపన్న 14 లక్షల రూపాయిలు కానుకగా ఇచ్చి బహుదూర్ షా చేత సన్మానం పొందాడు. (ఈ ఉదంతాన్ని రికార్డు చేసిన డచ్ రిపోర్టులో పాపన్న ప్రస్తావన den rover servapaper/bandit sarvayi papadu అని ఉంది.)

పాపన్న చేతిలో బలైనవారు ఈ చర్యతో తీవ్ర అసంతృప్తి చెందారు. ముఖ్యంగా పాపన్న వద్ద బందీలుగా స్త్రీలు, పిల్లల బంధువర్గాలు. వీరంతా కలిసి బహదూర్ షాకు తమ అసంతృప్తిని తెలియచేసారు. వారి విజ్ఞాపనల మేరకు హైదరాబాద్ నూతన గవర్నరైన Yusuf Khan కు పాపన్నని అంతమొందించమని ఆదేశాలిచ్చాడు చక్రవర్తి. Yusuf Khan తిరిగి ఆ పనిని Dilawar Khan అనే సేనాపతికి అప్పగించాడు.

1709 లో పాపన్న ఒక జమిందారుపై దాడిచేయటానికి వెళ్ళినపుడు షాపూర్ కోటలో పాపన్నచే బంధింపబడినవారు తిరుగుబాటు చేసి చెరనుంచి విడిపించుకొన్నారు. వీరందరికీ నాయకత్వం వహించింది పాపన్న బావమరిది కావటం విశేషం. పాపన్న భార్య తన భర్తలేనప్పుడు బంధీగా ఉన్న తమ్ముడికి, రహస్యంగా ఆకురాయిలను భోజనంలో దాచి అందించగా వాటి సహాయంతో అతను తన సంకెళ్లను తెంచుకొని మిగిలినవారిని కూడా విడిపించాడు. ఇది తెలుసుకొన్న పాపన్న షాపూర్ కోటకు వచ్చినపుడు అంతవరకూ బందీలుగా ఉన్నవారు కోటలోంచి ఫిరంగులు కాలుస్తూ పాపన్న అనుచరులపై ఎదురుదాడి చేసారు.

కోపోద్రిక్తుడైన పాపన్న ఆదేశాలతో– కోట గుమ్మాలను తగలపెట్టి, గేదెలను చంపి రక్తంతో తడితడిగా ఉన్న వాటి చర్మాలను తొడుక్కొని ఆ మంటలలోంచి కోటలోకి వెళ్లటానికి ప్రయత్నించారు అతని అనుచరులు. ఇదే సమయానికి దిలావర్ ఖాన్ తనసైన్యంతో పాపన్నని బంధించటానికి అక్కడికి వచ్చాడు. ఇలా రెండు వైపులనుండి దాడి ఎదురవ్వటంతో పాపన్న తరికొండ కోటకు పారిపోయాడు.

### 7. పాపన్న పతనం

దిలావర్ ఖాన్ పాపన్నని బందించటం విఫలమవటంతో యూసఫ్ ఖాన్, మార్చ్ 1710లో ఇరవై వేలమంది సైనికులను తీసుకొని తానే స్వయంగా తరికొండ కోటను చేరి పాపన్నతో తలపడ్డాడు. పాపన్న సైనికులకు యూసఫ్ ఖాన్ రెట్టింపు కూలి ఇస్తానని ప్రకటించటంతో అలసిపోయిన చాలామంది పాపన్నని విడిచి యూసఫ్ ఖాన్ సైన్యంలో చేరిపోయారు. పాపన్న కొద్ది నెలలు ప్రతిఘటించి, మందుగుండు అయిపోవటంతో మారువేషం వేసుకొని ఎవరికీ చెప్పకుండా రహస్యమార్గం ద్వారా కోటవిడిచి పారిపోయాడు. అప్పటికి అతని కొడుకులు ఇంకా యూసఫ్ ఖాన్ తో పోరాడుతున్నారు.

పాపన్న మారువేషంలో హసన్నబాద్ అనే గ్రామాన్ని చేరుకొని అక్కడ ఒక కల్లు దుకాణంలో కూర్చొని కల్లు కావాలని అడగగా, ఇతన్ని ఆ దుకాణదారుడు గుర్తుపట్టి సైనికులకు అప్పగించటం జరుగుతుంది. వాళ్ళు పాపన్నని బంధించి యూసఫ్ ఖాన్ వద్దకు తీసుకువెళ్లారు. దొంగిలించిన సొత్తు ఎక్కడదాచాడో చెప్పమని ఎంత హింసించినా పాపన్న ఏమీ చెప్పకపోవటంతో – పాపన్న తలనరకి బహదూర్ షా వద్దకు పంపించి దేహాన్ని హైదరాబాద్ గేట్ కు వేలాడదీయించాడు యూసఫ్ ఖాన్. అలా పాపన్న కథ 1710లో ముగిసింది.

**చారిత్రిక పాపన్నకి వీరగాథ పాపన్నకు ఎందుకు ఇన్ని వ్యత్యాసాలు?**

పాపన్న జీవితం వీరగాథగా మారటానికున్న కారణాలలో ముస్లింలపై తిరుగుబాటు అనే అంశం ప్రధానంగా వినిపిస్తుంది. కానీ పాపన్న అనుచరులలో హుస్సైన్, తుర్కా హిమాన్, కొత్వాల్ మీర్ సాహిబ్ లాంటి ముస్లిమ్ వ్యక్తులు ఉన్నారు. అంతేకాక పాపన్న దోపిడీ చేసినవారిలో ముస్లిమ్ ఫౌజ్ దార్ లతోపాటు అనేక మంది హిందూ జమిందార్లు కూడా ఉన్నారు. పాపన్న ప్రధాన అనుచరులైన సర్వాయి హిందువు, పుర్దిల్ ఖాన్ ముస్లిం. కనుక పాపన్న తిరుగుబాటు ప్రత్యేకించి ముస్లింల ఒక్కరిపైనే కాదని అనుకోవచ్చు.

పాపన్న అప్పటి అగ్రవర్ణ ఆధిపత్య వ్యవస్థపై తిరుగు బాటు చేసాడు అనేది మరొక కారణం. దీనికి ఆధారంగా– పాపన్న అనుచరులలో చాకలి సర్వన్న, మంగలి మన్నన్న, కుమ్మరి గోవిందు, మేదరి యెంకన్న, యెరికల చిట్టేలు, యానాది పశేలు వంటి బలహీన వర్గాల వ్యక్తులు ఉండటం కనిపిస్తుంది.

అప్పట్లో వ్యవసాయ పనులులేని రోజుల్లో సగం ప్రజలు ఖాళీగా ఉండేవారు. వీరందరూ పాపన్నని అనుసరించి ఉండొచ్చు అనే వాదనను త్రోసిపుచ్చలేం. అంతేకాక ఆనాటి సమాజంలో దొంగతనాన్ని వృత్తిగా కలిగిన కులాలు కూడా

ఉండేవి. వీరు పాపన్న నాయకత్వంలో నడిచారు. వీరికి పాపన్న వ్యవసాయ భూమిని ఇచ్చాడు. అందువల్ల వీరు పాపన్నని ఒక వీరుడిగా జ్ఞాపకం పెట్టుకొని ఉంటారు.

ఇక మరొకవాదన– పాపన్న సామ్రాజ్యవాదాన్ని ఎదుర్కొన్నాడు అనేది. J.A. Boyle, 1874లో సేకరించిన వీరగాథలో గోల్కొండను, బందరును కొల్లకొడతాను, బంగారు కడియాలు చేయిస్తాను అన్నపదాలు ఉన్నాయి. కొల్లకొడతాను అంటే దొంగతనం చేస్తాను అని అర్థం. బంగారు కడియాలు చేయిస్తాను అంటే అందులో వ్యక్తిగత లాభాపేక్ష తప్ప సామ్రాజ్య వాదాన్ని అంతమొందిద్దామనే ఉద్దేశాలున్నాయనటం అతిశయోక్తి. అంతేకాక ముఘల్ చక్రవర్తికి 14 లక్షల రూపాయిలు ఇంకా అనేక కాన్కలను ఇచ్చి వారి ప్రాపకం పొందాలని చూడటాన్ని సామ్రాజ్యవాదాన్ని ఎదుర్కోవటంగా ఎలా అర్థంచేసుకోవాలనే ప్రశ్న ఉదయించక మానదు. ముందుగా అనుకొన్నట్లు వీరగాథలనేవి కళాత్మకరూపాలు. కళకు చరిత్రను మోసే అవసరము, బాధ్యత ఉండదు.

**పాపన్నని సామాజిక బందిపోటు అనుకోవచ్చా?**

Eric Hobsbawn అనే చరిత్రకారుడు శ్రామిక వర్గాల తిరుగుబాట్లను విశ్లేషిస్తూ Social Bandit అనే ఒక పదాన్ని వాడాడు. అంటే రాబిన్ హుడ్ లా ధనికులను కొట్టి పేదలకు పెట్టే బాపతు అని.

ఈ వీరికి సిద్ధాంత నేపథ్యం ఉండదు. రాజకీయ, ఆర్థిక అస్థిర పరిస్థితులు తలెత్తినప్పుడు వీరు తెరపైకి వస్తారు. వీరికి మార్గం ముఖ్యం కాదు గమ్యం ప్రధానం. ఇలాంటి వ్యక్తుల చర్యలు హింసాపూరితంగా ఉండొచ్చు.

ఇలాంటివారిని రాజ్యం దోపిడిదారులుగా జమకడితే, సామాన్య జనం వీరులుగా కీర్తిస్తారు. వీరగాథలు అల్లుకొంటారు. పాపన్నని ఈ కోణంలోంచి చూస్తే ఆ కాలానికి ఒక ఉదాత్తపాత్ర పోషించిన ఒక Social Banditగా భావించవచ్చు.

**ఉపసంహారం**

పాపన్న జీవితాన్ని గమనిస్తే సొంత భార్య, బావమరిది, చివరలో ఇతని అనుచరులు, సాటి కులస్థుడైన కల్లు వ్యాపారి కూడా ఇతడిని మోసగించారని అర్థమౌతుంది. ఇది బహుశా అంతవరకూ పాపన్న చేస్తున్నది పులిస్వారీ అని అతని సన్నిహితులకు అర్థమై ఉంటుంది. అందుకనే అందరూ చివరలో తనని విడిచిపెట్టేసారు.

వాతావరణం, విద్యావిధానం, మూఢనమ్మకాలు, కట్టుకథల పట్ల మోజు లాంటి కారణాలవల్ల హిందువులలో చరిత్రపట్ల ఉదాసీనత, నిర్లక్ష్యము ఏర్పడ్డాయని అన్న మెకంజీ అభిప్రాయం నేటికీ ప్రాసంగికతను కోల్పోలేదు. అందుకనే దేవాలయాల స్థలపురాణాలకు ఉన్న ప్రాధాన్యత చారిత్రిక అంశాలకు ఉండదు.

బహదూర్ షాతో సన్మానం అందుకున్న తరువాత పాపన్న దొంగతనాలకు స్వస్థి చెప్పి తాను ఆక్రమించుకొన్న జమిందారీలను అనుభవించుకొంటూ ఉండినట్లయితే బహుశా రెడ్డి, వెలమ, నాయక రాజుల్లా ఒక రాజవంశాన్ని నిర్మించిన మూలపురుషుడిగా చరిత్రలో నిలిచిపోయేవాడేమో. అప్పుడు సర్వాయి పాపన్న వీరగాథ ఉండేది కాదేమో– అది వేరే విషయం.

(పై వ్యాసాన్ని ఇప్పటికి అందుబాటులో ఉన్న చారిత్రిక ఆధారాలను బట్టి నిర్మించిన నెరేటివ్ గా గ్రహించాలి తప్ప ఎవరి మనోభావాలను గాయపరచటానికి కాదని గ్రహించ ప్రార్థన–రచయిత)

**References :**


1. A Social History of the Deccan, 1300-1761 edited By Richard M. Eaton, Chapter 7 Papadu (F L.1695-1710): Social Banditry In Mughal Telangana.

2. J. F. Richards and V. Narayana Rao, Banditry in Mughal India: Historical and Folk Perceptions.

3. Khafi Khan, Muntakhab al-lubab (Calcutta, 1874).

4. The Indian Antiquary, A Journal Of Oriental Research. Telugu Ballad Poetry By J. A. Boyle, Esq., Mos.

5. The Mughal State 1526-1750 Edited By Muzaffar Alam Sanjay Subrahmanyam

6. సర్వాయి పాపన్నపై వికీపీడియా వ్యాసం

7. సర్దార్ సర్వాయి పాపన్న, దళిత బహుజన వీరుడు, కొంపెల్లి వెంకట్ గౌడ్.



★ **రచయిత: అసిస్టెంట్ ప్రొఫెసర్, డిగ్రీ కళాశాల** T

# లంబాడా జీవితాల చిత్రిక "యాడి" కథలు

గజవెల్లి ఈశ్వర్

**పరిచయం**

వెయ్యేళ్ల తెలుగు సాహిత్యంలో ముప్పావు వంతు సాహిత్యానికి కొన్ని వర్గాలవారే ప్రాతినిధ్యం వహించారు. ఆ చీకటి సాహితీయుగం నుంచి క్రమక్రమంగా బయటపడి అస్తిత్వవాద సాహిత్యం వెలువడిన తర్వాత కూడా బలహీన వర్గాలలో మరీ బలహీనంగా ఉన్న ప్రజా సమూహాలు తమ అస్తిత్వాన్ని చాటుకునేలా బలమైన సాహిత్యాన్ని సృష్టించే పని చేయలేదు. అలా చేయని ప్రజా సమూహాలలో దివ్యాంగుల అస్తిత్వ సాహిత్యం, గిరిజన సాహిత్యం, ట్రాన్స్ జెండర్ అస్తిత్వ సాహిత్యం, దళిత ఉపకులాల సాహిత్యం మొదలైనవి. ఇవి అనుకున్నంత లేదా ఆశించినంత మేర ప్రధాన సాహితీ స్రవంతిలోకి రాలేదు. ఇప్పుడిప్పుడే ఆయా వర్గాల నుండి కొత్తగా, బలంగా కొందరు రచయితలు పుట్టుకొస్తూ ఆ లోటును పూడ్చే ప్రయత్నం చేస్తున్నారు. మానవ నాగరికతా మకిలి అంటకుండా అడవుల్లో, కొండల్లో, కోనల్లో ఉండే గిరిజనుల జీవితాలు అడుగడుగునా ఆసక్తికరంగా, వైవిధ్యభరితంగా ఉంటాయి. ప్రకృతితో మమేకమై స్వచ్ఛంగా జీవించేవారి జీవితాలను, నాగరికతవల్ల వచ్చిన మార్పులు ఎలా అతలాకుతలం చేశాయో అద్భుతమైన కథల రూపంలో మన ముందుకు తీసుకువచ్చారు డా. అజ్మీర సిల్మా నాయక్. ఈ కథల సంపుటికి రచయిత పెట్టిన పేరు "యాడి". అంటే "అమ్మ" అని అర్థం. ఇది 2023 అక్టోబర్లో మొదటి ముద్రణ పూర్తి చేసుకుంది. నిఖార్సయిన లంబాడీ జీవితాలని కళ్ళ ముందు ఉంచే 12 కథలతో, 90 పేజీలలో గిరిజన జీవితాలని కళ్ళ ముందు ఆవిష్కృతం చేశాయి ఈ కథలు. అచ్చం అమ్మ మనల్ని దగ్గరకు తీసుకొని కథ చెప్పినట్టుగా ఉంటుంది ఈ కథలను చదువుతుంటే.




కథా రచయిత డా. అజ్మీర సిల్మా నాయక్ వృత్తిరీత్యా తెలుగు అధ్యాపకుడు. ప్రవృత్తి రీత్యా సామాజిక చింతన కలిగి, నిరంతరం సమాజ చైతన్యం కోసం పాటుపడే నిరంతర అధ్యయనశీలి, ఆలోచనకర్త. సాహితీ సమాజంలో గిరిజన వాణిని బాణిని బలంగా వినిపింపజేయాలనే దృఢ సంకల్పం కలిగిన గిరిజన రచయిత సిల్మా నాయక్. ఈ యాడి కథలలో ఆ ప్రయత్నం అడుగడుగునా కనిపిస్తుంది. కథలు చదువుతూ ఉన్నప్పుడు కథా రచయిత ఎంచుకున్న కథా వస్తువు మనకు చిరపరచితం అనిపించినా కథాగమనం, కథ మలుపు తీసుకున్న విధానం గమనిస్తే మన ఊహల్లో ఉన్న కథాగమనం చెదిరిపోయి కథను కొత్తదారుల్లోకి మళ్లించే రచయిత నేర్పు మనల్ని అబ్బురపరుస్తుంది. రచయితపై లోగడ ఏ కథా రచయిత ముద్ర గాని, ఏ సాహిత్యకారుని ప్రభావంగాని లేనట్టు అనిపించే రచనాశైలి ప్రత్యేకంగా కనిపిస్తుంది. కథను తన శైలిలో, తనదైన కథా నిర్మాణంతో, తనకే ప్రత్యేకం అయిన ఊహాకల్పనతో ఉన్నది ఉన్నట్టు లేదా జరిగింది జరిగినట్టుగా పాఠకునికి దృశ్యమానం చేయడంలో రచయిత సఫలీకృతమైనట్టుగా చెప్పవచ్చు.

Scanned with ACE Scanner

ఈ 12 కథల్లో రచయిత ఎంచుకున్న కథావస్తువు 'బంజారా జీవితం'. బంజారాలు ప్రత్యేకమైన సంస్కృతి నేపథ్యం ఉన్న ప్రజలు. గొప్పదైన బంజారా సంస్కృతితోపాటు సారావంటి మహమ్మారి బంజారా జీవితాలతో పెనవేసుకొనిపోయి ఉంది. ఇలా బంజారా జీవితాలను ఛిద్రం చేసే కొన్ని ఆచారాలను, పద్ధతులను ఈ కథలలో విస్తృతమైన చర్చకు పెట్టాడు రచయిత. ఇప్పపువ్వు సారా కాయడం, నాటు సారా తాగి ఆరోగ్యాలు పాడు చేసుకోవడం, అవగాహన లేక ఎక్కువ మంది పిల్లల్ని కనడం, ఆడపిల్లల్ని అమ్ముకోవడం, రియల్ ఎస్టేట్ దందాలో పడి ఉన్న ఆస్తుల్ని కోల్పోవడం వంటి సమస్యలు మనకు ఈ పుస్తకంలోని ప్రతి కథలోనూ కనిపిస్తాయి.

పాత్రోచితమైన, సహజమైన మాటలతో, సంభాషణలతో ఈ సమస్యలను చర్చకు పెట్టి అవి తప్పు అని ముక్తాయింపు ఇస్తాడు రచయిత. సమస్య మూలాలను చర్చిస్తూ, వాటి ద్వారా బంజారాలు ఎలా తమ బ్రతుకుల్ని నాశనం చేసుకుంటున్నారో వివరిస్తూ, కథ చివరిలో వాటికి పరిష్కార మార్గం చూపిస్తూ ముక్తాయింపు ఇవ్వడం ద్వారా కథలు ఒక ఆశావాహ దృక్పథంతో ముగిస్తూ పాఠకునికి ఆహ్లాదాన్ని, ఆలోచనను కలిగిస్తాయి. పాత్రల మధ్య సంభాషణలతో తాను చెప్పదలుచుకున్న విషయాన్ని చెబుతూనే కథాగమనంలో ఎక్కడా కృత్రిమత్వం రాకుండా జాగ్రత్త పడతారు రచయిత.

"ఏం పని మీద వెళ్తున్నారు సరుకులు తేవడానికా?" అంది భీక్రి.

"సర్కులకు కాదు, ఈ చంటిదాన్ని అమ్ముకొద్దామని.." అన్నారు వాళ్ళు జంకు బొంకు లేకుండా.(పుట 51, యాడి కథలు)

ఏమాత్రం లౌక్యం లేకుండా పిడాత మాటలు విడిచిపెట్టే బోలాతనం బంజారాలలో ఉంటుంది. చంటిపిల్లని అమ్మడానికి వెళ్తున్నాం అని జన్మనిచ్చిన తల్లే ఏ సంకోచం, జంకూ లేకుండా చెప్పడం మనల్ని ఆశ్చర్యపరుస్తుంది. కానీ అలా చిన్న పిల్లలని అమ్మడం నేరమని, దాన్ని అలా పబ్లిక్ గా మాట్లాడకూడదు అని తెలియని అమాయక బంజారా తల్లి ఆమె. మగ పిల్లవాడు పుట్టాలి అని పట్టుబట్టి వరుసగా ఆరుగురు ఆడపిల్లలకు జన్మనిచ్చి, పోషించడం ఇబ్బందిగా మారి, కన్నపేగును అంగట్లో అమ్మకానికి పెట్టిన అమాయక తల్లి కథే "రక్త చరిత్ర".

నల్గొండ, మహబూబ్‌నగర్, వరంగల్ తండాలలో శిశువులను అమ్ముకున్నటువంటి కదు పేదరిక విషాద గాథలను దినపత్రికలలో, వార్తా ఛానెల్లో ఎన్నోసార్లు చూశాం. ఇప్పటికీ కొన్ని జిల్లాల్లోని మారుమూల తండాలలో ఆ దురాచారం ఇంకా ఉంది. అత్యంత పేదరికంతో పిల్లల్ని సాకలేని బంజారాల బలహీనతని ఆసరాగా చేసుకుని చిన్నపిల్లల్ని ముంబై, ఢిల్లీ వంటి మహానగరాలకు అక్రమంగా ఎగుమతిచేసే దళారీ వ్యవస్థలు ఇంకా తండాల చుట్టూ గద్దల్లా తిరుగుతూ ఉండడం విచారకరం. ఈ పేద బంజారాల తెలియనితనాన్ని చాలా శుద్ధంగా ఈ "రక్తచరిత్ర" కథలో తెలియజేస్తాడు రచయిత.

బంజారాలలో ఎక్కువ మంది చేతబడి, బాణామతి వంటి వాటిని నమ్మి, జబ్బుల బారిన పడ్డప్పుడు భూత వైద్యుని దగ్గరకు తీసుకెళ్లి ప్రాణాల మీదకు తెచ్చుకుంటారు. సకాలంలో సరైన వైద్యం అందక ప్రాణాలు కోల్పోయేవారే ఎక్కువ. ధనం, ప్రాణం రెండూ నష్టపోయి జీవితాన్ని కష్టాలపాలు చేసుకుంటారు. అలా చేయకూడదు అని డాక్టర్ శ్రీరాములు పాత్ర ద్వారా "యాడి" కథలో చెప్పిస్తాడు రచయిత.

"...నీ భార్యకు గుండె జబ్బు ఉన్నది. అది నయం అయ్యేది కాదు. నీవు అనవసరంగా మంత్ర తంత్రాలను, బాణామతిని నమ్మొద్దు. చిన్నపిల్లలు ఉన్నారు జాగ్రత్త" అంటూ బాలు నాయక్ కి చెప్తాడు డాక్టర్. (పుట 86, యాడి కథలు)

గంపెడు సంతానం ఉన్న బాలు నాయక్ కుటుంబంలో ఇంటికి నిట్టాడులాంటి ఇంటావిడ చనిపోతే ఆ ఇంటి పరిస్థితి ఎలా చిందర వందర అవుతుందో, పిల్లల ఆలనా పాలనా చూడడంకోసం బాలు నాయక్ రెండో పెళ్లి చేసుకుంటే వచ్చిన మర్మన్న తల్లి పిల్లలను సరిగ్గా చూడక చిన్న పిల్లలైన శీను, కాంతిలు ఎంతగా అల్లాడుతారో "యాడి" కథలో చాలా హృద్యంగా చెప్పాడు రచయిత. ఈ కథ చదువుతున్నంతసేపు తల్లి ద్వాల్లి భాయి, చిన్నపిల్లలు మన కళ్ళముందు మెదులుతూ కన్నీరు తెప్పిస్తారు. ఈ కథలోని చిన్న కొడుకు శీను పాత్ర స్వయంగా రచయితే కావడం ఈ కథకు బిగువును చేకూర్చింది. నేటికీ తండాల్లో కుటుంబ పెద్ద చనిపోతే మారుమనువు చేసుకోవడం, తత్ఫలితంగా కుటుంబాలు పెను మార్పులకు, కుదుపులకు లోను కావడం మనకు కనిపిస్తానే ఉంటుంది.

"చిటపట చినుకులు పడుతుంటే గబగబా నాలుగు అడుగులు వేస్తూ ఇంటి దారి పట్టిండు. వాన మెల్లగా ఎక్కువయ్యింది. ఎండకు ఎండి నెర్రలు వారిన నేల దాహం తీర్చుకుంటుంది. చిన్నపాటి వరదకు లోపలికి పోయిన నీరుతో వేడివేడి ఆవిర్లు బయటికి వస్తున్నాయి. దాంతో కమ్మని మట్టి వాసన, చల్లనిగాలి తగిలేసరికి భూమి పోయిన బాధ మర్చిపోయిండు లాల్య." (పుట 59, యాడి కథలు)

"లేలేత సూర్య కిరణాలు చీకటిని తరుముతున్నట్లు బాలభానుడు భూమిలో నుండి పైకి వస్తున్నాడు. గంప కింద ఉన్న కోళ్ల గుంపు ఒక్కసారిగా సినిమాహాల్లోని జనంలాగా బయటికి వచ్చి, రెక్కలు విదల్చి టపటపమంటూ ఎగురుతున్నట్లు అలసటను తీర్చుకుంటున్నాయి. చిందరవందరంగా ఉన్న గడ్డిలో చిన్నచితక గింజల్ని వెతుక్కుంటూ కాళ్లతో గడ్డిని అటు ఇటు తవ్వుతున్నాయి కోళ్లు. గడ్డి, మూతికి అందక లేగలు తండ్లాడుతున్నాయి.(పుట 53, యాడి కథలు)

ఇలాంటి గ్రామీణ వాతావరణం కళ్ళకుకట్టే వర్ణనలు ఈ కథల నిండా కోకొల్లలుగా కనిపిస్తాయి. రచయిత బాల్యమంతా తండాలలో గడవడం మూలాన పల్లె వాతావరణాన్ని అంత సహజంగా వర్ణించగలిగారు. పై వర్ణనలో కోళ్లు, కోళ్లగూటి నుంచి బైటకి ఎలా వస్తాయి, వచ్చాక అవి ఎలా ప్రవర్తిస్తాయి, ఎటు వెళతాయి, ఆహారాన్ని ఎలా తవ్వుకుని బుక్కుతాయి అనే సూక్ష్మ విషయాలని కూడా కళ్ళకి కట్టినట్టు వర్ణించాడు రచయిత.

రచయితకు గాని, కథకునికి గాని ఎంతటి భాషాపటిమ ఉన్నా పరిసరాలను నిశితంగా పరిశీలించి ఆ పరిశీలన అనుభవాన్ని రమణీయంగా రచనలోకి తీసుకురాలేకపోతే రచన తేలిపోతుంది. యాడి కథల్లో రచయిత వర్ణించిన ఊరి వాతావరణం మనందరి స్మృతి ఫలకాలలో నిక్షిప్తమై ఉన్న మన ఊరి జ్ఞాపకాలను తట్టి లేపుతుంది. రచయిత సిల్మా నాయక్‌కు ఉన్న నిశిత పరిశీలన, భావనాశక్తికి ఈ వర్ణనలు నిదర్శనంగా నిలుస్తున్నాయి.

బంజారాలు తరతరాలుగా మారుమూల తండాలలో అటవీ ప్రాంతాలలో నివసించే అమాయక ప్రజలు. నాగరికత పెరుగుతున్న కొద్దీ వారు నగర జీవనానికి అలవాటుపడుతూ వస్తున్నారు. ఈ క్రమంలో వారు విశాల ప్రజాసమూహాలుగా ఉన్న నాగరీకుల చేతిలో మోసం చేయబడడం అనేది తరచూ జరుగుతూ వస్తుంది. ఊరి పటేల్, దొర, ఖామందు, యజమాని... పేరు ఏదైనా బంజారా ప్రజలను దోచుకోవడంలో మోసం చేయడంలో వీరందరి రూపం మాత్రం ఒకటే.

ఆ విషయాన్ని యాడి కథల్లో విపులంగా చెబుతాడు రచయిత. తన భూమిని కౌలుకు చేస్తున్న "లాల్య" అనే బంజారా రైతుకు దొంగ లెక్కలతో లక్ష రూపాయలు అప్పు ఉన్నట్టు తేల్చిన "రాజారెడ్డి పటేల్", లాల్య దగ్గర ఉన్న అందమైన బలమైన కాడెద్దుల్ని కాజేయాలని కుట్ర పన్నుతాడు.

"ఏం లేదురా ఆ లక్ష రూపాయల కింద నీ ఎకరం భూమినన్న నాకు ఇచ్చేయ్, లేదా నీ కోడెలనన్న అప్పు కింద జమ కట్టు, బే బాకీ అయితది" చెప్పిండు రాజారెడ్డి పటేల్. (పుట 58, యాడి కథలు)

అమాయకుడైన గిరిజన రైతు నుంచి కౌలు, అప్పు పేరిట ఉన్నభూమిని కాడెద్దుల్ని లాక్కునే ప్రయత్నం ఎలా చేస్తారో వివరించిన కథ "కాడెద్దులు". అత్యంత విలువైన, అరుదైన, అడవిలో తప్ప బయట దొరకని అటవీ ఉత్పత్తుల్ని గిరిజనుల నుంచి తీసుకొని, వారికి తక్కువ మొత్తంలో ధనం లేదా ఇతర చౌక వస్తువుల్ని అంటగట్టి మోసం చేయడం ఎప్పటినుంచో జరుగుతున్నది. ఈ మోసాలు అనేక రకాలుగా ఉన్నాయని యాడి కథలలో చెప్తాడు రచయిత.

రియల్ ఎస్టేట్ రంగం పుంజుకున్న తర్వాత ఆ రంగంలో పెట్టుబడి పెట్టినవారు అనతికాలంలోనే కోటీశ్వరులు అవ్వడం మన కళ్ళముందు నేటికీ జరుగుతున్నది. అలా రియల్ ఎస్టేట్ రంగంలో కోట్లు గడించిన రాజ్యా నాయక్ పట్నం నుండి వచ్చిన పెట్టుబడిదారుల సోపతి పట్టి "రాజుగారు" ఎలా అయ్యాడు? చివరికి అదే పెట్టుబడిదారుల మాయమాటలు నమ్మి సంపాదించిన సొమ్మంతా పోగొట్టుకొని "బికారిలా" ఎలా అయ్యాడు? అనే విషయాన్ని ఆసక్తికరంగా వివరించిన కథ "దమ్మున్నోడు".

"...రాజుగారు మీరు హీరో అవడం కంటే నిర్మాత అయితే బాగుంటుందండి. ఎందుకంటే నిర్మాత అయితే మీరు పెట్టిన పెట్టుబడికి రెట్టింపు వస్తుంది" అని ఆశ కల్పించారు. నిర్మాత అంటే ఏమిటో తెలియని రాజ్యా నాయక్ "సరే సార్లు మీరు ఎట్లా అంటే గట్లనే" అన్నాడు.( పుట 22, యాడి కథలు)

అమాయకుడైన రాజ్యానాయక్ చేత సినిమాలలో నిర్మాతగా పెట్టుబడి పెట్టించి నిలువునా ముంచే విధం ఈ కథలో ఉంటుంది.

బంజారాలు సహజంగానే స్ఫురద్రూపులు. ఎర్రగా, ఎత్తుగా, బలిష్టంగా, అందంగా సినిమా నటులకు ఏమాత్రం తీసిపోని శరీర సౌష్టవం సహజంగానే వారికి వస్తుంది. సినిమా పరిశ్రమ ఆసుపాసులు తెలియని బంజారాలు అమాయకంగా వచ్చి హైదరాబాద్ ఫిలింనగర్, కృష్ణానగర్‌లో ఎన్నో కష్టాలు పడడం చివరకు జీవితాన్ని అన్ని రకాలుగా నష్టపోవడం చూస్తూ ఉంటాం. ఆ కోవలోనిదే సినిమారంగంలో పెట్టుబడులు పెట్టి, సర్వం కోల్పోయి మళ్ళీ పూర్వస్థితికి వచ్చిన రాజ్యానాయక్ వ్యథే "దమ్మున్నోడు" కథ.

ప్రపంచాన్ని అనేక సమస్యలు గడగడలాడిస్తున్నప్పటికీ నేటికీ, రేపటికీ, ఏనాటికీ, పరిష్కారం అవ్వనటువంటి ఒక జఠిలమైన సమస్యగా మారిపోయినటువంటి సమస్య వాతావరణ కాలుష్యం. పచ్చని చెట్లు, స్వచ్ఛమైన గాలి నేటికీ నగరవాసులకు అందని మ్రానిపండులాగానే ఉంది. ఒకప్పుడు పచ్చని చెట్లతో, మూసీ నది ప్రవాహాలతో స్వచ్ఛమైనటువంటి నగరంగా పేరు పొందిన భాగ్యనగరం నేడు మురికి కూపంలాగా మారిపోయింది. నగరం నడిబొడ్డున ఉన్న హుస్సేన్ సాగర్ ఒకప్పుడు మంచినీళ్లకు ఆలవాలంగా ఉన్న ఒక మంచినీటి కాసారం. కానీ నేడు నగరంలో ఉన్నటువంటి మురికినంతటిని తన గర్భంలో దాచుకొని పురిటి నొప్పులతో బాధపడుతున్న మురికిగుంటలా కనిపిస్తుంది. ఈ సమస్య ప్రభుత్వాలకు పరిష్కారం చూపలేనటువంటి జఠిల సమస్యగా మారింది. ఈ సమస్యను ఇతివృత్తంగా చేసుకొని "బుద్ధగణపతి" అనే కథద్వారా రచయిత చాలా సునిశితమైన సంభాషణలతో హుస్సేన్ సాగర్ బుద్ధున్ని, ఖైరతాబాద్ గణేశున్ని, బాలాపూర్ గణేశున్ని పాత్రలుగా పెట్టాడు. ట్యాంక్ బండ్ పరిసరప్రాంతాల్లో ఉన్న చెట్లను కేంద్రంగా చేసుకొని ఈ సమస్యను ఒక చక్కని కథ రూపంలో మన ముందుకు తీసుకువచ్చాడు.

"...ఇద్దరు గణపతులు ఒక్కసారిగా ముక్కు మూసుకున్నారు. ఛీ పాడు మురికి వాసన ఎట్లా భరిస్తున్నారు ఈ నగరవాసులు? ఇన్ని రోజులు ధూప దీప నైవేద్యాలతో మంచి సువాసనతో పూజలు చేసిన ఈ నరులు చివరికి మనల్ని మురికి నీళ్లలో పడేసి పోతున్నారు" అనుకుంటూ ముక్కు మూసుకున్నారు గణపతులు.

నీళ్ల మధ్యలో ఉత్సవ విగ్రహంలాగా నిలబడిన బుద్ధుడు వీళ్లను చూసి పకపక నవ్వుకున్నాడు. "చూడండి గణేశులారా మీరు సంవత్సరానికి ఒక్కసారే అలా వచ్చి ఇలా ఈ మురికిలో కరిగిపోతారు. నేను గత కొన్ని సంవత్సరాలుగా ముక్కు మూసుకొని ఇక్కడే తపస్సు చేసుకుంటూ ఉన్నాను. అయినా ఈ మురికి వాసన రోజురోజుకూ ఎక్కువ అవుతుందేతప్ప తక్కువ కావడంలేదు. మరి నేను ఎలా భరించాలి?" అన్నాడు బుద్ధుడు. "అవునూ, మరి ఇన్నాళ్లు నువ్వు ఈ పక్కనే ఉన్న సచివాలయంలో ఉండే రాజకీయ నాయకులకు నీ సమస్యలు చెప్పలేదా?" అన్నారు ఇద్దరు గణేశులు. బుద్ధుడు చిరునవ్వు నవ్వి "ఈ మనుషులకు నేను ఎన్నిసార్లు విన్నవించినా నా గోడు పట్టలేదు. లాభం లేదని నోరు మూసుకొని ఇలాగే ఉండిపోయిన. నా మీద ఎవరికీ జాలి లేదు." అన్నాడు బుద్ధుడు. (పుట 62, "యాడి" కథలు.)

పైకి ఈ సంభాషణలు చాలా సాధారణమైన సంభాషణలుగా కనిపించినా అంతరార్థంలో వీటి లోతు చాలా ఎక్కువ. జంట నగరాల తాగునీటి అవసరాలను, సాగునీటి అవసరాలను తీర్చేటువంటి సామర్థ్యం కలిగిన హుస్సేన్ సాగర్ నేడు పనికిరానటువంటి కలుషితమైన జలాశయంగా మారిపోవడం నిజంగా ఈ సమస్య పైన ప్రభుత్వాలకు ఉన్నటువంటి చిత్తశుద్ధిని శంకించాల్సి వస్తుంది. ప్రభుత్వాలు ఎన్ని మాటలతో కోటలు కట్టి, హుస్సేన్ సాగర్ ను మంచినీటిగా మార్చి చెంబుతో మంచినీళ్లు తాగుతాం అని చెప్పి ప్రకటనలు గుప్పించినా అవి కేవలం మాటల వరకే ఉన్నాయి కానీ ఆచరణకు నోచుకోలేదు అనేది కఠిన వాస్తవం. హుస్సేన్ సాగర్ జలాశయ శుద్ధి అనేది హైదరాబాద్ కి చాలా అవసరం. ఈ అంశంపై తెలుగు కవులు అందులో భాగ్యనగరంలో ఉన్న కవులు కవయిత్రులకి ట్యాంక్ బండ్ విహార రాతలపై ఉన్న శ్రద్ధ, మురుగునీటి శుద్ధిపై ఏమైనా నాలుగు రాతలు రాద్దాం అనే సోయి ఉన్న సాహితీకారులు అంతగా కనిపించరు. నిజానికి ఇది కవులు బలంగా రాయాల్సిన అంశం. సాగర్ శుద్ధిపై ప్రభుత్వాల చిత్తశుద్ధికి ఈ కథ ఒక చెంపపెట్టు లాగా మనకి కనిపిస్తూ ఉంది. నిజానికి ఇంత అందమైనటువంటి నగరం మధ్యలో ఉన్న ఇంత పెద్ద జలాశయం మంచినీటి జలాశయంగా ఉంటే భారతదేశంలోనే ఒక గొప్ప జలాశయంగా సాగునీటి తాగునీటి అవసరాలను తీర్చే ఒక భాగ్యనగర వరప్రదాయనిగా ఉండేది. నిజంగా హుస్సేన్‌సాగర్ అలా మంచినీటి సరస్సులాగా మారితే భాగ్యనగరపు రూపురేఖలు, భాగ్యనగర అభివృద్ధి మరో మెట్టుకు

చేరుకుంటుందనడంలో సందేహం లేదు. రచయిత ఈ "బుద్ధగణపతి" కథద్వారా హుస్సేన్ సాగర్ ను శుద్ధం చేసి ఆ నీటిని తాగు సాగు అవసరాలకు వినియోగించే చిత్తశుద్ధిని ప్రభుత్వాలు కనబరచాలి అని కోరుకున్నాడు. ఇది ఒక కొత్తదైన శిల్పంతో, ఒక కొత్తదైన ప్రయోగంతో చేసిన కథగా మనం గమనించాలి.

"దున్నేవాడిదే భూమి పండించే వాడిదే పంట" అన్నారు వామపక్షవాదులు. కానీ తెలంగాణ ప్రాంతంలో కౌలు రైతులకు ఈ సిద్ధాంతం ఆమడ దూరంలోనే ఆగిపోయింది. ఆరుగాలం కష్టించి పనిచేసిన పంటను కౌలు సొమ్ము పేరుతో, ఇచ్చిన అప్పు పేరుతో షావుకారు లాక్కెళ్ళిపోవడం అనేది అప్పటినుండి ఇప్పటివరకు ఊర్లలో మనం చూస్తూ ఉన్నటువంటి ఒక దుర్మార్గపు ఆనవాయితీ. ఈ ఆనవాయితీని "సావుకారు" అనే కథలో చర్చిస్తాడు రచయిత. అటువంటి దురాచారం కింద తాను కష్టించి పనిచేసిన పంటను మొత్తం షావుకారు తోలుకొనిపోవడానికి వచ్చినప్పుడు ఎలాగైనా షావుకారు పీడని గ్రామానికి తొలగించాలి అని అనుకున్న బంజారా రైతు "వాచ్య" సావుకారు కాళ్లు పట్టుకొని గిరగిరా తిప్పి నేలకు కొట్టి చంపి జైలుకు వెళ్తాడు. తాను జైలుకు వెళ్లినా ఊరు సావుకారు అప్పులబారి నుండి బయటపడి, ఊర్లో రైతులందరూ సుఖంగా సంతోషంగా ఉంటారు అని నమ్మి, పదుగురి సంతోషం కోసం తాను జైలుకు వెళ్లడానికి షావుకారును చంపడానికి సిద్ధపడిన ఒక అమాయకమైన గిరిజన రైతు కథ "సావుకారు". ఇది రచయితలో అంతర్లీనంగా ఉన్న తిరుగుబాటు ధోరణికి, విప్లవ భావజాలానికి మచ్చుతునకగా చెప్పవచ్చు. "అణచివేత అధికమైతే తిరుగుబాటు తీవ్రమౌతుంది" అనే వ్యాఖ్య ఈ కథలో మనకు రచయిత రూఢిపరుస్తాడు. అమాయకులైన గిరిజన రైతులు తమ ధన, మాన, ప్రాణాలను, పంటలను, పంట భూములను దక్కించుకోవడానికి ఆత్మగౌరవ బావుటా ఎగురవేయడానికి, ఒక్కొక్కరుగా కలిసి దండుగా ఏర్పడి, పెత్తందారీవ్యవస్థ మీద తిరుగుబాటు చేయడం మనం చరిత్రలో చూసాం. ఆ చరిత్ర ఆనవాయితీ ఈ షావుకారు అనే కథలో రచయిత మనకు చూపెడతాడు.

1920-24 ప్రాంతంలో నల్లమల అరణ్యాలలో సంచరించే గిరిజన తెగల జీవితాన్ని గమనించిన చింతా దీక్షితులు "చెంచురాణి", "సుగాలి కుటుంబం", "యానాది బ్రతుకులు" అనే కథలను రాసి తొలి గిరిజన కథకునిగా పేరుపొందారు. ఆనాటి నుంచి తెలుగు కథాసాహిత్యంలో అడపాదడపా గిరిజనేతరులు రాసిన గిరిజన కథలు ప్రచురితమవుతున్నాయి. గిరిజనులు స్వయంగా తమ జీవిత వెతలను కథలుగా రాయడం ఇప్పుడిప్పుడే ప్రారంభం అవుతుంది. ఆ లెక్కన డా. సిల్మా నాయక్ "తొలి గిరిజన కథకులలో" ఒకరుగా చరిత్రలో నిలిచిపోతారు. బంజారా జీవితాలని స్పృశిస్తూ ఇంకా బంజారా సాహిత్యం బలంగా రావాలి. బంజారా లు తమకు మాత్రమే ప్రత్యేకమైనటువంటి జీవన విలువలను కలిగి ఉన్నారు . వారి ఆచార వ్యవహారాలు, సంప్రదాయాలు, కట్టుబాట్లు, భాష, ఆహారం అన్నీ కూడా తక్కిన కులాల నుండి విభిన్నంగా ఉంటాయి. ఆ విభిన్నతను సాహిత్యంలోకి తీసుకురావాలంటే అది గిరిజనేతర రచయితల వల్ల కాదు. అది సంపూర్ణంగా స్వచ్ఛంగా సాహిత్యంలో ఒదగాలి అని అంటే బంజారా రచయితలు మాత్రమే చేయగలరు. మనువాద అగ్రకుల ఆధిపత్యంవల్ల వెయ్యేళ్ల తెలుగు సాహిత్యంలో కావ్యనాయక, నాయికలు ఉన్నత కులాలకు చెందినవారే ఉన్నారు. ఏకలవ్యుడు, ఘటోత్కచుడు లాంటి పాత్రలు వీరోచితమైన, ప్రతిభావంతమైన పాత్రలుగా ఉన్నప్పటికీ, వారికి పేరు ప్రఖ్యాతులు రాకుండా ఆ పాత్రల నిడివి తగ్గించి సాహిత్యంలో చిత్రించి, ఆయా జాతుల ప్రతినిధిత్వాన్ని కుచింపచేశారు. అలా కాకుండా నిమ్నజాతుల నుండి వచ్చినవారు నాయకులుగా ప్రధానమైన సాహిత్యం రావాల్సిన అవసరం ఉంది. ఆ కులాల్లో, మీదు మిక్కిలి బంజారాల, ఆదివాసీల నుండి వచ్చినవాళ్ల కేంద్రంగా సాహిత్యం సృష్టించబడితే ఈ 1,000 ఏళ్ల సాహిత్య పరంపర చేసుకున్నటువంటి పాపం కడగబడి పునీతమవుతుంది కాబట్టి ఆ లోటును అగ్రకుల రచయితలు ఎలాగూ పూడ్చరు కాబట్టి దాన్ని బంజారా రచయితలు పూడ్చవలసిన బాధ్యతను కలిగి ఉన్నారు. జనాభాపరంగా మిక్కిలిగా ఉన్న బంజారాలు సాహిత్యపరంగా ఎక్కువగా రాస్తూ ఉండాల్సిన అవసరం ఉంది. ఆచార్య సూర్యా ధనుంజయ్, సూర్యకళ రాథోడ్, రమేష్ కార్తీక్ నాయక్, కేతావత్ సైదులు తదితరులు ఇప్పటికే సీరియస్ గా సాహిత్యాన్ని రాస్తున్నారు. ఈ పరంపర ఇలాగే కొనసాగి డా. సిల్మా నాయక్ కలం నుండి మరింత చిక్కనైన బంజారా సాహిత్యం వెలువడాలని కోరుకుందాం.

★ రచయిత: అసిస్టెంట్ ప్రొఫెసర్, టిఎస్‌పి ఓరియంటల్ కళాశాల

# కటిక దరిద్రుల ఆకలి పోరాటం-తంగలాన్

తాడి ప్రకాశ్

వాళ్ళు-పేదవాళ్ళు, కూటికి గతిలేనివాళ్ళు, మూల వాసులు, దళితులు, ఎండుగడ్డి పోచలు, మొలకు గోచీల వాళ్ళు... భార్యల్తో బిడ్డల్తో అరణ్యాల్లో నడుస్తూ... బంగారం అనే అంతుచిక్కని ఐశ్వర్యం వేటకు బయల్దేరుతారు. అటు ఒక పసిడి భూతం ఈ దరిద్రులను వెన్నాడుతూ వుంటుంది. ఇది ఒక పురాతన జానపద గాథ. నెత్తురూ, కన్నీళ్ళూ కలిసి ప్రవహించిన కథ. ఆధునిక కెమెరాలతో, ఉన్నత సాంకేతిక పరిజ్ఞానంతో వందల ఏళ్ళ క్రితం జరిగిన ఒక ఘాతుకాన్ని చూపించిన సాహసం పేరు- తంగలాన్. కొన్ని నిజజీవిత సంఘటనలు, కొంత కల్పన, పేదల వేదన కలిసిన తిరుగుబాటు సిద్ధాంతం- తంగలాన్.

సర్పట్ట చూశారా? కాలా చూసే వుంటారు. ఇప్పుడు తంగలాన్. వీటిని తీసిన పారంజిత్ అనేవాడు మామూలు మనిషి కాదు. మహాదర్శకుడు. కన్నీటి కావ్యామృత రసావిష్కరణ తెలిసిన మాంత్రికుడు. మన కాలంవీరుడు. 'నేను అంబేద్కరిస్ట్'ని అని ప్రకటించుకున్న రంజిత్, రొటీన్ రొడ్డకొట్టుడు చిల్లర ప్రచార సినిమాలు తీయడు. అతని ఆవేశానికో అర్థం వుంది. అతని ఆగ్రహానికో పద్ధతి వుంది. అతని తిరుగుబాటుకో లక్ష్యముంది. తంగలాన్ తీయడం వెనుక వున్నది పరిశోధన, కమర్షియల్ ప్లాన్ మాత్రమే కాదు. అదొక తపస్సు. చెక్కుచెదరని నిబద్ధత. ఒక సూపర్ హీరోకి గోచీ పెట్టి దుర్గమారణ్యాల్లో నడిపించిన దుస్సాహసం.

కోలార్ బంగారు గనుల్ని మొట్టమొదట కనిపెట్టడానికి జరిగిన సాహసయాత్రలో చరిత్ర చూసిన కన్నీళ్ళనీ, రక్తపుటేర్లనీ, వీరుల చావునీ, ఆడవాళ్ళ నిస్సహాయతనీ ఒళ్ళు జలదరించేలా రికార్డు చేయడంలోని నిజాయితీ మనల్ని షాక్ చేస్తుంది. అటు అగ్రవర్ణ బ్రాహ్మణ దురహంకారం, ఇటు హృదయం లేని బ్రిటిష్ పాలకుల దౌర్జన్యం. దళిత, బహుజనులకు వెనక తుపాకులూ, ముందు మొనదేలిన ఈటెలూ...

బంగారం ఒక తీరని దాహం. దురాశ.

ఇటు నిరుపేద తల్లుల బిడ్డల ఆకలి!

ఇలాంటి ఒక మానవ మహావిషాదాన్ని డాక్యుమెంటరీగా తీస్తే చాలదు. నీరసంగా నడిచే కళాత్మక చిత్రంగా తీసినా కుదరదు. ఎఫెక్టివ్ గా చెప్పాలంటే, కమర్షియల్ స్కీమ్ తోనే కొట్టాలి. బలమైన బ్లాక్ బస్టర్ టెక్నిక్‌తోనే చెలరేగిపోవాలి. ఆ ఎత్తుగడ ఫలించింది. పారంజిత్ గెలిచాడు. బీభత్సరస ప్రధానమైన ఒక చారిత్రక విషాదాన్ని మన కళ్ళముందు పరిచాడు.

'చియాన్' విక్రమ్ ఒక మార్మిక శక్తిగా మారి ముందుండి ఈ సినిమాని నడిపించాడు.

'సేతు' చిత్రంలో చియాన్ పేరుతో విక్రమ్ పాపులర్ అయ్యాడు. అదే తెలుగులో శేషు. హిందీలో తేరే నామ్. విక్రమ్ దిక్కులేని దరిద్రుడిగా, ధైర్యవంతుడిగా, పేదరికానికి పుట్టిన మానవమృగంలా, ఇంగితం వున్న మూలవాసుల నాయకుడిగా, బానిస బంధనాల్ని తెంచుకున్న విముక్తి పోరాటయోధుడిగా ప్రతి ఒక్కర్నీ మెప్పించాడు. పాత్రలో అంత సహజంగా ఇమిడి పోవడంలో వున్న శ్రమ, కళ పట్ల అతనికి వున్న అపారమైన ప్రేమ వెలకట్టలేనివి.

విక్రమ్ భార్యగా, ముగ్గురు బిడ్డల తల్లిగా, కొద్దిపాటి ఆనందాన్ని, పెనువిషాదాన్నీ అలవోకగా పండించిన మలయాళ నటి పార్వతీ తిరువొత్తుని మనం ఎప్పటికీ మరచిపోలేం.

నల్లగా నిగనిగలాడిన మరో పేదరాలు, తమిళ నటి ప్రీతీకరణ్ పాత్ర ఔచిత్యానికి పర్యాయపదంగా మనసు దోచుకుంటుంది. ఆ అంటరాని మారుమూల పల్లెలో, పూసినా, దుమ్మెత్తిపోసినా చలనం లేని కటిక దరిద్రపు బతుకులు వాళ్ళవి.

ఆ గ్రామంలో ఏ ఆడదీ జాకెట్టు వేసుకోదు. బిడ్డల ఆకలి తీర్చడమే అలవికానిపని. అక్కడ జాకెట్లకీ, షోకులకీ ఆవగింజంత అవకాశమూ లేని పాడుకాలం అది. "వారేయ్ పనికిమాలినోడా, నాకో జాకెట్ తెచ్చిస్తావా?"అని మొగుడు విక్రమ్‌ని అడుగుతుంది పార్వతి. ఒక పోరాటంలో గెలిచి, బ్రిటిష్ దొరల మెప్పు పొందిన తంగలాన్ బోలెడన్ని జాకెట్లు పట్టుకుని ఇంటికి వస్తాడు. అప్పుడు చూడాలి పార్వతి బుగ్గల్లోంచి ఉబికి వచ్చే ఆనందం. ఆడాళ్ళందరూ జాకెట్లు వేసుకుని మురిసిపోతుంటారు.

అప్పుడు మొదలవుతుంది ఒక సెలబ్రేషన్. ఒక బృందగానం, ఒక గిరిజన నృత్య కోలాహలం. ఆ హొయలు..

ఆ తూగు.. ఆ జీవన సౌందర్యం పూలతీగలా మనల్ని చుట్టుకునే పరిమళం.

పార్వతీ, ప్రీతీ– ఇద్దరిదీ మనోహరమైన చిరునవ్వు. ఫోటోగ్రాఫరూ, పారంజిత్ ఏమైపోయారో గానీ, జనం మాత్రం పరవశించి చిత్తై, చచ్చి సున్నమైపోతారు. దర్శకుడి మీద ఎంత గౌరవం కలిగిందంటే, వాళ్ళెవరికీ కొన్ని డజన్ల మంది ఆడవాళ్ళకి రవికెలు వుండవు కదా, ఐనా ఒక్కసారి కూడా, ఒక్క స్త్రీని కూడా అశ్లీలంగా చూపించే పని చేయలేదు.

బుద్ధ జాతకకథల్లోని 'హారతి', ఈ సినిమాలో బంగారాన్ని, ప్రాణాలకు తెగించి రక్షించే వనదేవతగా వుంటుంది. ఆనాటి మూఢనమ్మకాలకూ, భయాలకూ, అపోహలకూ ప్రతీకగా ఒక సర్రియలిస్ట్ నేరేటివ్ పవర్‌తో, గావు కేకలు పెట్టి, నెత్తురు కళ్ళజూసే గిరిజన దేవతగా మాళవికా మోహనన్ అనే గ్లామర్ స్టార్ మూలవాసుల్నీ, ప్రేక్షకుల్నీ భయకంపితుల్ని చేస్తుంది. ఇదో పవర్ఫుల్ క్రియేటివ్ టెక్నిక్.

తంగలాన్‌కి పీడకలలు వస్తుంటాయి. తాత చెప్పిన పురాతన గాథల్లోని ఆపదలూ, అపశకునాలూ అతన్ని వొణికిస్తుంటాయి. చూసేవాళ్ళకి విభ్రాంతి కలిగేలా ఈ కలల్ని మేజికల్ రియలిజంలా ఒక మాయలా, మార్మికంగా చేసిన విజువల్ ప్రెజెంటేషన్– పారంజిత్‌కి మహా రచయిత గాబ్రియల్ గార్షియా మార్క్వెజ్ పూనాడా అని అనిపిస్తుంది. ఇది సామాన్య ప్రేక్షకుడికి కనక్ట్ కావడం కష్టమే! ఎవర్ని ఎవరు చంపుతున్నారో తెలియని ఒక ఉన్మాదం లాంటి కేయాస్‌ని అద్భుతంగా చూపగలిగిన జీనియస్ రంజిత్. తంగలాన్‌లో కొన్ని లోపాలు వున్నాయని చెప్పవచ్చు. ఐతే, బాధితుల పక్షాన నిలిచిన పారంజిత్ కమిట్‌మెంట్ ముందు, సముద్ర కెరటాల్లా విరుచుకుపడిన సృజనాత్మక తిరుగుబాటు ముందు, చీకటిలో వెలిగించిన ఆశాదీపాల కాంతి ముందు అవి వెలవెలబోతాయి.

అడవిలో, కొండ దగ్గర చటుక్కున ఒక నెమలి ఎగిరి రెండు మూడుచోట్ల వాలుతుంది. అక్కడ బంగారం వుంటుందని అర్థమైపోతుంది. నెమళ్ళకి బంగారం ఎక్కడ వుందో పసిగట్టే శక్తి వుందో లేదో మనకి తెలీదు గానీ, చూడ్డానికి అదెంతో బావుంది. కొండల్లో నిక్షిప్తమై వున్న బంగారాన్ని కాపాడే విషసర్పాలు వందల్లో జరజరా పాకి వచ్చి దాడి చేస్తాయి. ఎగిరి దూకిన ఒక నల్లచిరుత హఠాత్తుగా వూడిపడుతుంది. మరోచోట కత్తివేటుకు కొండదేవత పొట్ట చీరుకుపోయి నెత్తురు ధారలై పారుతుంది. కొద్దిసేపటికి ఆ ప్రాంతం అంతా బంగారం మిలమిలా మెరుస్తుంది. ఇలాంటి మేజికల్ సన్నివేశాలు వూపిరి సలపనివ్వవు. టిప్పుసుల్తాన్ నిరాశతో వెనుతిరిగిన కొండల్లో, లోతైన బావుల్లో, ప్రాణాలకి తెగించి పోరాడినా చేతికి దొరకని బంగారం దళిత బహుజనుల చీకటి జీవితాన్ని మార్చివేసే ఆ పసిడి వెన్నెల కాంతిని వాళ్ళు చూడగలుగుతారా? ఆ అడివిబిడ్డల ఆకలి తీరుతుందా?

హృదయాన్ని కదిలించే సంగీతం మనల్ని కుర్చీలో కూర్చోనివ్వదు. కళాత్మకమైన ఫోటోగ్రఫీ మనశ్శాంతిని మిగల్చదు. బ్రాహ్మల మీదా, బ్రిటిష్‌వాళ్ళ మీదా ఎండు గడ్డిపోచల్లాంటి, దరిద్రదేవత బిడ్డలు దళితులు విజయం సాధించేదాకా పారంజిత్ ఊరుకోడు.

చరిత్ర కొంచెం తెలిసివుంటే ఈ సినిమా విలువ ఏమిటో ఇట్టే అర్థం అవుతుంది. శిస్తు కట్టలేదనే నెపంతో దళితుల భూముల్లో వాళ్ళనే కట్టుబానిసల్ని చేసి, వెట్టిచాకిరీ చేయించే రాక్షసత్వం మీద తిరుగుబాటే తంగలాన్. సాహసించి, తెగించి, ప్రాణాలు వొడ్డి పోరాడి తన నేలతల్లినితాను సాధించుకుంటాడు. ఆధిపత్యం తలకెక్కిన దొరలు దిగివచ్చి 'పత్రాలు' ఇచ్చేస్తారు. వెండితెర నిండుగా పరుచుకున్న తన సొంత పొలంలో మట్టిపెళ్ళల మీద గుండె నిండిన సంతోషంతో విక్రమ్ వెల్లకిలా పడుకుంటాడు. సంగీతం మనల్ని వెన్నాడుతుంది. కళ్ళలో నీళ్ళు తిరిగే సన్నివేశం యిది.

ఇది భూమి సమస్య. బతుకు సమస్య. మూలవాసులకు చావోరేవో తేల్చుకునే విషమ సమస్య. ఆ బాధని గుండెలవిసి పోయేలా చిత్రీకరించగలగటం ఈ దర్శకుడు సాధించిన విజయం. బంగారంతో పాటు చరిత్రనీ తవ్వి తీయగలిగాడు.

2024లో నిస్సందేహంగా ఉత్తమ జాతీయ చిత్రం 'తంగలాన్'. మరో అరడజను అవార్డులు ఎలాగూ వస్తాయి. ఇంతకీ మన సంగతేంటో..!

అదేంటి? తెలుగులో ఇలాంటి సినిమాలు తీయగలిగే మొనగాడే లేడా? అని మనం ఆశ్చర్యపోవడం శుద్ధ దండగ. మనం హేపీగా, నిష్పూచీగా, గుంపులు గుంపులుగా 'మిస్టర్ బచ్చన్' సినిమాకో, 'డబుల్ ఇస్మార్ట్'కో ఎగురుకుంటూ వెళదాం. డప్పులు కొడదాం. రంగుల కాగితాలు ఎగరేద్దాం. అభిమాన హీరో కటౌట్లకి పాలాభిషేకాలు చేద్దాం. పువ్వులు విసురుదాం, గంతులు వేద్దాం. మన తెలుగు పైశాచిక స్వర్గంలో. దిక్కుమాలిన అలగాజనం గురించి ఆవేశపడిపోతూ తీసే తంగలాన్ లాంటి బుద్ధిలేని సినిమాలు చూసి హేళనగా నవ్వుకుందాం. జై తెలుగు సినిమా.

కొసమెరుపు: హిందుత్వ జపం చేస్తూ, ఆ రకం సినిమాలు వరసగా వరదలా తీస్తున్న ఈ సందర్భంలో 'తంగలాన్' బాంబ్ షెల్‌లా వచ్చిపడింది. "What an impeccable timing your majesty"–Lion Kingలో ఫేమస్ డైలాగ్.

★ రచయిత: సీనియర్ జర్నలిస్టు

RNI Number : APTEL /2011/37247
ISSN 2349 - 2376



## Save Nature - Save Future

Address for communication
Editor,
Nadusthunna Telangana
Flat no.301,
vaishnavi smart apartments,
street no.2, Kakateeya Nagar,
Habsiguda, Hyderabad-500007

**Printed, Published and Owned by** M.SNEHA LATHA Printed at: TELANGANA PUBLICATIONS, H.No.1-1-305, P.No.17, Road No. 6, Balaji Colony, Mohan Nagar, Kothapet, Saroornagar(M), Ranga Reddy-500035., Published at : TELANGANA PUBLICATIONS, H.No.1-1-305, P.No.17, Road No.6, Balaji Colony, Mohan Nagar, Kothapet, Saroornagar(M), Ranga Reddy-500035., Editor :Dr.C.KASEEM. RNI No. APTEL/2011/37247